www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 240 | సోమవారం | 19 ఫిబ్రవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

కొండల్లో కూలిన ఇరాన్ విమానం

11

66మంది దుర్మరణం



కెటిఆర్‌కు జర్మనీ సదస్సు ఆహ్వానం



హంబర్గ్‌లో 2న జరిగే జర్మన్ ఏసియా పసిఫిక్ బిజినెస్ సమావేశంలో రౌండ్ టేబుల్ భేటీ 2



ప్రాంతీయ రైతు సదస్సులు

3

- 25న హైదరాబాద్ • 26న కరీంనగర్‌లో రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులు
- త్వరలో 42మందితో రాష్ట్ర సమితి • రైతులకు సబ్సిడీపై సాగు యంత్రాలు • ఏప్రిల్ 20న ప్రారంభించి, రెండు విడతల్లో పెట్టుబడి చెక్కులు
- ప్రగతిభవన్ సమీక్షలో సిఎం కెసిఆర్ ప్రకటన

1048 ఎకరాలు భూంఫట్

పోడు భూమి పట్టాలు పొందిన పేద రైతులకు టోకరా

- పొట్టకూటి కోసం వలసలు వెళ్లగా దురాక్రమణ
- నల్లగొండ జిల్లా దున్నపోతులగండిలో కబ్జాదారుల భూగోతం
- సమగ్ర సర్వేలో బయట పడిన చేదు నిజాలు



మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి : నల్లగొండ జిల్లా అడవి దేవులపల్లి మండలం మొల్కచెర్ల రెవెన్యూ శివారులోని ఇందిరానగర్ దున్నపోతుల గండిలో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా భూమి దురాక్రమణకు గురైంది. గతంలో అటవీ శాఖకు చెందిన ఈ భూముల్లో పోడు చేసిన రైతులకు పట్టాలు ఇచ్చారు. ఆ భూమిని ఇతరులు స్వాధీనం చేసుకొని పట్టాదారులను భూమిపైకి రాకుండా అడ్డుకుంటున్నారు. నల్లగొండ జిల్లా అడవిదేవుల పల్లి మండలం మొల్కచెర్ల రెవెన్యూ శివారులో అటవీ శాఖ ఆధీనంలో వేలాది ఎకరాల భూమి ఉంది. 1973–74లో భూమిలేని నిరుపేద రైతులు ఇక్కడి చెట్లను నరికి పోడు సాగు చేయడం మొదలుపెట్టారు. దాంతో అటవీశాఖ అధికారులు విచారణ జరిపి ఒక్కొక్క రైతుకు రెండున్నర ఎకరాల చొప్పున లావోణి పట్టాలు ఇచ్చారు. ఆ పట్టాలు పొందిన రైతులు కొంతకాలం అనేక వ్యయ ప్రయాసాలకోర్చి సాగు చేశారు. అయితే సరైన నీటి వసతి లేకపోవడంతో వల్ల పడుతున్న శ్రమ వృధా కావడంతో వారు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళారు. అదే అదునుగా భావించి, చదును చేసిన ఆ భూమిపై కొందరు నేతలు కన్ను వేశారు. బోర్లు వేయించి ఇతర మార్గాల్లో నీటి వసతి కల్పించి ఆ భూములను ఆక్రమించుకున్నారు. ఇక్కడ 1048 ఎకరాల భూమిని పట్టాలు పొందిన వారు కాకుండా ఇతరులు ఆక్రమించుకున్నారని ప్రస్తుత భూసమగ్ర సర్వేలో బయటపడింది.అయితే తామే కబ్జాలో ఉండి సాగు చేస్తున్నామని, ఆ భూమి తమకే చెందాలని ఆక్రమణదారులు ఒత్తిడి చేయడం ప్రారంభించడంతో రెవెన్యూ అధికారులు రీ సర్వేకి నిర్ణయించారు. దీనిని ఉపయోగించుకొని ఆ భూమిని తమ వారికి చెందేలా చేసుకోవాలని తరువాయి 6లో

వెల్లువగా కొలువుల పిలుపులు!

- ఇక పూర్తిస్థాయిలో ఉద్యోగకల్పన • పరీక్షలకు సమాయత్తతవైపు యువత దృష్టి కేంద్రీకరించక తప్పనిస్థితి • పలు పథకాల ద్వారా ఇతర అన్ని వర్గాలకు దగ్గరైన నేపథ్యంలో నిరుద్యోగ నిర్మూలన కృషిలో నిమగ్నమవ్వాలని ప్రభుత్వం సంకల్పం



మన తెలంగాణ/ హైదరాబాద్ : వివిధ సంక్షేమ పథకాల ద్వారా దాదాపు అన్ని సెక్షన్ల ప్రజలకు దగ్గరయ్యామని భావిస్తున్న ప్రభుత్వం ఇకపైన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించడంపై దృష్టి సారించనుంది. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లను విడుదల చేయడంతోపాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు 28 వేల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించినట్లు వివరిస్తున్న ప్రభుత్వం కనీసంగా మరో 85 వేల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించే దిశగా ఆలోచిస్తూ ఉంది. విపక్షాలకు ఎన్నికల ప్రచారాస్త్రమే లేకుండా చేయాలన్నది అధికార పార్టీ ఆలోచన. విపక్ష పార్టీలతో పాటు టిజెఏసి ఛైర్మన్ కోదండరాం రానున్న ఎన్నికల్లో వ్యవసాయ, నిరుద్యోగ అంశాలపై దృష్టి పెట్టే వాతావరణం నెలకొన్న నేపథ్యంలో అలాంటి అవకాశమే ఉండరాదన్న ఉద్దేశంతో అధికార పార్టీ ఆలోచనలు చేస్తూ ఉంది. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండకోట నుంచి సిఎం చేసిన ప్రసంగంలో సైతం 84,876 ప్రభుత్వ ఉద్యోగాలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు లక్ష ఉద్యోగాల హామీ ఇచ్చినా ఆచరణలో అంతకంటే ఎక్కువే ఇస్తామని, మొత్తం ఉద్యోగాల సంఖ్య 1,12,536 అవుతుందని వ్యాఖ్యానించారు. గత అసెంబ్లీ సమావేశాల్లో సైతం 'ఇచ్చిన తరువాయి 6లో

నీరవ్ బినామీలు

• 200 డొల్ల కంపెనీలు • ఇడి తనిఖీలు, సోదాల్లో కొల్లలు ఆస్తులు



న్యూఢిల్లీ : నీరవ్ మోడీ పిబిఐ స్కామ్ నేపథ్యంలో దాదాపు 200 డొల్ల కంపెనీలను, భారీగా బినామీ ఆస్తులను గుర్తించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను వజ్రాల వ్యాపారి నీరవ్ మోసగించిన తరువాత ఆయనకు చెందిన కంపెనీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) భారీ స్థాయిలో సోదాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో నీరవ్, ఆయన మామ, వ్యాపార భాగస్వామి మోహుల్ ఛోక్సీలు రూ 11,400 కోట్ల మేర బ్యాంకుల కుంభకోణానికి పాల్పడిన విషయం ఇప్పుడు పలు ప్రకంపనలకు దారితీసి, డొల్ల కంపెనీలు భారీ స్థాయిలో బినామీ ఆస్తుల లావాదేవీలు సాగుతున్న తీరు వెలుగులోకి రావడానికి దారితీసింది. నీరవ్, ఛోక్సీ ఇతర కంపెనీలపై నాలుగోరోజు అయిన ఆదివారం కూడా ఇడి వర్గాలు సోదాలు నిర్వహించాయి. ఇప్పటికే 24కు పైగా వీరి స్థిరాస్తులను పిఎంఎల్‌ఎ పరిధిలో ఇడి ఆటాచ్ చేసుకుంది. మోడీ ఆయన కుటుంబ సభ్యులు, కంపెనీలకు చెందిన 29 ఆస్తులను గుర్తించి ఇన్‌కంటాక్స్ శాఖ ప్రాథమికంగా అటాచ్ చేసుకుందని , వీటిని ఇడి అక్రమ ఆర్థిక లావాదేవీల నివారణ చట్టం పరిధిలో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. త్వరలోనే పిఎంఎల్‌ఎ పరిధిలో మరికొన్ని ఆస్తులను అటాచ్ చేసుకునే వీలుందని ఇడి సీనియర్ అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. గీతాంజలి ఇతర కంపెనీల వ్యవహారాలపై దృష్టి సారించిన క్రమంలోనే 200 దమ్మి కంపెనీలు వెలుగులోకి వచ్చినట్లు , దేశంలో విదేశాలలో మారుపేర్లతో ఆస్తులను సృష్టించుకున్నట్లు కనుగొన్నామని అధికారులు తెలిపారు. భూములు, బంగారం, విలువైన ఖనిజాలు వంటివాటి రూపంలో ఆస్తులు ఉన్నట్లు , తప్పుడు తరువాయి 6లో

రోటోమాక్ టోపీ రూ.800 కోట్లు

9

పంజాబ్ బ్యాంకుల లూటీలో తాజా ఉదంతం

త్రిపురలో 76% పోలింగ్

10

ఫలితాలు మార్చి 3న వెల్లడి

కుంచెపోటు



అది తిట్టు కాదురా అంటే వినిపించుకోవేం..?

మొదలు కాని ముద్రణ?

- సాంకేతిక సమస్యల వల్ల ఇంకా ప్రారంభం కాని కొత్త పట్టాదారు పుస్తకాల ప్రింటింగ్!
- రెండు రోజుల్లో షురూ అవుతుందని, సకాలంలో పూర్తి చేస్తామని అధికారుల ధీమా



మన తెలంగాణ/హైదరాబాద్ : పట్టాదారు పాస్‌బుక్‌ల ముద్రణ ఇంకా ప్రారంభం కాలేదు. ఇందుకు కారణం రైతులకు సంబంధించిన వివరాల (డాటా)ను పాస్‌బుక్‌లలో ముద్రించే సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడమేనని తెలిసింది. పాస్‌బుక్‌ల పంపిణీకి గడువు దగ్గర పడుతున్నా ముద్రణా పనులు ప్రారంభం కాకపోవడంపై సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ, ఒకటి రెండు రోజుల్లో ప్రింటింగ్ ప్రారంభమవుతుందని, అనుకున్న షెడ్యూలు ప్రకారమే ప్రక్రియను పూర్తి చేస్తామని వ్యాఖ్యానించారు. ఆధునిక ముద్రణా యంత్రాలు ఉన్నందువల్ల షెడ్యూలు ప్రకారమే అన్ని పాస్‌బుక్‌లు సిద్ధమవుతాయని ఆ అధికారి ధీమా వ్యక్తం చేశారు. ప్రైవేటు ముద్రణా సంస్థలేవీ పాస్‌బుక్‌లను ముద్రించడానికి ముందుకు రాకపోవడంతో నామినేషన్ పద్ధతిపైన కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఈ నెల మొదటివారంలోనే తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్‌కు, సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు మధ్య అవగాహనా ఒప్పందం కుదిరినా ఇప్పటివరకూ ముద్రణ పనులు ప్రారంభం కాలేదు. పాస్‌బుక్‌ల నమూనాలను పరిశీలించిన సిఎం కెసిఆర్ కవర్‌పేజీ ముదురు ఆకుపచ్చ రంగులో ఉండాలని, తన ఫోటోను పెట్టవద్దని స్పష్టంగా చెప్పారు. వచ్చే నెల 11వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి రైతులకు పాస్‌బుక్‌లను పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. టిఎస్‌టిఎస్‌తో ఒప్పందం కుదుర్చుకోడానికి ముందు సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ రోజుకు కేవలం ఏడు వేల పుస్తకాలను మాత్రమే ముద్రించగలుగుతామని చెప్పినా ప్రభుత్వం మాత్రం లక్షల సంఖ్యలో ముద్రించగలుగుతుందని, సకాలంలోనే అన్ని పుస్తకాలు తయారవుతాయని, ఆందోళనపడాల్సిన పనేమీ లేదని ఆ అధికారి ధీమా వ్యక్తం చేశారు. కేవలం తరువాయి 6లో

విడియోలో అవతల వ్యక్తి చూస్తుండగానే

విద్యార్థిని ఆత్మహత్య



మనతెలంగాణ/పేట్‌బషీరాబాద్: ఉరేసుకొని ఎంబిఎ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనంతపూర్‌లోని విద్యుత్ నగర్‌కు చెందిన బుగ్గయ్య చౌదరి కుమార్తె హనీషా చౌదరి (20) నగరంలోని కొంపల్లిలోని శివాశివాని గ్రూపు ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లో ఎంబిఎ రెండో సంవత్సరం చదువుతూ గర్ల్స్ హాస్టల్‌లో నివాసం ఉంటుంది. అయితే హనీషా చౌదరికి ఆదివారం మధ్యాహ్న సమయంలో సెల్‌ఫోన్‌లో ఓ వ్యక్తితో విడియో కాల్ మాట్లాడి అనంతరం ఆ వ్యక్తి చూస్తుండగానే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు కోసం ఆరా తీశారు. అనంతరం మృతదేహన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు తరువాయి 6లో

జర్మనీలో వాణిజ్య సదస్సుకు మంత్రి కెటిఆర్‌కు ఆహ్వానం



మన తెలంగాణ/హైదరాబాద్: జర్మనీలోని హాంబర్గ్‌లో వచ్చే నెల 2న జరిగే జర్మన్ ఏసియా పసిఫిక్ బిజినెస్ అసోసియేషన్ 98వ అంతర్జాతీయ సమావేశానికి హాజరు కావాల్సిందిగా మంత్రి కెటిఆర్‌కు ఆహ్వానం అందింది. ఆసియా దేశాలతో వ్యాపార వాణిజ్య అవకాశాలను చర్చించడం ప్రధాన ఎజెం డాగా ఉన్న ఈ సమావేశానికి సుమారు 300 మంది వ్యాణిజ్యవేత్తలు, రాజకీయ ప్రతినిధులు, దౌత్య వేత్తలు హాజరవుతారని అసోసియేషన్ తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం మూడే ళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ, ఆర్థిక విధానాలపైన జర్మన్ వ్యాపార వర్గాలకు ఆసక్తి ఉందని, తమ దేశంలోని అగ్రస్థాయి వ్యాపార వేత్తలతో ప్రత్యేకంగా ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించాల్సిందిగా కెటిఆర్‌కు ఆహ్వానం పంపింది. ఈ సమావేశంలో తెలంగాణ, జర్మన్ మధ్య వాణిజ్యబంధం మరింత విస్తృత మవుతుందని అసోసియేషన్ ఆశాభావం వ్యక్తం చేసింది. తెలంగాణలోని వ్యాపార అవకాశాలపైన సంస్థ ప్రత్యేకంగా ఆసక్తి వ్యక్తం చేయడం, అలాగే తనకు ఆ ఆహ్వానం పంపడం పట్ల మంత్రి కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు.

కోళ్ల ఫారాలపై మున్సిపల్ నజర్

ఆదాయం పెంచుకునేందుకు కొత్త ఆలోచన



మన తెలంగాణ/హైదరాబాద్: ఆదాయాన్ని పెంచుకునేందుకు వివిధ పద్ధతులను అన్వేషిస్తున్న మున్సిపల్ శాఖ తాజాగా కోళ్లఫారం షెడ్లపై దృష్టి కేంద్రీకరించింది. పన్నులను పెంచకుండా ప్రస్తు తం ఉన్న వనరులతోనే ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇందు లో భాగంగానే కోళ్ల ఫారాలకు సంబంధించిన పన్నులపై ఆరా తీస్తోంది. ప్రధానంగా వివిధ మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో ఎన్ని కోళ్లఫారాల షెడ్లు ఉన్నాయి, వాటికి సంబంధించి ప్రస్తుతం వసూలవుతున్న పన్నులు, బకాయిల వసూళ్ళపై ప్రత్యేక దృష్టిసారించింది. 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఉన్న డిమాండ్, వసూలు చేసిన మొత్తం, ప్రస్తుతం ఉన్న బకాయిల వివరాలను సేకరిస్తోంది.

కోళ్లఫారాల షెడ్లకు సంబంధించి పన్నుల విషయంలో తమకు స్పష్టత ఇవ్వాలని ఇటీవలే బడంగ్ పేట నగర పంచాయతీ మున్సిపల్ శాఖను కోరింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కోళ్లఫారాల సంఖ్య ఎన్ని ఉన్నాయి..? వాటి నుంచి ఎంత మేర పన్నుల రూపంలో వసూలవుతున్నాయో తెలుసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలికల పరిధిలోని కోళ్లఫారాల షెడ్లు, వాటి నుంచి ప్రస్తుతం వసూలవుతున్న పన్నులు, బకాయిల వివరాలను సేకరించి సమగ్ర నివేదికను అందజేయాలని స్థానిక సంస్థలను మున్సిపల్ శాఖ ఆదేశించింది. దీనికి సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించేందుకు ప్రత్యేక నమూనాతో కూడిన ఫామ్‌ను స్థానిక సంస్థలకు అందజేసింది. వాటి ఆధారంగా కోళ్లఫారాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించనుంది. కోళ్ళఫారాల అసైన్‌మెంట్, క్షేత్రస్థాయిలోని వివరాలకు మధ్య ఉన్న వ్యత్యాసం తెలుస్తుందని, తద్వారా పన్నుల విషయంలో ఇక అంచనాకు రావొచ్చని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇప్పటివరకు కోళ్లఫారాలకు సంబంధించిన సమగ్ర సమాచారం లేకపోవడంతో వాటిపై పెద్దగా దృష్టిసారించలేదని, సమగ్ర వివరాలు వస్తే ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. గతంలో కోళ్లఫారాల నుంచి వసూలైన మొత్తంతో పాటు మొత్తంగా ఉన్న కోళ్లఫారాల సంఖ్యను అధికారులు బేరీజు వేస్తున్నారు. వీటి ఆధారంగా భవిష్యత్తులో కోళ్లఫారాలకు సంబంధించిన షెడ్ల నుంచి ఎంత మేర ఆదాయం వస్తుందో ఒక అంచనాకు రావడంతో పాటు పన్నుల విషయంలో కూడా ఒక నిర్ణయం తీసుకోవాలని అధికార వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

పంచాయతీ ఎన్నికలకు నిబంధనలు

మన తెలంగాణ/హైదరాబాద్: పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి గతంలో ఉన్న నిబంధనలకు మరికొన్నింటిని చేర్చడంపై రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి పెట్టింది. ఇప్పటికే అనేక కొత్త నిబంధనలను రూపొందించగా, ప్రస్తుతం మరికొన్నింటిని రూపొందిచనుంది. గత ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈసారి అవి పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతోంది. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందితో పాటు ఎవ్వరూ సెల్‌ఫోన్లు, కార్డ్‌లెస్ ఫోన్లను వెంట ఉంచుకోవడంపై నిషేధాజ్ఞలు విధించింది. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు, ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరం వరకూ ఈ నిషేధాజ్ఞలు వర్తిస్తాయని పేర్కొనింది. ఒకవేళ గుర్తించినట్లయితే సీజ్ చేయాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసింది. పోటీ చేస్తున్న అభ్యర్థి సంతకంతో కూడిన నియామకపు పత్రం ఉన్న ఒక్కరిని మాత్రమే ఎన్నికల ఏజెంట్‌గా గుర్తించాలని, వారికి సంబంధిత ప్రొసీడింగ్ ఆఫీసర్ లేదా ఎన్నికల అధికారి అభ్యర్థి సంతకంతో కూడిన ఫోటోస్టాట్ కాపీని జారీ చేయాలని స్పష్టం చేసింది. ఏజెంట్‌కు రిలీఫ్ ఇవ్వడానికి నియమితులైన మరో వ్యక్తికి నిర్ణీత సమయం వరకు మాత్రమే పోలింగ్ కేంద్రం లేదా లెక్కింపు కేంద్రంలో ఉండాలని, బైటకు వెళ్లిన తర్వాత వారి కదలికలపై నిఘా పెట్టాలని ఆదేశాలు జారీచేసింది. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం కోసం మరికొన్ని కొత్త నిబంధనలను కూడా రూపొందిస్తున్నట్లు సమాచారం.

'మద్దతు'లో నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు

మన తెలంగాణ/హైదరాబాద్: మద్దతు ధర విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసే రైతు ఉద్యమాలు వస్తాయని, ఎర్రజొన్న, కంది పంటలను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపాన్ని నెట్టకుండా మద్దతు ధరపై సకాలంలో నిర్ణయాలు అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఒక ఎకరం జొన్న పంట వేయడానికి రైతు రూ.3,560 ఖర్చు పెడుతుండగా, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా రైతుకు అందడం లేదని, ఒక ఎకరం కంది సాగుకు రు.7601 రైతుకు ఖర్చు కాగా, క్వింటాల్‌కు రూ. 5450 మాత్రమే ప్రభుత్వం మద్దతు ప్రకటించిందన్నారు.

మూడో రోజూ పురుషోత్తమరెడ్డి బినామీల విచారణ



మన తెలంగాణ/హైదరాబాద్: హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురోషోత్తమ రెడ్డి కేసులో అతని ఇద్దరు బినామీలైన రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిశాంత్‌రెడ్డి, యాదవరెడ్డిలను మూడో రోజూ (ఆదివారం) ఎసిబి అధికారులు విచారించారు. కోర్టు ఆదేశాల మేరకు ఎసిబి అధికారులు వీరిద్దరినీ నాలుగు రోజుల పాటు విచారించాల్సి ఉంది. పురుషోత్తమరెడ్డి అక్రమంగా సంపాదించిన డబ్బులో కోట్లాది రూపాయలను రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబ డిగా పెట్టినట్లు ఏసిబి విచారణలో నిశాంత్‌రెడ్డి, యాదవరెడ్డి వెల్లడించినట్లు తెలిసింది. వీటిని ధృవీకరించే కీలక డాక్యుమెంట్లు ఇప్పటికే ఎసిబి అధికారు లకు చిక్కాయి. బినామీలు వెల్లడించిన అంశాలను రూఢీ చేసుకునేందుకు పురుషోత్తమరెడ్డిని కూడా కస్టడీకి తీసుకుంటామని ఎసిబి అధికారులు అం టున్నారు. కస్టడీ పిటిషన్‌పై సోమవారం నాంపల్లి కోర్టులో వాదనలు ఉన్నా యన్నారు.

మంచి సమాజం కోసం కలలుగనండి

- కెన్యా రచయిత గుగి వా థియాంగో



మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రతి ఒక్కరికీ కలలు కనే హక్కు ఉందని, ఒక మంచి సమాజం కోసం ప్రతి ఒక్కరూ కలలు కనాలని కెన్యా రచయిత గుగి వా థియాంగో వ్యాఖ్యానించారు. వలసవాద పాలనలో కెన్యాలో అయి నా, భారతదేశంలో అయినా నిర్బంధం అలాగే ఉందని అన్నారు. 'డ్రీమ్స్ ఇన్ ఎ టైమ్ ఆఫ్ వార్' అనే పేరుతో తన చిన్ననాటి వలసపాలనలోని కష్టాల ను, నిర్బంధాన్ని ఆత్మకథగా నవల రూపంలో 1978లో కెన్యాలోని 'కామిటి మాగ్జిమమ్ సెక్యూరిటీ జైలు'లో ఉంటూ టాయిలెట్ పేపర్ మీద రాశానని, ఇప్పుడు సాయిబాబా ఆ ఆత్మకథ నవలను జైలులో ఉండే 'యుద్ధకాలంలో స్వప్నాలు' పేరుతో తెలుగులోకి అనువదించారని గుర్తుచేశారు. 1996లో త నకు సాయిబాబాతో పరిచయం ఏర్పడిందన్నారు. ఈ తెలుగు పుస్తకాన్ని గు గి వా థియాంగో సహ విద్యార్థి అయిన మహిళా అధ్యయనాల నిపుణులు ప్రొఫెసర్ సుజీతారు నగరంలోని తెలుగు విశ్వవిద్యాలయంలోని అంబేద్కర్ ఆడియటోరియంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ నవలను సాయిబాబా కు అంకితమిస్తున్నట్లు ప్రకటించి, ఆయన సతీమణి వసంతకు ప్రతిని అంద జేశారు. తన ఆత్మకథను జైలు నిర్బంధంలో ఉన్న ప్రొఫెసర్ ఎన్.సాయి బాబా తెలుగులోకి అనువదించారంటే ఆయనతో ప్రత్యేకమైన బంధం ఉంద నిపిస్తుందని అన్నారు. తెలుగు నేలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నా రు. హైదరాబాద్‌కు ఉన్న సంబంధాన్ని, హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళుతుంటే తన స్వస్థలమైన కెన్యాలోని వాతావరణమే గుర్తుకు వస్తుందన్నా రు. ఒకే రకమైన ప్రాంతీయత కనిపించింది కాబట్టి తెలుగునేల ఆత్మీయంగా అనిపిస్తుందని పేర్కొన్నారు. మెదళ్లను వలసీకరణ చేయడం ద్వారా కలిగే దుష్ప్రభావాలను ఆయన వివరించారు.

టిజెఎసి పార్టీ పేరు తెలంగాణ జన సమితి?

- కోదండరామ్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్ణయం?

మన తెలంగాణ/హైదరాబాద్: త్వరలో ఏర్పాటు చేయనున్న రాజకీయ పార్టీకి 'తెలంగాణ జన సమితి' (టిజెఎస్) అనే పేరునే తెలంగాణ జెఎసి దాదాపు ఖరారు చేసింది. పార్టీని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సర్వశక్తులూ ఒడ్డాలని, అన్ని వర్గాలనూ భాగస్వాములను చేయాలని నిర్ణయించింది. పార్టీ ఆవిర్భావ సభ నిర్వహణకు రెండు వందల మంది సభ్యులతో 'సన్నాహక కమిటీ'ని ఏర్పాటు చేయాలని జెఎసి స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. మార్చి 10న మిలియన్ మార్చ్ కార్యక్రమానికి గుర్తుగా పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించాలని భావించినా భావసారూప్యత కలిగిన పార్టీలన్నీ ఆ రోజున మరో కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నందువల్ల పార్టీ ఆవిర్భావ సభ నాలుగు రోజుల తర్వాత(మార్చి 15న) జరిగే అవకాశం ఉంది. అయితే ఈ అంశంపై ఇంకా స్పష్టమైన నిర్ణయం జరగలేదు. వ్యక్తిగత పనిపై కోదండరామ్ అమెరికా వెళ్తున్నందువల్ల పది రోజుల అనంతరం తిరిగి వచ్చిన తర్వాత సభ జరిపే తేదీని, ప్రాంతాన్ని ఖరారు చేయనున్నారు. హైదరాబాద్‌లో జెఎసి కార్యాలయంలో ఆదివారం ఛైర్మన్ కోదండరామ్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర స్థాయి నేతలతో పాటు వివిధ జిల్లాల ఛైర్మన్లు, కన్వీనర్లు హాజరయిన ఈ సమావేశంలో రైతు, నిరుద్యోగ సమస్యలు, రాజకీయ పార్టీ అంశాలపై చర్చించారు.

భారీ స్థాయిలో పార్టీ ఆవిర్భావ సభ

రాజకీయ పార్టీ ఆవిర్భావ సభను ఘనంగా నిర్వహించాలనే అంశంపై స్పష్టత వచ్చినా హైదరాబాద్ నిర్వహించాలా లేక వరంగల్‌లో నిర్వహించాలా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. హైదరాబాద్‌లోనే సభ నిర్వహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడినట్టు సమాచారం. అయితే ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కొందరు ముఖ్య నేతలు, ద్వితీయశ్రేణి నాయకులు కోదండరామ్‌ను సూచించినట్టు సమాచారం. ఒంటరిగానే ప్రజల్లోకి వెళ్తామని, ఇప్పుడే పొత్తుల గురించి ఆలోచించవద్దని కోదండరామ్ జెఎసి శ్రేణులకు సూచించినట్లు తెలిసింది.

22, 23న పోస్ట్‌కార్డు ఉద్యమం

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఈ నెల 22, 23న పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టాలని కోదండరామ్ పిలుపునిచ్చారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి పేరుతో పెద్ద సంఖ్యలో పోస్ట్‌కార్డులను రాసి ప్రగతిభవన్‌కు పంపించాలన్నారు. రైతు సమస్యలపై జిల్లా సదస్సులనునిర్వహించాలని, అలాగే మార్కెటింగ్ యార్డులను సందర్శించి అక్కడి సమస్యలను జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలను అందజేయాలని స్టీరింగ్ కమిటీ నిర్ణయించిది.

మేడారం పనులను పరిశీలించిన ప్రజా ప్రతినిధుల బృందం

మన తెలంగాణ/ధర్మారం: మేడారం ప్రాజెక్టు పనుల్ని చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల బృందం సభ్యులు ఆదివారం నాడు సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మేడారం రిజర్వాయర్, ఆరవ ప్యాకేజిలోని అండర్ టన్నెళ్ళు, సర్జిపుల్, పంప్‌హౌస్‌లను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మార్కెట్ చైర్మన్, విండో చైర్మన్, పార్టీ ముఖ్య నాయకులకు ఇఇ నూనె శ్రీధర్ వివరించారు. శరవేగంతో పనులు పూర్తి చేయడం పట్ల కొప్పుల ఈశ్వర్ ఆశ్చర్యం వ్యక్తం చేసి, అధికారులను అభినందించారు.

నీరవ్ అక్రమాలపై సమగ్ర విచారణ

- తప్పించుకునేందుకు బిజెపి కుటిల యత్నాలు



మన తెలంగాణ/హైదరాబాద్: నీరవ్‌మోడీ అవినీతి వ్యవహారం తమ ప్రభుత్వ హయాంలో జరగలేదని తప్పించుకునేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి విమర్శించారు. అమిత్ షా కుమారుడు జైషా ఆర్థిక అవినీతి మొదలు ఇప్పటివరకు జరిగిన ఆర్థిక అవకతవలపై విచారణ జరగకుండా చేసిన బిజెపి అవినీతికి అతీతులమని చెప్పుకోవడం విచారకరమన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కేంద్రంగా నీరవ్ మోడీ ఆర్థిక అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఇందుకు బాధ్యులైన వారందరినీ శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ అవినీతి మరకలను బిజెపి ఎలా తొలగించుకుంటుందని ఆయన ప్రశ్నించారు. మఖ్దుం భవన్‌లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డితో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. దారిద్ర్యం, నిరుద్యోగం, ధరలు, ప్రజల అప్పులు పెరిగిపోవడంతో పాటు సంఘ్ పరివార్ శక్తుల చర్యల కారణంగా దేశంలో అసాధారణ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులన్నింటితో ఐక్య వేదిక నిర్మాణం జరగాలన్నారు. ప్రత్యామ్నాయ ఆర్థిక, రాజకీయ విధానాల కోసం వామపక్షాల ఐక్యతను మరింత పటిష్టం చేసుకోవడం ద్వారా సైద్ధాంతిక రాజకీయ పోరాటాలు చేయాల్సిన చారిత్రక భాధ్యత కమ్యూనిస్టులపై ఉందన్నారు. ఎన్నికల ఎత్తుగడలు, సంఘ్ పరివార్ శక్తుల ఫాసి స్టు విధానాలకు వ్యతిరేకంగా, రాజ్యాంగ పరిరక్ష ణకు జరిగే ప్రతిఘటన పోరాటాలు వేర్వేరు అంశాలని, వామపక్ష ఐక్యత, పోరాటాలు ఒకదాని కొకటి వైరుధ్యంగా చూడాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటకలో జనతాదళ్ (ఎస్) వైఖరిలో స్పష్టత లేదని, బిజెపి, కాంగ్రెస్ రెండింటికీ జనతాదళ్ వ్యతిరేకంగా ఉంటే ఆ పార్టీతో కలిసి పనిచేసేందుకు తమకు అభ్యంత రం లేదని సుధాకర్‌రెడ్డి ఒక ప్రశ్నకు సమాధాన మిచ్చారు. గత ఎన్నికల తరువాత జనతాదళ్ నేత కుమారస్వామి బిజెపితో జట్టు కట్టారని ఆయన పేర్కొన్నారు. జనతాదళ్ నేతలు సిపిఐ, సిపిఐ (ఎం)లతో చర్చలు జరుపుతున్నారన్నారు. తెలంగాణలో వామపక్షాలు కలిసే ఉన్నాయని, ఎన్నికల్లో ఏ పార్టీతో కలిసిపోవాలనే విషయంపై ఆ సమయంలోనే నిర్ణయం తీసుకుంటాయన్నారు.

నోట్లో గుడ్డలు కుక్కి, తలపై రాడ్‌తో మోది..!

- సికింద్రాబాద్‌లో దారుణం
- ఆర్మీ జవాన్ కూతురిపై అత్యాచారం

మన తెలంగాణ/హైదరాబాద్: సికింద్రాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది. స్నేహితుడి ఇంటికి వెళ్లి నడుచుకుంటూ వస్తున్న 15ఏళ్ల బాలికను అడ్డగించిన అగంతకుడు చెట్లపొదల్లోకి లా క్కెళ్లి తలపై రాడ్‌తో కొట్టి, నోట్లో గుడ్డలు కుక్కి అత్యంత దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావానికి గురైన ఆ బాలిక అపస్మారక స్థితిలో పడిఉన్న విషయాన్ని స్థానికులు ద్వారా తెలుసుకున్న పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ దారుణం హైదరాబాద్ పోలీసులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఘటన జరిగి రెండు నెలలు కావస్తున్నా అగంతకుడిని పోలీసులు ఇ ప్పటికీ గుర్తించలేదు. నిందితుడిని గుర్తించి వెంటనే అరెస్టు చేసి శిక్షించాలంటూ బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. మిలటరీ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న జవాన్ కూతురు (15) అమ్ముగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని కాలనీలో ఇంటికి వెళ్తుండగా గతేడాది డిసెంబర్ 21న ఈ ఘటన జరిగింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదు. నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని కుటుంబ సభ్యులతో పాటు కొద్దిమంది సైనికులు స్టేషన్‌కు వెళ్లి పోలీస్ అధికారులను నిలదీశారు. ఈ కేసు తదుపరి దర్యాప్తును మిలటరీ కోర్టుకు అప్పగించాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించామని, ఫోరెన్సిక్ నివేదిక వస్తేనే నిందితుడిని గుర్తించడం సాధ్యమవుతుందని పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇప్పటికే అనుమానితులైన 30మందిని విచారించామని, ఘటన జరిగిన రోజున అక్కడున్న కొందరిని కూడా ప్రశ్నించామని పేర్కొన్నారు. జవాను కుటుంబ సభ్యులు మాత్రం తమ కూతురి భవిష్యత్తు కోసమే రెండు నెలలుగా ఈ అంశాన్ని గోప్యంగా ఉంచామని, కానీ పోలీసుల దర్యాప్తుపై ఆశలు సన్నగిల్లడంతో ఇప్పుడు స్టేషన్‌కు వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగాల పేరుతో మనుషుల రవాణా

- ట్రావెల్ పాయింట్ మోసాలపై కేసు నమోదు చేయండి
- హైదరాబాద్ సిపికి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఆదేశం

TRAVEL POINT HR SOLUTIONS INDIA



బాధితులు అస్లాంఖాన్, నసీర్

మన తెలంగాణ/హైదరాబాద్: ఉద్యోగాల పేరుతో విదేశాలకు అక్రమంగా మనుషులను రవాణా చేస్తున్న బషీర్‌బాగ్‌లోని 'ట్రావెల్ పాయింట్' సంస్థపై కేసు నమోదు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.వి.శ్రీనివాస్‌రావుకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దుబాయ్‌లో ఉద్యోగాల పేరుతో పలువురు నిరుద్యోగులను మోసగించిందని, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇదికాకుండా తిరిగి బాధితులపైనే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఉత్తర్వులో పేర్కొన్నారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్‌కు చెందిన సయ్యద్ నసీర్ (28), బార్కాస్‌కు చెందిన అస్లంఖాన్ (26)లు ఉద్యోగ నిమిత్తం బషీర్‌బాగ్‌లోని బాబుఖాన్ ఎస్టేట్‌లో ఉన్న 'ట్రావెల్ పాయింట్ హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ఇండియా' సంస్థను ఆశ్రయించారు. ఇక్కడి ఎండి షాకేరాబేగం, ఏజెంట్ నజీముద్దీన్‌లు వారి వద్ద నుంచి రూ.8 లక్షలు తీసుకుని దుబాయ్‌కు డ్రైవింగ్ పోస్టు కోసం పంపించారు. అక్కడికి వెళ్లిన నసీర్, అస్లంఖాన్‌లకు నరకం అనుభవించారు. ఎనిమిది గంటల డ్రైవింగ్ పోస్టు అని చెప్పి అక్కడికి వెళ్లాక 18 గంటలు పనిచేయించుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ట్రావెల్ పాయింట్ సంస్థ వారు చెప్పిన ప్రకారం కాకుండా తక్కువ జీతం ఇస్తున్నారని, రోజుకు తాము 18 గంటలు పనిచేయడం ద్వారా అనారోగ్యానికి గురయ్యామని దీంతో తమని స్వదేశానికి పంపమని ఎంత వేడుకున్నా కనికరించలేదన్నారు. కనీసం తమకు భోజనం కూడా పెట్టేవారు కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ నుంచి లక్షలాది రూపాయలు తీసుకున్న తరువాతనే తిరిగి స్వదేశానికి పంపించారని చెప్పారు. తమకు జరిగిన మోసంపై ట్రావెల్ పాయింట్‌కు వెళ్లి ఎండి షాకేరాబేగం, నజీముద్దీన్‌లను అడిగామని, అయితే వారు పథకం ప్రకారం 100 నెంబర్‌కు డయల్ చేసి తమపై అక్రమంగా క్రిమినల్ కేసులు నమోదు చేయించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయంపై సైఫాబాద్ పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ట్రావెల్ పాయింట్‌పై కేసు నమోదు చేయడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ట్రావెల్ పాయింట్ మోసాలపై తాము కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో వారు నగర పోలీసు కమిషనర్‌కు సదరు ట్రావెల్ సంస్థకు చెందిన షాకేరాబేగం, నజీముద్దీన్‌లపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారని వారు తెలిపారు. ఈ సంస్థ తమలాగే పలువురు నిరుద్యోగులను నిట్టనిలువునా ముంచిందని ఆరోపించారు. వీరి బారిన పడిన హైదరాబాద్‌కు చెందిన మరో ఆరుగురు యువకులు ఇప్పటికీ దుబాయ్‌లో నరకం అనుభవిస్తున్నారన్నారు. తిండికి కూడా నోచుకోకుండా వారు తెలిసిన స్నేహితుల ఇళ్లలో కాలం గడుపుతున్నారన్నారు. తమపై అక్రమ కేసు నమోదు చేసిన విషయంపై ట్రావెల్ పాయింట్ కార్యాలయంలో ఉన్న సిసిటివి ఫుటేజ్‌లను పరిశీలించాలని తాము వేడుకున్నా పోలీసులు కనికరించలేదని, వాస్తవాలను తెలుసుకోకుండానే తమపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. బాధితులమైన తమపైనే కేసులు పెడితే ఎవరికి చెప్పుకోవాలని వారు వాపోతున్నారు. పోలీసులు సదరు ట్రావెల్ సంస్థతో కుమ్మకయ్యారని వారు ఆరోపించారు.

ఫుడ్ పార్కుల కోసం టిఎస్ఐఐసి నిరీక్షణ!

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో నాలుగు చోట్ల ఏర్పాటు చేయతలపెట్టిన మెగా ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు యూనిట్లకు అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తోంది. అనుమతులు మంజూరు చేసి తగిన ఆర్థిక సహకారం అందజేస్తే కేవలం ఏడాది వ్యవధిలోనే పూర్తి చేస్తామని మంత్రి కెటిఆర్ ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులకు స్పష్టం చేశారు. టిఎస్ఐఐసి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా గంభీరావ్‌పేట మండలం నర్మల గ్రామంలో 50 ఎకరాలు, వరంగల్ జిల్లా లింగాల ఘన్‌పూర్ మండలం కల్లెం గ్రామంలో 60 ఎకరాలు, మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కల్లాకల్ గ్రామంలో 60 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన్‌వల్లిలో 60 ఎకరాల మేర భూసేకరణ పూర్తిచేసిన టిఎస్ఐఐసి కేంద్ర ఆమోదం కోసం గత రెండేళ్లుగా నిరీక్షిస్తోంది. కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వశాఖ ఈ నాలుగు ఫుడ్ పార్కుల ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన డిపిఆర్ నివేదికలను కూడా పరిశీలించింది. త్వరలో ఈ నాల్గింటికి ఆమోదం వస్తుందని టిఎస్ఐఐసి విశ్వాసం వ్యక్తం చేశారు. ఆమోదంతో పాటు నిధులు కూడా వస్తాయని భావిస్తున్నారు. నాబార్డు వంటి సంస్థల ద్వారా వచ్చే రుణాలకు ప్రభుత్వం పూచీ కత్తు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం అందింది. ఆహార ధాన్యాల నిల్వలు, పంటల ఉత్పత్తి , ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం తుది నిర్ణయం తీసుకోనుందని టిఎస్ఐఐసి ఉన్నతాధికార వర్గాలు పేర్కొంటున్నాయి. భూసేకరణ పూర్తయిన ప్రాంతాలను కూడా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు పర్యటిస్తారని, కేంద్రం ఆమోదం లభించగానే పనులు ఊపందుకుంటాయని అధికారులు భావిస్తున్నారు.



సమతుల ఆహారంతో మెరుగైన ఆరోగ్యం : శ్రీపాద యశోనాయక్

మన తెలంగాణ/హైదరాబాద్: సహజ, సమతుల, పరిమిత ఆహారంతో మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చునని, పౌష్టికాహారంతో ఆరోగ్య పరిరక్షణ సమకూరుతుందని కేంద్ర ఆయుష్ మంత్రి శ్రీపాద యశోనాయక్ అన్నారు. నగరంలో జరుగుతున్న ప్రాకృతిక ఆహార మేళా ముగింపు ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆదివారం రాత్రి మాట్లాడుతూ, ఆధునిక పోకడలకు మనం ఆకర్షితులమవు తున్నామని, అసహజమైన అసంతులిత ఆహారపడు అలవాట్లకు లోనవుతున్నామని, ఫలితంగా క్యాన్సర్, కిడ్నీ, గుండె సంబంధ వ్యాధుల బారిన పడుతున్నామని అన్నారు. ఫాస్ట్‌ఫుడ్‌లను మానివేయడం ద్వారా ఈ అనారోగ్యాలకు దూరం కావచ్చునని, మన పూర్వీకులు బోధించిన ఆహారపు అలావాట్లే మన ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యమంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజల్లో వ్యాధుల పట్ల అవగాహన పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ప్రాథమిక దశలోనే రోగాలను గుర్తించే విధంగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నదని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా రక్షిత తాగునీటి సరఫరాతో చాలా రోగాలు తగ్గుముఖం పడతాయని, మనం తీసుకునే ఆహారంపై ప్రజల్లో విస్తృత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలనుకుంటున్నట్లు తెలిపారు.

నవాబ్ ఫజల్ జా బహదూర్ మృతి

మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్ సంస్థానం చివరి రాజు ఏడో నిజాం కుమారుడు నవాబ్ ఫజల్ జా బహదూర్ (72) అస్వస్థతతో మృతి చెందారు. కింగ్‌కోఠిలోని మసీదులో ముస్లిం మత ఆచారాల ప్రకారం ఆదివారం ఖననం చేశారు. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ రెండో భార్య లీలా బేగం కుమారుడే బహదూర్. ఏడో నిజాం కొడుకుల్లో జీవించి ఉన్న చివరి వ్యక్తి ఫజల్ జా బహదూర్ మాత్రమే. మీర్ ఉస్మాన్ అలీఖాన్ అంత్యక్రియలు చేసిన జూడీ మసీదులోనే ఫజల్ జా బహదూర్ అంత్యక్రియలు జరిగాయి. నిజాం ట్రస్టులో ట్రస్టీగా చివరి వరకు కీలక బాధ్యతలు నిర్వహించారు. అంత్యక్రియల్లో నిజాం మనుమడు ముఫకంజాతో పాటు రాజ కుటుంబీకులు, మత పెద్దలు, పలువురు రాజకీయ నేతలు పాల్గొన్నారు.





క్షమాభిక్ష పథకం గడువు పెంచాలి

మన తెలంగాణ/హైదరాబాద్: కువైట్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్షమాభిక్ష పథకం గడువును పెంచాలని టిపిసిసి గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ విభాగం కోరింది. ఈ మేరకు టిపిసిసి గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ విభాగం చైర్మన్ డాక్టర్ బి.ఎం.వినోద్ కుమార్, కన్వీనర్ నంగి దేవేందర్ రెడ్డి, సెక్రటరీ జె.ఎన్.వెంకట్ తదితరులు ఎంబిసి అధికారి నారాయణను ఆదివారం కలిసి ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల గల్ఫ్ దేశాల నుంచి తిరిగి సొంత రాష్ట్రాలకు తిరిగి రాలేని పరిస్థితి నెలకొనిందని వారు విమర్శించారు. కువైట్ ప్రభుత్వం గత నెల 29న ప్రవేశపెట్టిన క్షమాబిక్ష పథకం ఈ నెల 22తో ముగియనుందని, దీంతో గల్ఫ్‌లో వీసాలు లేకుండా పని చేస్తున్న 30వేల మంది కార్మికులు నిత్యం బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. క్షమాభిక్ష ద్వారా 14వేల మంది కార్మికులకు అవకాశం వుంటుందని, క్షమాభిక్ష గడువు దగ్గర పడేకొద్దీ కార్మికులలో ఆందోళన నెలకొందన్నారు. అదే విధంగా విమాన ప్రయాణ ఛార్జీలు కూడా చాలా ఎక్కువగా ఉండటంతో మరింత ఇబ్బందిగా మారిందన్నారు. గల్ఫ్ కార్మికుల విముక్తి కోసం తెలంగాణ కాంగ్రెస్ చేస్తున్న కృషితో క్షమాభిక్ష పథకం ఎంతో మంది కార్మికుల జీవితాలలో వెలుగును నింపిందన్నారు.

నేటి నుంచి ఐటి సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్: నాస్కామ్ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (డబ్ల్యూసిఐటి)–2018 పేరితో మాధాపూర్ హైటెక్స్‌లో ఈ సదస్సు జరగనుంది. ఢిల్లీ నుండి ప్రధాని నరేంద్ర మోడీ రిమోట్ ద్వారా సోమవారం ఉదయం పది గంటలకు ఈ సదస్సును లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఐటి శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కెటి. రామారావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగిస్తారు. డిజిటల్ ఎకానమీ అంశంపై రవి శంకర్ ప్రసాద్, స్టార్టప్ ఈకో సిస్టమ్‌పై మంత్రి కెటిఆర్ ప్రసంగించనున్నారు. రెండో రోజు సదస్సులో మానవ రోబో సోఫియా 'హెల్పింగ్ హ్యూమానిటీ క్రియేట్ ఏ బెటర్ ఫ్యూచర్' అన్న అంశంపై ప్రసంగించనుంది. 21వ శతాబ్దంలో ఐటి రంగంలో నూతన టెక్నాలజీ, విప్లవాత్మకమైన మార్పులకు నాందిపలుకనున్న అంశంపై ఆర్. చంద్రశేఖర్ (నాస్కామ్), బివిఆర్ మోహన్ రెడ్డి(సైయంట్) సహా మరికొందరు ప్రముఖులు ప్రసంగిస్తారు.

ప్రాజెక్టులకు విడివిడి కార్పొరేషన్లు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకూ నిధుల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం కాళేశ్వరం మార్గాన్నే ఎంచుకొంది. పనుల వేగానికి తగ్గట్లుగా నిధులు, బిల్లుల మంజూరుకు ఒక్కో ప్రాజెక్టుకు ఒక్కో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. కాళేశ్వరం తరువాత ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలతో పాటు సీతారామ ఎత్తిపోతల, దేవాదుల ఎత్తిపోతలకు ప్రాధాన్యత ఇస్తోంది. తాజాగా సీతారామ ఎత్తిపోతల, దేవాదుల ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయడానికి విడివిడిగా కార్పొరేషన్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. గోదావరిలో నీటికి ఢోకా లేకపోవడంతో ముందుగా సీతారామ, దేవాదుల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి ఆ తర్వాత పాలమూరు రంగారెడ్డికి ఇవ్వాలని భావిస్తోంది. గోదావరి నీటిని 60 టిఎంసిలు ఎత్తిపోసి, 6,20,000 వేల ఎకరాలకు సాగు, తాగునీరిచ్చేలా దేవాదుల నిర్మిస్తున్నారు. రీడిజైనింగ్‌తో ఈ ప్రాజెక్టు వ్యయం పెరిగింది. దీనికి తోడు మల్కాపురం వద్ద బ్యారేజి నిర్మాణానికి, తుపాకులగూడెం బ్యారేజికి, మల్కాపూర్ రిజర్వాయర్‌కు, ఇంకా రూ.9000 కోట్ల పై చిలుకు వ్యయం అవుతుందని అంచనా. సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.7927 కోట్లతో ప్రభుత్వం ఇప్పటికే పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు కూడా ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలనుకుంటోంది. ప్రభుత్వ గ్యారంటీ ఉండడంతో కార్పొరేషన్‌కు విరివిగా రుణాలు వస్తాయన్నది ప్రభుత్వ ఉద్దేశం. నిధులు సమకూరితే ప్రాజెక్టులు తొందరగా పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగమే ఒక్కో ప్రాజెక్టుకు ఒక్కో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం అనే ఆలోచన.

మావోయిస్టు కాల్పుల్లో జవాన్ల మృతి

మన తెలంగాణ/హైదరాబాద్ : చత్తీస్‌గఢ్‌కు చెందిన సుక్మా జిల్లాలోని భేజి పోలీసు స్టేషన్ పరిధిలో ఎలరమడుగు నాలా దగ్గర కూంబింగ్ జరుపుతున్న 'కోబ్రా' భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఆదివారం ఉదయం ప్రారంభమైన ఎదురు కాల్పులు రాత్రి అయినా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో 'కోబ్రా' బలగాల్లోని మార్కం అధా, కాంతి ముఖేష్ అనే ఇద్దరు జవాన్లు మృతి చెందగా, మరో ఆరుగురు జవాన్లకు తీవ్ర గాయాలైనట్లు కమాండెంట్ మహేందర్ తెలిపారు. గాయపడినవారిని హెలికాప్టర్‌లో సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాలు పేర్కొన్నాయి. గాయపడిన వారికి ఆస్పత్రిలో మెరుగైన వైద్య చికిత్సనందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మావోయిస్టులు ఆంబుష్ చేశారని, ఆ తర్వాత భద్రతా బలగాల నుంచి ఆత్మరక్షణ కాల్పులు ప్రారంభమయ్యాయని, ఐదు బృందాల అదనపు భద్రతా సిబ్బంది (కోబ్రా విభాగంలోని 202 బ్యాచ్)ని పంపినట్లు మహేందర్ పేర్కొన్నారు. గాయపడిన సోరి బుస, రాకేష్, ఎస్.రాజ, పదమ్ సోన్, శివరామ్, ఆర్.పోయమ్‌లకు బుల్లెట్ గాయాలయ్యాయని, వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే వైద్యం అందిస్తున్నారని, అవసరాన్ని బట్టి మెరుగైన చికిత్స కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలిస్తామని వైద్యులు తెలిపారు.

రైతు సమన్వయ సమితి ప్రాంతీయ సదస్సులు

- ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహణ
- ఏప్రిల్ 20న రైతులకు చెక్కుల పంపిణీ
- వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ సిఎం కెసిఆర్



మన తెలంగాణ/హైదరాబాద్ : 'పెట్టుబడి పథకం' కింద రైతులకు రానున్న వానాకాలం నుంచి ఇచ్చే నాలుగు వేల రూపాయలను చెక్కుల రూపంలో ఏప్రిల్ 20 నుంచి ప్రభుత్వం ఇవ్వనుంది. రెండు విడతల్లో ఇవ్వనున్నట్లు సిఎం కెసిఆర్ పేర్కొన్నారు. రబీ సీజన్‌కు చెక్కులను నవంబరు 18 నుంచి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులను రానున్న బడ్జెట్‌లోనే కేటాయించనున్నామని, ఈసారి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టనున్నట్లు సిఎం స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన ముసాయిదాను తయారుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 25, 26 తేదీల్లో మండల రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని, త్వరలోనే రాష్ట్రస్థాయి సమన్వయ సమితి ఏర్పాటవుతుందని ఆయన తెలిపారు. మంత్రులు, వ్యవసాయ విభాగం అధికారులతో ముఖ్యమంత్రి ఆదివారం ప్రగతి భవన్‌లో నిర్వహించారు. అనంతరం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో, ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగే మండల రైతు సమన్వయ సమితి ప్రాంతీయ సదస్సులో జనగామ, మెదక్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన రైతు సమన్వయ సమితి సభ్యులు పాల్గొంటారని సిఎం తెలిపారు. ఈ నెల 26వ తేదీన కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జరిగే ప్రాంతీయ సదస్సుకు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట జిల్లాలకు చెందిన సమన్వయ సమితి సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సుల్లో రైతు పెట్టుబడి పథకం, పంటలకు కనీస మద్దతు ధర, మేలైన సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయ విధానం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లు, క్రాప్ కాలనీలు తదితర అంశాలతో పాటు రైతు సంక్షేమం కోసం, వ్యవసాయాభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల అమలు తదితరాల్లో రైతు సమన్వయ సమితులు పోషించాల్సిన పాత్రపై విస్తృతంగా చర్చించడంతో పాటు ఒక కరదీపికను అందించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుల్లో ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ మంత్రి సందేశాలు ఉంటాయని, రైతులతో సిఎం నేరుగా సంభాషిస్తారని ఆ ప్రకటన పేర్కొనింది. ఈ సదస్సులకు హాజరయ్యేవారి ప్రయాణ, బస, భోజన ఏర్పాట్లను వ్యవసాయ శాఖే సమకూర్చాలని సిఎం స్పష్టం చేశారు. త్వరలోనే 42 మంది సభ్యులతో రాష్ట్రస్థాయి రైతు సమన్వయ సమితిని ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని, అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్న ఉద్దేశంతో ఇందులో 30జిల్లాలకు చెందిన ప్రతినిధులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, నిపుణులు సభ్యులుగా ఉంటారని, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న వారిని కూడా సభ్యులుగా చేర్చడంపై సూచనలు ఇవ్వాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం కూలీల కొరతను ఎదుర్కొంటోందని, భవిష్యత్తులో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని వ్యాఖ్యానించిన సిఎం యాంత్రికీకరణను ప్రోత్సహించనున్నట్లు, వరినాట్లు వేసే యంత్రాలను రైతులకు సబ్సిడీపై అందించనున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మరే రాష్ట్రంలోనూ లేని తరులో వ్యవసాయ రంగంలో అనేక కార్యక్రమాలను అమలుచేస్తున్నందువల్ల ఎక్కడా నిధుల సమస్య తలెత్తకుండా ఉండేలా ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఈటల రాజేందర్‌తో పాటు ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, ఎంపిలు గుత్తా సుఖేందర్‌రెడడి, బాల్క సుమన్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మిషన భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, శేరి సుభాష్‌రెడడి, ఎమ్ఎల్‌ఎసి కర్నె పరభాకర్, సిఎంఓ ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ ముఖ్య కార్యదర్శి పార్ధసారధి, కమిషనర్ జగన్‌మోహన్‌రావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రవీణ్‌రావు, ఆర్థిక సలహాదారు జిఆర్ రెడ్డి, సిఎంఒ కార్యదర్శులు స్మితా సబర్వాల్, రాజశేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడడి తదితరులున్నారు.



ఐటిఐల పనితీరు భేష్

- కేంద్ర మంత్రి హెగ్డే ప్రశంసలు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో ఐటిఐ (పారిశ్రామిక శిక్షణా సంస్థ)ల పనితీరు బాగుందని కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే ప్రశంసించారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో నోవాటెల్ హోటల్‌లో ఆదివా రం నాడు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, అధికారులతో కేంద్ర మంత్రి హెగ్డే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మం త్రి మాట్లా డుతూ రాష్ట్ర ఇంజినీరింగ్ విద్యార్థులతో పోల్చుకుంటే ఐటిఐ విద్యార్థులకే తొందరగా, ఎక్కువగా ఉపాధి లభించిందని అభిప్రాయపడ్డారు. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కోసం నిధులు అందిస్తామని హెగ్డే హామీ నిచ్చారు.

నత్తనడకన టూరిస్ట్ సర్క్యూట్ పనులు

మన తెలంగాణ/హైదరాబాద్: కొత్త పర్యాటక వలయాల (టూరిస్టు సర్క్యూట్) అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర పర్యాటక శాఖ 'స్వదేశీ దర్శన్' పథకం కింద టూరిస్టు సర్క్యూట్‌లు మంజూరు చేయగా సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్న పనులు మాత్రం ఆశించినంత వేగంగా జరగడంలేదు. పాత మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యావరణ (ఎకో) పర్యాటక సర్క్యూట్ డిపిఆర్‌ను కేంద్రం రూ.91.7 కోట్ల అంచనాతో ఆమోదించింది. వరంగల్ జిల్లాలో ప్రతిపాదించిన గిరిజన సర్క్యూట్ డిపిఆర్‌ను రూ.84.4 కోట్ల అంచనాతో ఆమోదించింది. అయితే ఈ పనులు మాత్రం నెమ్మదిగా నడుస్తున్నాయి. దీనికి తోడు హైదరాబాద్ నగరంలో ఒక టూరిజం సర్క్యూట్‌ను మంజూరు చేయాలని పర్యాటక శాఖ కేంద్రాన్ని కోరింది. ఇందుకు రూ.99.6 కోట్ల అంచనాతో డిపిఆర్‌ను సమర్పించింది. ఇదేవిధంగా ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన, పర్యావరణ సర్క్యూట్‌ను ప్రతిపాదించింది. మహబూబ్‌నగర్ సర్క్యూట్‌లో సోమశిల, సింగోటం రిజర్వాయర్, నల్లమల అడవిలోని అక్కమహాదేవి గుహలు, కదలివనం, శ్రీశైలం, ఫరహాబాద్, మల్లెలతీర్థం, ఉమామహేశ్వరం దేవాలయం, తదితర ప్రాంతాలు ఉన్నాయి. వరంగల్ జిల్లా గిరిజన సర్క్యూట్‌లో ములుగు, మేడారం గేట్, లక్నవరం, సమ్మక్క సారలమ్మ జాతర, తాడ్వాయి, దామరవాయి మెగాలిత్ బరియాల్స్, మల్లూరు స్ప్రింగ్ వాటర్, బొగత జలపాతం, తదితర ప్రాంతాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో కులీకుతుబ్‌షాహి హెరిటేజ్ పార్క్, హయత్‌బక్షి బేగం మసీదు, మోన్సియల్ రేమండ్స్ టూంబ్స్, పైగా టూంబ్స్‌లను అభివృద్ధి చేయాల్సి ఉంది. తెలంగాణ కాశ్మీర్‌లా పేరొందిన ఆదిలాబాద్‌లో కుమ్రం భీం జోడేఘాట్‌తో పాటు సమీప ప్రాంతాలను సర్క్యూట్ తరహాలో అభివృద్ధి చేయాల్సి ఉంది. కొన్ని పనులు ప్రారంభమైనా నెమ్మదిగా సాగుతున్నాయి. దీనిపై పర్యాటక శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, పనులు వేగవంతం చేయాలన్న అభిప్రాయాలను పర్యాటకులు వ్యక్తపరుస్తున్నారు.

సబ్సిడీపై రాని స్పష్టత

విద్యుత్ చార్జీల ఖరారులో ఇఆర్‌సి నిమగ్నం

మన తెలంగాణ/హైదరాబాద్: విద్యుత్ చార్జీల ఖరారులో ప్రభుత్వ సబ్సిడీపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రభుత్వం సరిపడా సబ్సిడీ ఇస్తామని చెప్పడంతో చార్జీల లెక్కల్లో ఇఆర్‌సి నిమగ్నమైంది. చార్జీల పెంపు లేదని దాదాపు సంకేతాలివ్వడం, ప్రభుత్వం నుంచి ఏ మేరకు సబ్సిడీ వస్తుందో తెలియని గందరగోళ పరిస్థితుల్లో కమిషన్ ఆర్థిక నివేదిక తయారీ ఆసక్తికరంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో సబ్సిడీ రూపంలో చేసే కేటాయింపుల అనంతరం విద్యుత్ కమిషన్‌కు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గత ఏడాది కూడా ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లోనే సబ్సిడీపై స్పష్టమైన ప్రకటన చేసింది. ప్రభుత్వ సహాయ కార్యదర్శి కమిషన్ ముందు హాజరై ప్రకటన చేశారు. డిస్కంల లెక్కల ప్రకారం రూ.9 వేల కోట్లకు పైగా ఆర్థిక లోటు ఉంది. దీనికి తోడు వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తుండడంతో 2018–19 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఖర్చు చేసిన ప్రతి పైసాను రాబట్టుకుంటామని డిస్కంలు ఉదయ్ ఒప్పందంలో సంతకం చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం ప్రభుత్వం నుంచి సుమారు రూ.5,000 కోట్ల మేర సబ్సిడీ అందాల్సి ఉంది. ముఖ్యమంత్రి రూ.5,400 కోట్ల సబ్సిడీని ఇస్తామని, అవసరమైతే మరో రూ.500 కోట్లు అదనంగానే ఇస్తామని గతంలో హామీనిచ్చారు. కానీ ఇఆర్‌సి బహిరంగ విచారణలో మాత్రం ప్రభుత్వం తరఫున అధికారి ఈ విషయం గురించి చెప్పలేదు.

ఉదయ్ ఎంఓయు ప్రకారం..

2016–17 ఆర్థిక సంవత్సరంలో ఒక యూనిట్ విద్యుత్ ఉత్పత్తి నుంచి వినియోగదారుని వద్దకు చేరేసరికి సగటున రూ.5.82 అవుతుందని, 2 పైసలు తగ్గించి, యూనిట్‌కు రూ.5.80 చేస్తామన్నారు. ఆ తర్వాత రూ.5.66 చేస్తామని కేంద్రానికి డిస్కంలు హామీనిచ్చాయి. సగటు విద్యుత్ సరఫరా వ్యయం, వస్తున్న ఆదాయానికి మధ్య తేడాను 2018–19 నాటిని కొంత చార్జీలు పెంపుతో, ప్రభుత్వ సబ్సిడీతో సున్నాకు చేరుస్తామని ఒప్పందంలో డిస్కంలు హామీనిచ్చాయి. చార్జీలు పెంచకపోయినా ప్రభుత్వ సబ్సిడీ మాత్రం పెరిగింది. వరుసగా రెండేళ్ల పాటు చార్జీలు పెంచకపోవడంతో ఆ భారాన్ని కొంత కాలం తర్వాత ఎఫ్ఎస్ఎ (ఫ్యూయర్ సర్‌ఛార్జి అసెస్‌మెంట్) రూపంలో వసూలు చేసే ప్రమాదం లేకపోలేదు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వరుసగా ఐదేళ్లు చార్జీలు పెంచకపోయినా ఆ భారాన్ని తర్వాతి కాలంలో దాదాపుగా రూ.25,000 కోట్ల వరకు ఒక్కసారిగా సర్‌చార్జి రూపంలో, చార్జీల పెంపు రూపంలో వినియోగదారుల నుంచి డిస్కంలు వసూలు చేశాయి. ఇప్పుడు ఇది పునరావృతం అవుతుందేమోననే భయాలు వినియోగదారులను వెంటాడుతున్నాయి.



వరంగల్ అర్బన్ కలెక్టర్ అమ్రపాలి వివాహం జమ్మూకశ్మీర్‌లో ఆదివారం నాడు వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్‌కు చెందిన పలువురు నేతలు హాజరై కొత్త జంటను దీవించారు.

కనుల పండువగా ధ్వజారోహణం

- యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు భైరిపూజ, దేవతాహ్వానం



మన తెలంగాణ/యాదాద్రి: శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు యాదాద్రి క్షేత్రములో వైభవంగా కొనసాగుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణకు మహాక్షేత్రమైన యాదాద్రిలో నరసింహుండి వార్షిక బ్రహ్మోత్సవాల భాగంగా ఆదివారం రెండో రోజు ధ్వజారోహణ, భైరిపూజ, దేవతాహ్వాన మహోత్సవాలను ఆగమ శాస్త్రమును అనుసరించి వైభవంగా అర్చకులు నిర్వహించారు. ఉదయం బాలాలయంలో శ్రీలక్ష్మీ నరపింహుడిని ఉత్సవ అలకారణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగమైన ధ్వజారోహణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంకాలం ఆలయంలో నిత్య ఆరాధన భైరిపూజ, దేవతాహ్వానము నిత్యహావనము ఉత్సవాలను నిర్వహించారు. బేరినాదము వినిన ఆ ధ్వని వినబడినంతవరకు ఏ విధమున అశుభములు జరగవని, దేవతలను అత్యంత ప్రీతికరమైన ఆయరాగ తాళాదులతో ఆహ్వానించిన మహోత్సవ విషిష్టతను భక్తులకు తెలియజేశారు. ఈ ఉత్సవ పూజల్లో యజ్ఞాచార్యులు సముద్రాల శ్రీనివాసాచార్యులు, ఆలయ ప్రదాన అర్చకులు నల్లందిగల్ లక్ష్మీ నరసింహచార్యులు, కారంపొడి నరసింహచార్యులు, కాదూరి వెంకటాచార్యులు, సంపదాచార్యులు, మాదవాచార్యులు, అర్చక స్వాములు, ఆలయ కార్య నిర్వహణ అధికారి, గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అధికారులు భాస్కర్ శర్మ, చంద్రశేఖర్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అలంకార సేవలు..

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో నేటి నుండి అలంకార శేవలు ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం ఆలయంలో నిత్యహావన పారాయములు గావించి శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని ఉదయం 11 గంటలకు మత్స్యావతార అలంకారసేవ, సాయంత్రం శేషవాహనశేవ పూజ కార్యక్ర మాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.



యాదాద్రి నిత్యరాబడి 22.27 లక్షలు

శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం యాదాద్రి క్షేత్రంలో స్వామివారి ఆలయం నిత్యరాబడి భాగంగా ఆదివారం రోజున రూ.22 లక్షల 27 వేల 160 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మించి కనిపించాలనే...


మించి కనిపించాలనే కోరిక
మంచిదే,
ఆ దిశలోనే నడుస్తూ–

లోపల్లోపల ఎప్పటికప్పుడు
గుండె గోడల్ని శుభ్రం చేసుకోవడం,
సరికొత్తగా స్పందించడం
ఆకుపచ్చని ఊహలు జోడించడం
పదాన్ని జరీ తలపాగాలా ధరించడం
గొప్పే!

ముందుకు పోతుంటే
సూర్యుడు వెలుగుకిరణాలై విచ్చుకొంటున్నట్లు,
తలెత్తిన ఆత్మవిశ్వాసం
వేళ్లానుకొంటున్నట్లు...
మాటల్ని కట్టిపడేసే ఎన్నెన్ని చిత్రాలు!

వివిధ వన్నెలుగా వ్యాపిస్తూ,
దారంతా స్వప్నాల తోటగా మొలిపిస్తూ నడవడం
మంచిదే!

యం.కె. సుగమ్‌బాబు
8096615202



డేరాలు — ఘోరాలు



ఏ బాబాల ఆశ్రమాలు చూసినా
ఏమున్నది దైవ కార్యం!?
మూఢభక్తి కలిగిన జనులు సమస్తం
బాబాల పడకగదుల్లో సమాప్తం!

స్వామి ముదిరితే సన్యాసి అవుతున్నాడు
నమ్మకం కుదిరితే కన్నేసి చెరుస్తున్నాడు
బాబా ముదిరితే ఆశ్రమ అధిపతి అవుతున్నాడు
అవకాశం దొరికితే దండుకోవడానికి సై అంటున్నాడు
ఆశ్రమాల చుట్టూ లక్షల్లో సైన్యాల రక్షణ
అంతకు రెట్టింపు సంఖ్యల్లో భక్తులకు 'మాయా' శిక్షణ
భక్తి ముసుగులో వందల ఎకరాల ఆశ్రమాలు
అంధ భక్తుల వితరణలో అంతులేని కోట్ల సంపదలు

దూరాచార ముసుగులో అమాయకులను నమ్మించి
బలవంతంగా రాక్షసక్రీడలాగే దొంగ బాబాలకూ,
రాష్ట్రాల నడిబొడ్డున అమాంతం ఆక్రమించుకొని
ఎన్నో నేరాలు – ఘోరాలు చేసిన 'నయీం బాయ్''కూ
ఎక్కడైనా.... ఎందులోనైనా తేడా ఉందా...?
వీరి గురి అంతా కాసులకోసం, కన్నెల కోసం
ఎన్ని నగ్న సత్యాలు నిగ్గు తేల్చినా...
ఎన్ని చట్టాలొచ్చి శిక్షలు విధించినా...
ఎక్కడి దొంగబాబాలు అక్కడ భద్రమే
దుర్మార్గమైన వీరి స్వార్థానికి
మరణించేది మాత్రం సామాన్య జనమే!
వికటరూపంతో వెర్రితలలు వేస్తున్న బాబాలకు
అపారమైన విశ్వాసం కలిగిన అమాయక భక్తుల్లారా.....
తస్మాత్ జాగ్రత్త...!

సోమశిల తిరుపాల్, 9989260336

గోలకొండలో స్మృతికవిత్వం

తెలంగాణ సమాజపు గొంతుకగా నిలిచి, నాలుగు దశాబ్దాలపాటు నిర్విఘ్నంగా నడిచిన గోలకొండ పత్రికలో నాలుగు కాలాలపాటు నిలిచిపోయే కవిత్వం వెలువడింది. పద్య కవితా ఖండికలు, వచన కవితలు, దీర్ఘకవితలు, శతక సాహిత్యం, విదేశీ కవులు రాసిన కవితలకు తెలుగు అనువాదాలు ఇందులో ప్రచురితాలయ్యాయి. ప్రముఖులు చనిపోయినప్పుడు వారిని స్మరిస్తూ కవులు రాసిన స్మృతి కవితలు(ఎలిజీలు) ఇందులో లభించాయి. వట్టికోట ఆళ్వార్‌స్వామి, త్రిపురనేని గోపీచంద్, విశ్వనాథ సత్యనారాయణ, బాలగంగాధర్ తిలక్ తదితర కవులు, రచయితలు దివంగతులైనప్పుడు పలువురు కవులు స్మృతి కవిత్వం రాశారు. మీజాన్ పత్రిక సంపాదకుడు, రచయిత అడవి బాపిరాజుపై సింగరాజు లింగమూర్తి అనే కవి రాసిన కవిత గోలకొండ పత్రికలో అచ్చయ్యింది.

కులపతీ యశస్వీ /కళా తపస్వీ
అందులో ఓ రాజ/అంజలులు మావి
స్వార్థమెరుగని / సౌమ్యమూర్తి
మర్మమెరుగని / మధురమూర్తి
కథల కడలి నీవు / కవిత కోకిల నీవు

ప్రకృతి ఒడిలోని / ప్రేమ గాయకుడవు.. జోహార్ జోహార్ / జోహార్ కులపతీ /కులపతీ యశస్వీ/అందుకో ఓ రాజ/ అంజలులు మావి అంటూ కీర్తించాడు. ప్రజల మనిషి, గంగు నవలల రచయిత, తెలంగాణ సాంస్కృతిక యోధుడు, గ్రంథాలయ ఉద్యమకారుడు వట్టికోట ఆళ్వార్‌స్వామి దివంగతులైన సందర్భంలో కె. యాదవరెడ్డి (నిఖిలేశ్వర్) రాసిన కవిత 'ప్రజల మనిషి' శీర్షికతో గోలకొండ పత్రికలో అచ్చయ్యింది.

''నిష్కామ మనీషి / ప్రజా సేవ తపస్వి/
నిర్విరామం నెత్తురుపిండి/అగ్ని అక్షర తూణీరంతో/
నిజాం కబంధ హస్తాలకి /చిచ్చుపెట్టిన జాగృతి/
తురకల ముష్కరత్వం / ప్రజా ఉద్యమ వాహినిని/ జైల్లో నిర్మానుష్యంగా అణిచితే ''జైలు లోపల'' రచించి/
తెలంగాణ తెలుగు రక్తాన్ని ఏడారిలో ఒయాసిస్‌గా మార్చి/రాజ్యకాంక్ష ముష్కరులను /సామాన్యుల బంధువై / నీటముంచిన 'ప్రజల మనిషి'' అంటూ తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం సాంస్కృతిక సారథిగా ముందు నడిచి జైలు కెళ్లిన వట్టికోట ఆళ్వార్‌స్వామి త్యాగాన్ని కొనియాడాడు.

''మరుగున పడిన మాణిక్యాలను తవ్వే / వెలుగుతున్న వజ్రాలను మర్చే /
ఈ జాతి చస్తేనే గానీ కొలవదు ! /ఇది నిజం స్వామి గారు ! వ్యక్తి ఒక మహాసంస్థ /సంచార విజ్ఞాన గ్రంథం
పదవి, బిరుదులతో కాదు /జిజ్ఞాసలతో జ్వలిస్తేనే
మనగలిగే సృజన కర్త /అని సజీవంగా చూపించిన
నీకు మా అశ్రుతర్పణ'' అంటూ ఏ పదవులకు, బిరుదులకు అందని వట్టికోట ఆళ్వార్‌స్వామి వ్యక్తిత్వాన్ని, తెలంగాణకు ఆయన చేసిన సాంస్కృతిక సేవను యాదవరెడ్డి తన తన కవితలో కొనియాడారు. ఆళ్వార్‌స్వామి మొదటి వర్ధంతి రోజున 1962లో 'ఒక మిత్రుడు' పేరున సమర్పించిన భాష్పాంజలి 'ఏడూడి' శీర్షికన అచ్చయ్యింది. ఇది రాసిన కవి అసలు పేరు ఇందులో పేర్కొనలేదు.

''నీవు కనుమరుగై పోయి / నిండుకొన్నదొక యేడు /
నీవు కీర్తిశేషుడవై / బావురుమన్నదొక యేడు



ఒంటి స్తంభం విరిగిందని / ఇంటి మొగురం కూలిందని
కంటికి మంటికి ఏకధారగా నీ / ఇంటిది వలపోస్తున్నా
సగం వ్రాసి నీవు విడిచిన / సాంఘిక నవల తెలంగాణది
సగానికి పోయిన, శాసనం వలె / సాహిత్య చరిత్ర కొక
తీరని లోటు / భార్య పుత్రులకన్నా నీ / ప్రాణం కన్న
మానం కన్నా / గ్రంథాలయం ముఖ్యమని / కడుగొప్పగా
చెప్పేవాడివే ? /
పచ్చని బంగారు విగ్రహం / ప్రక్కనొక్క తోలు సంచీ
కలకలలాడే ఆ ముఖం / కనపించలే దెంత వెదకినా
నీ పేరును శాశ్వతంగా / నిలుపాలని తలచాలని
నిక్కి చెప్పిన మేమంతా / నీరుగారిపోయినాము
దేశోద్ధారక గ్రంథమాల / దేశోద్ధారక గ్రంథాలయం
యశోదమ్మతోపాటు / అనాథలైన ఏడూడిది''

అని ఆళ్వార్‌స్వామి వ్యక్తిత్వం, ఆహార్యాన్ని వర్ణించడంతో పాటు సాహిత్య ప్రచారానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆయన చనిపోయాక కుటుంబం అనుభవిస్తున్న వేదనను, ఆయనను మరిచిపోయిన సమాజం గురించి కవి తన మాటలుగా పాఠకుల హృదయాలకు తాకేలా చెప్పారు. ఆ తర్వాత కూడా ఆళ్వార్‌స్వామి స్ఫూర్తిని కొనసాగించడం, జ్ఞాపకాలను పదిలపరచడం లాంటి పనులు కొందరు కవులు, రచయితలు తప్ప ప్రభుత్వాలు చేపట్టకపోవడం విచారకరం.

ప్రముఖ కథకుడు త్రిపురనేని గోపిచంద్ అస్తమయం సందర్భంలో కొడాలి గోపాలరావు అనే కవి ఆవేదనతో రాసిన కవిత 'నివాళి'. '' కమ్మనిగాథ వింటిమి పకాలున నవ్వుచు పొంగిపోయి, లేరిమ్మహి గోపించందునకు సాటిగ రాగల వారటంచు, చోద్యమ్ముగ చెప్పుకొంటిమి కథానికలందున నీచమత్కృతుల్ మమ్ముల ముగ్ధలన్ బరచి మాకిట చెప్పక దూరమైతివా ''

నవ్వుతూ పొంగిపోతూ నీవు రాసిన కమ్మని కథలు విన్నామని, కథకుల్లో గోపీచంద్‌కు సాటిగల వారే లేరని తామనుకున్నామని కవి కొడాలి గోపాలరావు ప్రముఖ కథకుడు గోపీచంద్‌ను ప్రశంసించారు. ఈ ఖండికలో మరో నాలుగు నివాళి పద్యాలున్నాయి. 1965 నవంబర్ 2 నాటికి గోపీచంద్ మరణించి మూడేళ్లయిన సందర్భంగా 'గోపీచంద్' శీర్షికతో ఈ కవిత గోలకొండ పత్రికలో అచ్చయ్యింది. అయితే ఈ కవిత రాసిన కవి పేరు మాత్రం అందులో పేర్కొనలేదు.

''సాహిత్యాంబర వీధుల్లో / స్వైర విహారం చేసి
వెళ్లిపోయాడు గోపీచంద్ / మళ్లీరాడు గోపీచంద్
ఆ సింహ గంభీర విగ్రహం / విశాలవదనం ప్రశాంత నయనాలు
ఉంగరాల తల బంగారు ఛాయ / గంభీర గాత్రం, ఆ గాత్రంలోని మాధుర్యం
మళ్లీ రాడు మన గోపీచంద్
ఆ చంద్రుడే గోపిగా కిందికి వచ్చి / నవలలలో వెన్నెలలు చిందించారు / చిన్నకథలలో వెన్న చిలికించాడు / నాటకాలలో తేనెలొలికించాడు / చిత్రసీమలో కొత్త పంథాలు చిత్రించాడు / యోగిలా విరాగిలా తత్వం బోధించాడు
ఇంత చేసినా.. ఎంత వ్రాసినా /ఇంకా తాను 'సమర్థుణ్ణని'
''జీవ యాత్ర '' చాలించాడు / జీవితాన్నే త్యజించాడు''
వెళ్లిపోయాడు మన గోపీచంద్ / మళ్లీ రాడు మన గోపీచంద్ /త్రిపురనేని వంశంలో పుట్టి ప్రశస్తి పొందినవారిని గురించి జి. కవిశేఖర రాసిన కవిత 'ప్రశస్తి' ఇందులో త్రిపురనేని రామస్వామి చౌదరి, త్రిపురనేని గోపీచంద్, త్రిపురనేని సుబ్బారావుల ప్రశంస ఇందులో ఉంది.

'ఒక శ్రుతి వినబడును దూరదూరముల' శీర్షికతో ప్రముఖ కవి బాలగంగాధర్ తిలక్ స్నేహితుల బృందం రాసిన కవిత గోలకొండ పత్రికలో అచ్చయ్యింది. ఆయన భౌతికంగా దూరమయ్యాడనే బాధాతప్త హృదయంతో వారు ఈ కవిత రాశారు.

''ఈ బాధకు అంతం లేదు / ఈ వార్తకు కనికరం లేదు/
దినపత్రికలకు కన్నీళ్లు లేవు / జీవస్మృతులు మృతజీవుల గూర్చి మాట్లాడరు
తిలక్ మరణవార్త / రేడియో ప్రసారము చెయ్యదు
మనం చేసిన పాపం ఏమిటి ?
సిరంజిలో చావు బ్రతుకు / డాక్టర్ల చేతులలో అదే ప్రాణము
నిర్లక్ష్యానికి లొంగిపోయాడు డాక్టర్ / లక్ష్యానికి ముందే ఆగిపోయాడు తిలక్....'' అంటూ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచిన తిలక్ మరణవార్తను ప్రచురించని పత్రికలు, ఆ విషాదాన్ని ప్రజలకు తెలియజేయలేని రేడియో ప్రసారాల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపారు. ఈ కవితను తిలక్‌కే అంకితమిచ్చారు.

ఇలా కవులు, రచయితల సాహిత్య,సాంస్కృతిక కృషిని కొనియాడుతూ సమకాలీన కవులు రాసిన స్మృతికవిత్వం వారిపై తమకున్న ఆదరాభిమానాలను తెలియజేస్తోంది. నాటి తరం కవులు, రచయితలు పాటించిన విలువలు నేటి తరం వారికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి.

నుగునూతుల యాకయ్య,
8919913723

ఆధునిక పద్య ప్రబంధం ఉత్పల 'శతరూప'



నర్రా ప్రవీణ్‌రెడ్డి
9393636405

తెలుగు సాహిత్య క్షేత్రంలో పరిచయం అవసరం లేని మహాకవి డా॥ ఉత్పల సత్యనారాయణాచార్య. ప్రాచీన సాహిత్యం మూలంగా అనేక కావ్య రత్నాలను తన కలం నుండి జాలువాల్చాడు. బతికినన్నాళ్ళూ కవిత్వమై జీవించాడాయన. అమూల్యమైన సాహిత్య సంపదను పంచి సాహిత్య రంగంలో చెరిగిపోని ముద్ర వేసుకొని కాలం చేశాడు.

ఖమ్మం జిల్లాకు చెందిన ఉత్పల గజేంద్ర మోక్షం, భ్రమర గీతం, గోపీ గీతము, వేణు గీతము, కచ దేవయాని, రాస పూర్ణిమ మొదలగు 50 కృతుల వరకూ రచించగా '' ఈ జంట నగరాలు హేమంత శిశిరాలు'' కృతితో సాహితీ ప్రియుల మన్ననలు పొందటమే గాక 2003లో ''శ్రీ కృష్ణ చంద్రోదయ'' కావ్యమునకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

మహాకవి ఉత్పల 1980లో పెద్దలు బి.ఎన్.శాస్త్రి గారి అండతో 'శతరూప' అను పద్య కావ్యాన్ని ప్రచురించారు. శతరూప ముందుమాటలో డా॥ యం. కులశేఖర్‌రావు అన్నట్లు ఇది ఆధునిక పద్య ప్రబంధంగా తలపిస్తుంది.

ప్రబంధము అనగా ప్రకృష్టమైన బంధము అని అర్థం. సంస్కృతంలో పదాలకంటే అక్షరాలకే అర్థాలెక్కువగా ఉంటాయి. ఇక్కడ 'ప్ర' అనగా గొప్పదైన, శ్రేష్టమైన, ఉత్కృష్టమైన, ఉన్నతమైన అనే అర్థాలున్నవి. ప్రబంధం అను పదంలో బంధం అంటే కట్టబడింది. గట్టిగా, గొప్పగా బంధించబడింది (కట్టబడింది) ప్రబంధం. ఆనాడు రాసిన కావ్యాలు తాటాకులపై, తామ్రాలపై రాసేవారు వాటిని తరతరాలకు అందించాలనే ఉద్దేశంతో భూమిలో పాతి పెట్టి జాగ్రత్త చేయుటకై ఇనుప సంకెళ్లతో బంధించేవారు అలా ప్రకృష్టమైందే ప్రబంధంగా పిలువబడుతున్నదనేది ఒక ఐతిహ్యం.

ఇదిలా వుండగా దండి, నన్నె చోడుడు ప్రబంధ లక్షణాలను ప్రత్యేకంగా పేర్కొనగా అప్పకవి వేట, ముని ఆశ్రమం వంటి అదనపు వర్ణనలూ చెప్పాడు. మొత్తంగా ఏకనాయకాశ్రయం కలిగి శృంగార రస ప్రధానంగా 18 వర్ణనలు (నగరం, శైలం, పర్వతం మొదలగునవి) గలది ప్రబంధంగా నేడు పరిగణిస్తున్నారు.

ప్రబంధాలతో స్వర్ణయుగంగా పేరుగాంచిన రాయల యుగం తర్వాత కొందరు కవులు ప్రబంధ రచనపై దృష్టి పెట్టి సఫలీకృతులయ్యే ప్రయత్నం చేశారు. ఆధునికయుగంలో ప్రబంధం రాసి ఘనతకెక్కిన వాళ్లలో ముఖ్యులు ఉత్పల సత్యనారాయణాచార్యులు.

ఉత్పల రాసిన 'శతరూప' ప్రబంధంలో ఐదు సర్గలు కలవు. ఇద్దరు వ్యక్తులతో శతరూపాలుగా ఈ సృష్టి ఎలా గావించబడిందో తెలిపే కావ్యమే శతరూప.

ఒక అడవిలో వేటగానిగా ఉన్న ఒక పురుషుడు అదే అడవిలో గల ఒక అందమైన స్త్రీతో ప్రేమలో పడతాడు. తర్వాత ఇద్దరి కలయికతో ఒక పుత్రుడు జన్మిస్తాడు. అటు పిమ్మట వేటగాడే రాజై వెలిగి అడవిని నగరంగా మార్చిన తీరే శతరూపలోని ఇతివృత్తం.

అక్కడక్కడా అద్భుతమైన వర్ణనలతో అనేకానేకాద్భుతమైన సంఘటనలతో శతరూప ముందుకు సాగింది. దాంపత్య జీవనంలో భార్యాభర్తల అన్యోన్య సంబంధం చిత్రించబడటంతో పాటు పాత్రోన్మీలానికి సంకేతాలుగా కావించిన వర్ణనలు బంగారానికి తావి అద్దినట్లుగా వున్నవి.

''దప్పిగా మింటి తెరువరి ధరణి జలము
పూర్తిగా తాగి బరువెక్కి పోయినాడు /లాగజాలక యతని గుఱ్ఱాలు మంద /గాములయ్యె –పగళ్లు దీర్ఘమ్ములయ్యె '' అంటూ సూర్యు ని వర్ణనతో ప్రథమ సర్గను వినూత్నంగా ఆవిష్కరించాడు ఉత్పల. నాయికా నాయకుల వర్ణనలతో పాటు అడవి, సూర్యుని వర్ణనలు ప్రథమ సర్గలో కలవు.

అడవి యొక్క ప్రాశస్త్యాన్ని తెలుపుతూ, ''నాగరిక
లోక మాశించు భోగముల /
పిచ్చిగా త్యాగమెంతొ సల్పినది అడవి
''ఆర్ష ధర్మము భారత వర్ష మందు
ఆది నభిషేక మొనరించినట్టి దడవి'' అన్నాడు.

ద్వితీయ సర్గలో నాయకుడు మృగంవైపు తన అమ్ములపొదిలోని బాణాన్ని తీస్తూ పరిగెత్తటం, పూలవనం మధ్య ఒంటికాలుపై కూర్చొని విల్లెక్కుపెట్టడం చూచిన ఆ స్త్రీ పులకించింది. పురుషుడి అందానికి ముగ్ధురాలైంది. మరోసారి

'' రాలిన కొండ గోగు పువులన్ చెవులం దిడి చెంపలన్ కుసుం / భాల నలంది యయ్యడని మల్లెలు, మయూర పింఛ రిం /ఛోళి దిరస్కరించు కచ శోభ వెలార్చుచు సాంధ్య రాగ, ముద్వేల మొనర్చి యామె కనిపించిన దమ్మగవాని ముందరన్'' / అన్నట్లుగా సాక్షాత్కరించిన స్త్రీ తలను చూసిన పురుషుడు 'బెబ్బులులు పైన దూకిన బెదర నట్టి / ఉక్కుతునియ అయస్కాంత మురిసినట్లు' అయ్యాడట! ఇందు ప్రేమతత్త్వం వివరించబడింది. స్త్రీని దీక్షణంగా చూసిన పురుషుడు / ''నున్నని మొగంబు పరువం పునూగు ముక్కు చీల్చినట్టి మామిడికాయ జీళ్ళు కనులు ఎంత మృదులమ్మ లీయింతి కుంతలములు! ఔర! ఆడుది ఎంతందమైన జీవి!'' అనుకున్నాడు. ఇక్కడ కవి ఆడుదాన్ని వర్ణించిన తీరు ముచ్చటైనదే!

ఒక కఠినమైన మానవుడు తన చుట్టూ గల పరిసరాల వల్లనో, కొందరు వ్యక్తుల ప్రభావం చేతనో మృదుత్వంగా మారుతాడనటంలో ఇందులోని నాయకుడే నిదర్శనం. భీకరమూర్తియైన నాయకుడు ఒక స్త్రీ ప్రేమలో పడ్డాక 'ఆత్మయందు నిట్టి ఆనంద బంధుర / స్పర్శ లేక క్షణము బతుకలేడు' అన్నట్లుగా మారినాడు.

ఇక వాళ్లిద్దరూ కలిసి అడవంతా విహరించసాగారు. తృతీయసర్గలో ఉత్ప్రేక్షలో కూడిన చంద్రుని వర్ణన, వెన్నెల నిండుతనం, తెల్లుపూలు – చంద్రుడు స్వచ్ఛమైన నీటి అద్దంలో కల్సిన తీరూ వర్ణనాతీతంగా ఉంది. ఇలా,

''శారదరాత్రి మింటి పయి చంద్రుడు మంటిని తెల్లుపూలు చెన్నారగ నట్టు నిట్టు పులి నాలు బయల్పడ మెల్లమెల్ల జాల్వారు శరన్నదీ విమల వారి వధూ నవ సంగమ త్రపాహారి సముజ్జితైక జఘ నాంశుకమో యనిపించె పల్చనై''

పురుషుడు పూర్తిగా ప్రేమలో మునిగి స్త్రీకి ప్రతిపాదన చేయగా స్త్రీ / ప్రతీకాత్మకంగా, '' ఏ వలను వేసి బంధించి
నావో గాని కదలనీయవు నన్ను నీ యెదుట నుండి
దాసి నైతిని నీదు బంధనము నందు
నాకు ముక్తి – సుఖమ్ము – ధన్యతయు నింక'' అని పలికింది. / స్త్రీ ఆర్ద్రతతో కూడిన హృదయాన్ని కళ్లకు కట్టి



చూపాడు కవి ఉత్పల. ఇక ఇద్దరి మనసులు కలవగా,
'' నేను పూర్తిగ నింక నీ దాన నైతి
నేలకొమ్మంచు తన మెడ గ్రాలు దండ
తీసి యాతని మెడలోన వేసే నామె
నెమలిపురి కిరీట మత డాయమకు బెట్టె. ''

పచ్చని ప్రకృతి సమక్షంలో వారిద్దరి వివాహం చూడముచ్చటగా చేసి కథకు మంచి పుష్టిని కూర్చాడు కవి.

కొన్నాళ్ళకు అడవిలోని జంతువులనన్నీ వేటాడి అడవికి రాజై వెలిగాడు నాయకుడు. అదిప్పుడు అడివి కాదు ఉద్యానవనంగా వాళ్లిద్దరికీ స్థావరమైంది. అది చూసి ఆకాశంలో దేవదుందుభులు మొరసినాయి.

చతుర్థ సర్గలో ఆటవిక జీవనం, దాంపత్య జీవనం మహత్తరంగా చిత్రించబడినాయి.

''నా మనస్సు నీయందు లగ్నమగు కొలది
అతివ! నాకింత నీ వవగతము కావు
దినదినమ్మున కొక కొత్తదనము పొంది
నన్నపరిచితు జేయుచున్నావు నీవు '' అనగానే ఆమె ముఖం / 'అక్షితారలు మెఱుగెక్కెన ధర చలిత / మధుర దరహాస రేఖ చెంపలకు ప్రాకె అంటూ భార్యాభర్తలు అన్యోన్య సంబంధం వర్ణించిన పద్యాలు మనోహరమైనవే!

అలా జీవనం కొనసాగిస్తున్న నాయికానాయకులు సొంత గూడును నిర్మించుకొని వస్తువులన్నీ సమకూర్చుకునే పనిలో ఉండగా ఒకనాడు సవత్సంబుగా (దూడతో) గోవు నెమరువేసుకుంటూ అక్కడికి చేరినది. ఆ గృహపతులా గోవును

''గోవు కొమ్ముల యందు దేవేంద్రుడున్నాడు
ఫాలదేశంబున బ్రహ్మ గలదు
అక్షి ద్వయంబున నాదిత్యుడున్నాడు
కుక్షి యందున పావకుండు గలడు
శ్రవణ రంధ్రంబుల పవమాను డున్నాడు
మూపురంబున లింగమూర్తి గలదు
వాల భాగంబందు కాలుండు నున్నాడు
కాళ్ళయందున మరుద్గణము కలదు
పొదుగున సరస్వతి పురీషమున విభూతి
పంచితంబున కీర్తి భాసించునట్టి
సర్వ దేవతామయియైన సౌరభేయి
మనుపరుల కిచ్చెడిది జయమంగళములు'' అనుకుంటూ సపర్యాభాజనంబు గావించినారు. ఇక్కడ గోవును సర్వదేవతామయిమైన సౌరభేయి అనటంలో శతరూప కావ్యకర్తకు ప్రాచీన భారతీయ సంప్రదాయంపై గల ప్రగాఢమైన విశ్వాసం ప్రస్ఫుటిస్తుంది. ఇక నాయికా నాయకులు భోజనం చేయు సందర్భాన / ''అన్నము సర్వౌషధ సంపన్నం బిది యారగించి పదయము తేజం
బన్నిటికంటెను శ్రేష్ఠం
బన్నమె జ్యేష్ఠంబు కల పదార్థములందున్ '' అని రాసిన కందంలో అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్న మాటలు స్ఫురిస్తున్నాయి. అవసరం మేర వర్ణనలు చేస్తూనే కవి లోకజ్ఞతనూ చక్కగా ప్రదర్శించాడు.

చివరి సర్గలో పురుషుడు పరవశానికి లోనై బలిష్ఠ బాహువుల రెంటిని సాచి తదీయ దేహ వల్లరి తన పేరు రమ్మునకు లాగుకొన్నాడు. అప్పుడు లోకం హర్షించింది. దాంతో ''వనపదములు మహాజనపదము లయ్యె
వాసములు నిండ్లు మేడలై వాడలయ్యె
అమ్మహాత్ములు నడచినయట్టి కాలి
బాటలవి పదంపడి మహా పథములయ్యె'' అంటూ కవి సెలవిచ్చాడు. మానవ పరిణామ క్రమమును, మనస్సులను తెలుపుతున్న ఈ పద్యాలలో కవిలో ఒక ఆంత్రోపాలజిస్ట్, సైకాలజిస్ట్ గోచరిస్తున్నాడనటంలో అత్యుక్తి లేదు.

క్రిస్టియన్స్ మత గ్రంథం బైబిల్ ప్రకారం సృష్టికి మూలం ఏదేముతోటలో నివసించిన ఆడమ్స్ మరియు ఈవ్. ఆ కథను జ్ఞప్తి చేస్తూ సాగిందీ ప్రబంధం.

ఇద్దరు వ్యక్తులు శతరూపాలుగా ఆవిర్భవించిన రీతిని వ్యక్తపరుస్తూ నడిచిన ఈ ప్రబంధం ఉత్పల వారి వర్ణనా చాతుర్యానికి ప్రతిబింబం. ఈ శతరూపను పాఠకుడికి ఆద్యంతం విసుగు కలగకుండా చవులూరించే విధంగా పూరించారు ఉత్పల సత్యనారాయణాచార్యులు.

వజ్రపు కాంతులు

ఇంటికి ఏక్షణంలో
ఏ అతిథి వచ్చినా
కమ్మటి భోజనంతో
ఆదరించే అమ్మ
ఎంత కఠినం!

పోటీ తత్త్వం
ప్రశ్నించే గుణం
జవాబు దారీతనం
అమె సొంతం
చదువులో
వందకు తొంబై
లక్ష్మణుడి గీత
దాటకూడనిదైతే
ఆమె పెట్టేగీత దాటి
తీరవలసింది
అదం ముందు నిలబడి
సోకుల చేస్తే
అమ్మ చూపులు అగ్ని కణాలు

పాఠ్యపుస్తకాల్లో
జవాబు రాని ప్రశ్న
ఒక్కటీ ఉండొద్దు
సాధించని సమస్య
కనబడనే వద్దు
అప్పుడు అమ్మచేతి
డబుల్ కా మీఠా కడుపునిండా
లేకుంటే ఒంటి కాలిపై
అపరకాళిమాత
ఇలాంటి సమయాల్లో
కాపాడుతాడనుకునే నాన్న
హఠాత్తుగా మాయమౌతాడు
అడ్డుపడుతుందనుకునే
నాయనమ్మ
చతికిల పడ్తుంది
సంఘటన జరిగాక వచ్చే
పోలీసు లాంటి తాత
అంతా అయ్యాక
ఊరడింపులకే పరిమితం
చెరో మూల నక్కే చెల్లీ
తమ్ముడూ
సుద్దపూసల్లా నటనలు

కాసేటికి ద్రవీభవించే
మంచు గడ్డ అమ్మ
పిల్లలు ప్రయోజకులై
తమ కాళ్లపై తాము నిలబడితే
అమ్మచూపులు
వజ్రపు కాంతులు

అమ్మంగి కవిత
8790568980

బడివిద్యార్థుల కథలు — 2018

తెలంగాణ రాష్ట్రంలో 6 వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు, తాము స్వయంగా రాసిన కథలు (సమాజం, ప్రకృతి, వ్యవసాయం, కుటుంబం, బడి, చదువులు ఇందులో ఏ అంశంపై నైనా) పంపించాలి. ఆ కథలతోపాటు వారు చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ధృవీకరణ పత్రం కూడా జతపరచాలి. అట్లా పంపిస్తున్న కథల్ని – మంచి పుస్తకం, 12–13–439, వీధి నెం.1, తార్నాక, సికింద్రాబాద్–017అనే చిరునామాకు 5, ఏప్రిల్ 2018వ తేదీలోపు అందించాలి. వాటిని 'తెలంగాణ బడి పిల్లల కథలు–2018' పేరిట వెలువరిస్తామని తెలంగాణ బాల సాహిత్యపరిషత్, పిల్లలకోసం, మారసం, మంచి పుస్తకం పక్షాన ప్రకటించారు.

వుప్పల లక్ష్మణరావు స్మారక సభ

ప్రముఖ సాహితీవేత్త వుప్పల లక్ష్మణరావు వర్ధంతి, స్మారక జీవన సాఫల్య సాహితీ పురస్కారాన్ని ఈనెల 22 న సా॥ గం॥5లకు విశాఖపట్నంలోని విశాఖ పౌర గ్రంథాలయం నందు దేవరకొండ సహదేవరావుకు అందిస్తారు. ఈ సమావేశంలోపి.అనంతరావు, అడపా రామకృష్ణ, డి.ఎస్.ఎస్.రాజు, కె.ఎల్.ప్రసాద్ తదితరులు పాల్గొంటారు.

ప్రశాంతమైన నిద్ర కోసం...



మనకు తలనొప్పి విపరీతంగా వస్తే మనకు వెంటనే ట్యాబ్‌లెట్స్ గుర్తొస్తాయి కాని ఈ హెడ్‌సెట్ ద్వారా తలనొప్పికి చెక్ పెట్టవచ్చు. ఈ హెడ్‌సెట్‌కు ఓ చిన్న పరికరం జోడించి మీ ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకోవచ్చు. కోర్టెక్స్ సంస్థ తయారు చేసిన ఓ చిన్న గ్యాడ్జెట్ వల్ల ఇది సాధ్యమవుతుంది. దీన్ని వీఆర్ హెడ్‌సెట్‌కు జోడించి సంబంధిత వీడియోలను 20 నిమిషాల చొప్పున రోజుకు రెండుసార్లు చూస్తే మనసు ప్రశాంతంగా మారి చక్కని నిద్ర పడుతుంది. మెదడులో ఉత్పత్తి అయ్యే సెరోటొనిన్, కోర్టిసోల్‌ను ఈ హెడ్‌సెట్ అదుపు చేయడం ద్వారా ఒత్తిడి దూరమవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



సామాజిక రుగ్మతలపై అవగాహనాస్త్రం

సామాజిక సమస్యలను రూపుమాపేందుకు యువతీయువకులకు అవగాహన కల్పిస్తూ దేశానికి తన వంతు సేవచేస్తున్నాడు కుషాయిగూడకు చెందిన సింగిరెడ్డి అఖిలేష్‌రెడ్డి. 'గోల్స్ ఆన్ వీల్స్' అనే నినాదంతో లక్షమంది విద్యార్థులకు అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇప్పటివరకు వివిధ పాఠశాలల్లో 20 వేల మంది విద్యార్థులను కలిశాడు. ఐక్యరాజ్యసమితిలో భారతదేశం తరపున రెండుసార్లు ప్రాతినిథ్యం వహించి యువతకు ఆదర్శంగా నిలిచాడు.



భారతదేశ స్థితిగతులు, సంప్రదాయాలను ఐక్యరాజ్యసమితి ద్వారా ప్రపంచ దేశాలకు తెలియజేసే అరుదైన అవకాశాన్ని చేజిక్కించుకున్నాడు అఖిలేష్ రెడ్డి. ఈ స్ఫూర్తితో ఇండియాలోని యువతకు నేటి దేశ స్థితిగతులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశం కలిగినట్లు చెబుతున్నాడు. నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను లక్ష్యంగా పెట్టుకున్నాడు. విద్యార్థి దశ నుంచే దేశ పరిస్థితులపై అవగాహన కల్పించడం మంచిదనుకున్నాడు. స్నేహితులతో కలిసి పేదరికం, నాణ్యమైన విద్య, పర్యావరణ పరిరక్షణ, మహిళలపై దాడులు ఇలాంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాడు. సామాజిక మాధ్యమానికి పెరిగిన ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని కొన్ని పాఠశాలలకు డిజిటల్ ప్రొజెక్టర్లను అందజేశాడు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు ఆలోచించేలా మాట్లాడటంలో దిట్ట అఖిలేష్. వంద రోజుల్లో లక్షమందికి దేశంలోని సమస్యలపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో గోల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. ఐక్యరాజ్యసమితి 17 అంశాల ప్రధాన ఎజెండా పెట్టుకుని పనిచేస్తోంది. వాటినే తన ప్రధాన ఎజెండాగా తీసుకున్నాడు అఖిలేష్‌రెడ్డి. యువతరం భారతం నినాదంతో విద్యార్థులను కలుస్తున్నాడు.

తను నమ్ముకున్న సిద్ధాంతం కోసం అమెరికాలో లక్షల జీతం ఉన్న ఉద్యోగాన్ని వదులుకున్నాడు. హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశాడు. ఎంఎస్ చేయడానికి అమెరికా వెళ్లాడు. బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఉద్యోగం సంపాదించాడు. అయినా ఏదో అసంతృప్తి వెంటాడేది..తను చేయవలసింది ఇది కాదనుకున్నాడు. పది మందికి మంచి చేయాలనుకున్నాడు. పుట్టిన గడ్డకు సేవ చేయాలని అమెరికాలోని కొలువును వదులుకున్నాడు. ఇలా 2017 అక్టోబర్‌లో మొదలైన తన ప్రయాణం ఇప్పటి వరకు నిరాటంకంగా కొనసాగుతోంది. స్వచ్ఛంద సంస్థలతో కలవకుండా ఒక్కడే వలంటీర్‌గా ఈ కార్యక్రమాలను చేస్తున్నాడు. చిన్న చిన్న సమస్యలే జాతీయ అంతర్జాతీయ సమస్యలుగా మారతాయంటాడు అఖిలేష్. అందుకనే చిన్నగా ఉన్నప్పుడే దాన్ని పరిష్కరించుకోవాలంటాడు .

వంద పాఠశాలలు...

చదువుకునే పిల్లల్లో స్ఫూర్తి నింపడం వల్ల భవిష్యత్తు బాగుంటుందని ప్రణాళిక వేసుకున్నాడు. వంద రోజుల్లో వంద స్కూళ్లను తిరిగి, సుమారు లక్ష మంది విద్యార్థులకు అవగాహన కల్పించడం ధ్యేయంగా పెట్టుకున్నాడు. అనుకున్నట్లుగా అనేక పాఠశాలకు వెళ్లాడు. కొన్ని స్కూళ్లు ఇతని అభ్యర్థనను సున్నితంగా తిరస్కరించాయి. అయినా అధైర్యపడలేదు. నగరంలోని చుట్టుపక్కల ఉన్న సుమారు 30 పాఠశాలలను తిరిగి 75 వేల మందికి అవగాహన కల్పించాడు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యాక జిల్లాలపై దృష్టిపెడతానంటున్నాడు. ప్రపంచంలో ఏ దేశానికీ లేని శక్తి మన దేశానికి ఉందంటాడు. మన ప్రధాన శక్తి యువత. వారు తల్చుకుంటే అసాధ్యం ఏదీ లేదంటాడు. సిద్ధాంతాల కోసం, దేశం కోసం యువత ఏమైనా చేయడానికి సిద్ధపడాలంటాడు. దేశ అభివృద్ధి యువత వల్ల ఎలా సాధ్యమవుతుందనే



విషయాన్ని ప్రజెంటేషన్ ద్వారా చూపిస్తూ , వారిలో చైతన్యాన్ని కల్గిస్తున్నాడు. సమాజంపై అవగాహన, తోటివారికి సాయం చేయడం, లీడర్‌షిప్ క్వాలిటీస్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ లాంటి అంశాలను విద్యార్థులకు చెబుతూ, వారిలో ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నాడు.

నాచారంలోని సెయింట్ పీటర్స్ మోడల్ స్కూల్‌లో పదో క్లాసు వరకు చదివాడు అఖిలేష్‌రెడ్డి. ఈసీఐఎల్ శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్, కొంపల్లిలోని సెయింట్ మార్టిన్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. అనంతరం ఎంఎస్ చేయడానికి అమెరికా వెళ్లాడు. ఇంటర్ నుంచే సేవా కార్యక్రమాలను చేయడం అఖిలేష్‌కు అలవాటుగా మారింది. గవర్నమెంటు స్కూల్లో కనీస అవసరాల గురించి, విద్యార్థుల సమస్యలపై పోరాడటం, ఆర్థిక సాయం అందించడంలాంటి కార్యక్రమాలపై కళాశాల రోజుల్లోనే ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖా మంత్రులను కలిశాడు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థలో చేయాల్సిన మార్పులపై వారికి నివేదిక సమర్పించాడు. ఇలా చదువుకునే రోజుల్లోనే సేవా కార్యక్రమాలను చేస్తున్న అఖిలేష్ రెడ్డి ఆశయం ఫలించాలని కోరుకుందాం...

గిన్నిస్ రికార్డే లక్ష్యంగా...



అసలే పేదరికం... సెంటు భూమి లేదు. తనవద్ద దమ్మిడీ లేదు. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. తండ్రి మరణం కలచి వేసింది. ఓ పైపు ఉపాధి లేదు. ఆపైన ఏదో చేయాలనే తపన అలాగని ఇంటివద్ద ఉండలేదు. అపుడే గ్రామంలో సైకిల్ షాపు నడుపుతున్న బాబాయ్ వద్ద పనిలో చేరాడు. తాను నేర్చుకున్న సైకిల్ రిపేర్ పనితోనే విభిన్న ఆకృతుల సైకిళ్లు తయారు చేసి చిన్నతనంలోనే రోడ్లెక్కించాడు. కడు పేదరికంలో మెదడుకు పని పెట్టి ఇనుప వస్తువులతో చిన్న పరికరాలను తయారు చేసి ప్రతిభను చాటుకుంటున్నాడు. ఇటీవలే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. తనకున్న దానితో బతుకు బండిని లాగుతున్నాడు అంజాద్ పాషా. అతనో సైకిల్ దుకాణదారుడు. చిన్నతనం నుంచే కష్టాల కడలిలో బాబాయ్ వద్ద పని చేస్తూనే సొంత డబ్బులు ఖర్చు చేసి పాత సైకిళ్ల వస్తువులతో విభిన్న ఆకృతుల సైకిళ్లను తయారు చేశాడు. అదిలాబాద్ జిల్లా మందమర్రి గ్రామానికి చెందిన షర్ఫొద్దీన్, జనాబీ దంపతుల కుమారుడు అంజద్‌పాషా 4వ తరగతి వరకు గ్రామంలో చదువుకున్నాడు. రోజూ కష్టపడి పనిచేస్తూ కొంత డబ్బు ఇంట్లో ఇచ్చేవాడు. మిగతా డబ్బులు సైకిళ్ల తయారీకి ఉపయోగించేవాడు. 1992 సంవత్సరంలో అదే గ్రామంలో సొంతం సైకిల్ రిపేర్ షాపు పెట్టుకొని పాత సైకిళ్ల సామానుతో 3 నెలలు శ్రమించి సైకిల్‌ను తయారు చేశాడు. ఆ సైకిల్‌కు కరోనా అనే నామకరణం చేసి అందరి మన్ననలు పొందాడు. నాటి నుంచి జీటివి,హైటెక్, చాలెంజర్, ఇండియన్ గోల్డ్ వంటి మరో 15 సైకిళ్లను తయారు చేసి రోడ్లపై తిప్పాడు. సైకిళ్లు రిపేర్ చేస్తూనే విభిన్న ఆకృతులతో సైకిళ్ల తయారీ ప్రావీణ్యం పొందాడు. కొద్ది రోజులు అక్కడే షాపు నడిపిన అతడు వరంగల్ జిల్లా భూపాలపల్లికి మకాం మార్చాడు. అక్కడ ఓ టైర్ పంక్చర్ దుకాణం ఏర్పాటు చేసుకొని జీవితాన్ని ప్రారంభించాడు. 5 ఫీట్ల సైకిల్‌ను తయారు చేసి ఆ సైకిల్‌పైనే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. అనంతరం 2014లో గజ్వేల్ పట్టణానికి మకాం మార్చి ప్రజ్ఞాపూర్ రోడ్డులో టైర్ పంక్చర్ దుకాణం ప్రారంభించాడు. ఈ క్రమంలో జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడంతో మొట్టమొదటగా జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో విభిన్న సైకిళ్లు తయారు చేసి అందరినీ ఆకట్టుకోవాలనే సంకల్పంతో రూ.10 వేలు ఖర్చు చేసి పదిహేను ఫీట్లకు పైగా సైకిల్‌ను తయారు చేశాడు. గోల్కొండ కోటలో నిర్వహించే వేడుకల్లో పాల్గొనాలనే తపనతో ఆగస్టు 8న గజ్వేల్ పట్టణంలోని వీధులలో పదిహేనున్నర ఫీట్ల సైకిల్‌ను ట్రయల్ రన్ చేయడానికి నిచ్చెన సాయంతో ఎక్కి ముందుకు నడుపుతున్న క్రమంలో కొద్దిదూరం వెళ్లగానే ముందు చక్రం జారి కిందపడడంతో అంజద్‌పాషా కాలు తొడ భాగాన విరిగి బెణికింది. కొద్ది రోజులు పనిచేయలేదు. మరలా తిరిగి పనిలోకి చేరగానే తన నైపుణ్యానికి మళ్లీ పదునుపెట్టాడు. అతను బైక్ పార్టులతో తయారు చేసిన సైకిల్‌పై జీవనం కొనసాగిస్తున్నాడు.

"చిన్నతనం నుంచే బాబాయ్ దుకాణంలో ఉంటూ సైకిల్ రిపేరింగ్ నేర్చుకున్నాను. అందులో నా చిన్నతనం గడిచిపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నన్ను చేరదీసి బాబాయి తన వద్ద ఉంచుకొని పని నేర్పించాడు. అందులోనే నైపుణ్యతను సాధించుకుంటు ఇనుప వస్తువులో చిన్నచిన్న సైకిల్, మోటరు సైకిల్, ఆటోలు తయారు చేస్తున్నాను. చేతిగోళ్ల పై నిలిచే సూక్ష్మ సైకిల్‌ను మొదలు కొని 15ఫీట్ల వరకు రూపొందించాను. ఇలా తయారు చేయడం వల్ల ఇటీవలే తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో పేరును సంపాదించాను. గిన్నిస్ రికార్డులో పేరు సంపాదించడమే లక్ష్యంతో ఉన్నానంటూ" తన ఆశయాన్ని తెలియజేస్తున్నాడు.

ఎన్.కనకయ్య,
మన తెలంగాణ రిపోర్టర్, గజ్వేల్

ఒత్తిడిని చిత్తుచేయండిలా!

అనేక భారాలు, ఒత్తిడులతో... జీతానికి, జీవితానికి మధ్య అనుక్షణం నలిగిపోతున్నారు నేటి యువతరం. ఉరుకుల పరుగుల జీవితంలో వయోభేదాలు, స్థాయిభేదాలు లేకుండా "స్ట్రెస్" ముప్పతిప్పలు పెడుతోంది. అయితే ఇది మరీ వదిలించుకోలేని గడ్డ సమస్యేమీ కాదు. ఈ చిట్కాలు పాటిస్తే చాలు... ఒత్తిడిని చిత్తు చేయవచ్చు.

వీటిని మార్చాలి: అలసిపోయామని టీ తాగేస్తాం. కాఫీ పట్టించేస్తాం. కూల్‌డ్రింకులతో చల్లబడదామనుకుంటాం. కానీ ఇవన్నీ ఒత్తిడిని పెంచేవేనని పరిశోధనల్లో తేలింది.

జిమ్‌కెళ్లండి : జిమ్ అనగానే బాడీ బిల్డింగ్ కోసమనుకుంటారు చాలా మంది. కానే కాదు. వ్యాయామంతో స్వేదం చిందించడం ఒత్తిడిని తగ్గించుకోవడానికో ఉత్తమ మార్గం. మంచి మ్యూజిక్ వింటూ కసరత్తు చేస్తే ఇక తిరుగే ఉండదు.

పక్కాగా ప్లాన్ చేసుకోండి: తమ పనుల విషయంలో కచ్చితమైన ప్రణాళికతో ఉండేవారికి సగం భారం తగ్గినట్టే. భారమే లేనప్పుడు ఒత్తిడి ఎందుకొస్తుంది.

నో చెప్పడం నేర్చుకోండి: అతిగా ఆతృతపడటం వల్ల ఏర్పడినంత స్ట్రెస్ మరి దేనివల్లా రాదు. అవతలి వారిని మెప్పించడానికి, పై వారిని ఆకట్టుకోవడానికి మీ స్థాయికి మించిన భారాలను తలకెత్తుకోకండి. మీ వల్ల కాదు అనుకున్న సందర్భాల్లో "నో" అని చెప్పడానికి మొహమాటపడకండి.

హాబీలుంటే మేలు : ఎంత బిజీగా ఉన్నా ఏదో ఒక క్రియేటివ్ హాబీ ఉంటే చాలు... మానసికాందోళన ఇట్టే పారిపోతుంది. కాబట్టి మీ మనసుకు నచ్చిన ఏదైనా సృజనాత్మక హాబీని అలవర్చుకోండి.



చిన్ని చిన్ని పవర్‌బ్యాంక్‌లు



మనకు ఫోన్ ఎంత ముఖ్యమో పవర్‌బ్యాంకులు కూడా అంతే అవసరం. ఇక్కడున్న ఈ బుజ్జి పవర్ బ్యాంకులు చూస్తుంటే ఇవి పవర్‌బ్యాంకుల్లా అనిపించడం లేదు కదా! అయస్కాంత శక్తితో ఫోన్ ఛార్జింగ్ పోర్టుకి కనెక్ట్ అయ్యే ఈ 'మీట్ ఫింగర్ ఫా' పోర్టబుల్ ఛార్జింగ్ పాడ్స్‌ని ఛార్జ్ చేస్తాయి. వాటి ద్వారా ఐఫోన్ 8 మోడల్‌ని 30 నిమిషాల్లో 25 శాతం వరకూ ఛార్జ్ చేస్తుంది. డాక్ స్టేషన్‌పై నాలుగు పాడ్స్‌ని ఛార్జ్ చేయవచ్చు. ఒక్కో పాడ్ మెమొరీ సామర్థ్యం 600ఎంఏహెచ్. ఈ పాడ్ బరువు 15 గ్రాములు.

నేడు ఎన్నికల సంఘం సమావేశం



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రానికి కొత్తగా ఎన్నికల ప్రధానాధికారిని ఎంపిక చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఢిల్లీలో సమావేశం కానుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇప్పటికే సిఇఓ నియామక ప్రక్రియ పూర్తయినందున తెలంగాణకు కూడా విడిగా సిఇఓను నియమించాల్సిన అవసరం ఏర్పడింది. ఇందుకోసం సీనియారిటీ కలిగిన అభ్యర్థుల జాబితాను పంపాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేయడంతో ఈ నెల 5వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముగ్గురు అధికారులతో కూడిన జాబితాను పంపారు. ప్రస్తుతం అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న రజత్‌కుమార్, విద్యాశాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న నవీన్ మిట్టల్, కార్మిక శాఖ కమిషనర్‌గా పనిచేస్తున్న శశాంక్‌గోయల్‌లను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. వీరిలో ఒకరిని కేంద్ర ఎన్నికల సంఘం ఎంపికచేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపితే సిఎం ఆమోదంతో అధికారిక ఉత్తర్వులు వెలువడతాయి. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల కమిషనర్లు దృష్టిపెట్టినందున ఇప్పటివరకు సమావేశం కాలేదని ఢిల్లీ వర్గాలు వ్యాఖ్యానించాయి. సోమవారం ముగ్గురు కమిషనర్లు సమావేశమై ఈ అంశంపై చర్చించి ఒక అధికారి పేరును ఖరారు చేసే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఆ తర్వాత ప్రభుత్వానికి సమాచారంఇస్తే, దానికి సిఎం ఆమోదంతో ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడతాయని సచివాలయంలో ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

20న దళిత సంఘాలతో జాతీయ ఎస్‌సి కమిషన్ భేటీ

మన తెలంగాణ / హైదరాబాద్ : రెండు రోజుల రాష్ట్ర పర్యటన నిమిత్తం హైదరాబాద్ వస్తున్న జాతీయ ఎస్సి కమిషన్ మంగళవారం దళిత సంఘాలతో సమావేశం కానుంది. జాతీయ ఎస్‌సి కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్ శంకర్ కథెరియా నేతృత్వంలో కమిషన్ సభ్యులు ఫిబ్రవరి 20, 21 తేదీల్లో హైదరాబాద్ నగరాన్ని సందర్శిస్తోంది. ఈ సందర్భంగా 20న దళిత సంఘాలతో వినతులు స్వీకరిస్తుందని తెలంగాణ ఎస్‌సి డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ పి.కరుణాకర్ తెలిపారు. బంజారాహిల్స్ తాజ్ దక్కన్ హోటల్‌లో 20న సాయంత్రం 4గం.లకు ఎస్‌సి కుల సంఘాలతో కమిషన్ కలుస్తుందని కరుణాకర్ సూచించారు.

ఎస్‌సిఆర్ జిఎం ఆకస్మిక తనిఖీ



మన తెలంగాణ / హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడి స్టేషన్‌లో, రైళ్లలో కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. తొలుత స్టేషన్‌లో ఆగి ఉన్న హైదరాబాద్ – తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్‌లో ఎసి బోగీలను, ప్రయాణికులకు సరఫరా చేస్తున్న ఆహారాన్ని జిఎం పరిశీలించారు. అనంతరం సికింద్రాబాద్ – ముంబై సిఎస్‌ఎంటి దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లోని స్లీపర్, జనరల్ బోగీలను పరిశీలించారు. ముఖ్యంగా ఆహారాన్ని సరఫరా చేసే కేటరింగ్ విభాగాన్ని, మూత్రశాలలను, స్టేషన్‌లో పరిశుభ్రతను జిఎం తనిఖీ చేశారు. ప్రయాణికులకు ఆర్‌పిఎఫ్ కల్పిస్తున్న భద్రతను కూడా ఆయన పరిశీలించారు. అనంతరం కోచ్ మెయింటెన్స్ డిపోను సందర్శించి దాని పనితీరును కూడా పరిశీలించారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ మేనేజర్ అమిత్ వర్ధన్‌తో పాటు పలువురు రైల్వే ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారుపాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 9 మంది మృతి

చెన్నై: బస్సును వ్యాన్ ఢీకొట్టడంతో 9 మంది మృతి చెందిన దుర్ఘటన తమిళనాడులోని కాంచిపురం జిల్లా సమ్మల్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన బస్సు అదుపుతప్పి వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 9 మంతి అక్కడికక్కడే చనిపోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చట్నీస్ హోటల్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్: కూకట్‌పల్లి చట్నీస్ హోటల్‌లో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. హోటల్ నుంచి మంటలు ఎగిసిపడుతుండడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. భయంతో హోటల్ నుంచి కస్టమర్లు పరుగులు తీశారు. అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం.

మరుగుదొడ్డి కడిగిన ఎంపి!

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని రివా నియోజకవర్గం ఎంపి, బిజెపి నేత జనార్దన్ మిశ్రా చేసిన ఓ పనికి దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు. ఇంతకీ ఆయన చేసిన పనేంటో తెలుసా ఓ పాఠశాల మరుగుదొడ్డి శుభ్రం చేయడం. స్కూల్ సందర్శనకు వెళ్లిన ఎంపికి విద్యార్థులు తమ మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో బయటకు వెళ్లాలని వాపోయారు. విద్యార్థుల గోడు విన్నా మంత్రి వెంటనే స్వయంగా రంగంలోకి దిగారు. ఒట్టి చేతులతోనే టాయిలెట్‌ను క్లీన్ చేశారు. ఆ సమయంలో తీసిన వీడియోను ట్విట్టర్‌లో పోస్టు చేశారు. స్వచ్ఛభారత్ లో భాగంగా తాను ఈ పని చేశానని జనార్ధన్ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

మొదలు కాని ముద్రణ?


(మొదటిపేజీ తరువాయి)

సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన సమస్యలేనా లేక ప్రత్యేక తరహా కాగితం, ఇంకులను సమకూర్చుకోవడంలో జరుగుతున్న జాప్యమా అనే వివరాలపై అధికారులు వివరణ ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయలేదు.

విద్యార్థిని ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు పేర్కొన్నారు. ప్రేమలో మనస్పర్థలు రావడంతోనే మృతి చెందిందా? అనే కోణంలో వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు



ప్రముఖ కార్మిక నాయకులు మలయాపూరం సింగారవేలు చెట్టియార్‌కు పాండిచ్చేరి ముఖ్యమంత్రి నారాయణ స్వామి, సిపిఐ జాతీయ కార్యదర్శులు డి.రాజా, డాక్టర్ కె.నారాయణ నివాళులు అర్పించారు. సింగారవేలు జయంతి సందర్భంగా ఆయన స్వరాష్ట్రమైన పాండిచ్చేరిలో విగ్రహానికి ఆదివారం వారు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సింగారవేలు దేశంలో తొలిసారిగా కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా 'మే డే' వేడుకలను నిర్వహించారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

ఆన్‌లైన్‌లో పియుసి సర్టిఫికెట్లు



త్వరలో రవాణశాఖతో విపిటిసిల అనుసంధానం

మన తెలంగాణ/హైదరాబాద్ : వాహనాల కాలుష్యాన్ని తనిఖీ చేసే 'వెహికిల్ పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్ల' (విపిటిసి) అవకతవకలకు చెక్ పెట్టాలని తెలంగాణ రాష్ట్ర రవాణ శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా విపిటిసిలను కూడా ఆన్‌లైన్‌లో అనుసంధానం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. మరో రెండు నెలల్లో ఈ ప్రకియ పూర్తి కానుంది. ఇప్పటివరకు పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్లు, మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్ల యజమానులు వాహనదారుల నుంచి అందినకాడికి దండుకుంటూ వారికి కావాల్సిన రీతిలో 'పొల్యూషన్ అండర్ కంట్రోల్' (పియుసి) సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో రవాణ శాఖ ప్రత్యక్ష పర్యవేక్షణలో విపిటిసి కార్యకలాపాలను కొనసాగించేందుకు చర్యలు చేపట్టింది. ఇందు కోసం టెస్టింగ్ సెంటర్లన్నింటినీ రవాణ శాఖ ఆన్‌లైన్ (సర్వర్) సేవకు అనుసంధానం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని 'తెలంగాణ రాష్ట్ర టెక్నాలజికల్ సర్వీసెస్' (టిఎస్‌టిఎస్)ను రవాణ శాఖ కోరింది. ఈ ప్రక్రియను దాదాపు పూర్తి చేసిన టిఎస్‌టిఎస్ త్వరలోనే టెండర్లను పిలవనున్నారని, సుమారు రెండు నెలల్లో ఈ విధానం అమలులోకి రానుందని అధికారులు చెప్పారు. ఈ విధానం ప్రకారం పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికేట్ కోసం ఏ వాహనానమైనా పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్‌కు వస్తే తొలుత దాని వివరాలు, కాలుష్య శాతాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. వాహన కాలుష్య శాతం నిబంధనల మేరకు సిఓ 3.5 శాతం లోపు, హెచ్‌సి 6000 పిపిఎం లోపు ఉంటేనే ఆన్‌లైన్‌లో పియుసి సర్టిఫికేట్ జారీ చేసేందుకు అనుమతి లభిస్తుంది.

ఎక్కడున్నాయో.. ఏమి చేస్తున్నాయో..

రవాణ శాఖ అనుమతి పొందిన రాష్ట్రంలోని సుమారు 500 విపిటిసి సెంటర్లు ఎక్కడ ఉన్నాయో, ఏమి చేస్తున్నాయో, ముఖ్యంగా మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ వ్యాన్లు ఎక్కడ తిరుగుతున్నాయో, ఎవరికి సర్టిఫికెట్లు ఇస్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని రవాణ శాఖ అధికారులే వాపోతున్నారు. వాహనాల కాలుష్య పరీక్షల విషయంలో టెస్టింగ్ సెంటర్లు నిబంధనలు పాటించడం లేదని, తూతూ మంత్రంగా పరీక్షలు చేసి పియుసి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని, పలు మొబైల్ టెస్టింగ్ వ్యాన్‌లైతే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ద్విచక్ర వాహనాల కాలుష్య పరీక్షకు రూ.30లు, మూడు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.50లు తీసుకోవాల్సి ఉండగా కొంత మంది రెట్టింపు డబ్బులు తీసుకుని వాహనదారులకు ''కావాల్సిన కాలుష్య నియంత్రణ సర్టిఫికేట్లు'' ఇచ్చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అధికంగా కాలుష్యం వెదజల్లుతున్న పాత వాహనాలను పట్టుకున్నప్పుడు వాటికి కాలుష్యం స్థాయి నియంత్రణలోనే ఉన్నట్లు పియుసి సర్టిఫికేట్లు ఉంటున్నాయని, విపిటిసి సెంటర్లు ఇష్టానుసారంగా సర్టిఫికేట్లు జారీ చేస్తున్నాయని పోలీసు శాఖ పలు మార్లు రవాణ శాఖ దృష్టికి తీసుకువస్తూ ఈ సెంటర్లను ప్రక్షాళన చేయాలని కోరింది.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

''విపిటిసి సెంటర్ల అవకతవకలకు ఆస్కారం లేకుండా ఆన్‌లైన్ ద్వారా పియుసి సర్టిఫికేట్లను జారీ చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. ఈ సెంటర్ల నిర్వాహకులెవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. విపిటిసిల సంఖ్యను కూడా పెంచి ప్రజలకు అందుబాటులోకి తీసకువస్తాం'' అని రవాణ శాఖ జెటిసి సి.రమేష్ 'మన తెలంగాణ' ప్రతినిధికి చెప్పారు.



9మంది పిల్లలున్నా.. అనాథలా రోడ్డున...

యాదాద్రి భువనగిరి: మనుషుల్లో పడిపోతున్న విలువలకు అద్దం పట్టే మరో ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. 9మంది పిల్లలున్నా ఓ ముసలి తండ్రి అనాథలా రోడ్డున పడ్డారు. ఈ అమానుష ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్ పురం గ్రామంలో చోటుచేసుకుంది. మల్లయ్య అనే వృద్ధుడిని కన్న కొడుకులు రోడ్డు పక్కన వదిలేసి వెళ్లిపోయారు. ఇది గమనించిన చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మల్లయ్య చెప్పిన సమాచారంతో అతడి కుమారుల్ని సంప్రదించారు. తొమ్మిది మంది సంతానం ఉన్న మల్లయ్య అనాథలా రోడ్డున పడడం అక్కడివారిని కలిచివేస్తోంది. పెద్ద కుమారుడు ఏకంగా ఇంటికి తాళం వేసి పారిపోయాడు. ప్రస్తుతం మల్లయ్య పెద్ద కొడుకు ఇంటి ముందే చెట్టుకింద ఉంటున్నాడు. దీంతో మల్లయ్యను ఇరుగుపొరుగువారు చేరదీసి అన్నం పెడుతున్నారు. కాగా, కొడుల మధ్య తండ్రిని వంతుల వారీగా చూడాలనే ఒప్పందం ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ వృద్ధాప్యంలో తండ్రిని ఇలా రోడ్డున వదిలేయడం మాత్రం అమానవీయం.

రాజకీయ విమర్శలు చేయవద్దు : హరిబాబు



విజయవాడ : ఎపికి కేంద్రం చేస్తున్న సాయంపై ప్రజలకు వివరించాలని ఎపి బిజెపి శాఖ అధ్యక్షుడు , ఎంపి కంభంపాటి హరిబాబు పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఎపి అభివృద్ధి పట్ల ప్రధాని నరేంద్రమోడీ సర్కారు చిత్తశుద్ధితో పని చేస్తుందని ఆయన చెప్పారు. ఆదివారం విజయవాడలో బిజెపి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హరిబాబు మాట్లాడారు. నాలుగేళ్లలో ఏ రాష్ట్రానికి చేయనంత సాయం ఎపికి కేంద్రం చేసిందని ఆయన తెలిపారు. ఎపికి కేంద్రం చేసిన సాయంపై ప్రజలకు వివరించాలే తప్ప మిత్రపక్షమైన టిడిపిపై రాజకీయ విమర్శలు చేయవద్దని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ఎపికి కేంద్రం చేసిన సాయాన్ని ఆయన వివరించారు. ఈవిషయంపై 9పేజీలతో కూడిన పుస్తకాన్ని పార్టీ నేతలకు అందించారు. ఎపికి కేంద్రం చేసిన సాయంపై 45 నిమిషాల నిడివి గల డాక్యుమెంటరీని సమావేశంలో ప్రదర్శించారు. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల తరపున ఎపికి అందించిన సాయం, దానికి సంబంధించి గణాంకాలను ఈ డాక్యుమెంటరీ ద్వారా చూపించారు. విభజన చట్టంలో చెప్పినవన్నీ చేస్తున్నప్పటికీ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై విమర్శలు చేయడం బాధ కలిగిస్తుందని హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీలను కేంద్రం ఖచ్చితంగా నెరవేరుస్తుందని ఆయన చెప్పారు.

కాంగ్రెస్‌తో చర్చలు బాధాకరం

ఆంధ్రప్రదేశ్: ఎపి రాష్ట్రం గురించి ఆలోచించే పవన కల్యాణ్ కాంగ్రెస్‌తో చర్చలు జరపడం బాధాకరమని అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు. రాష్ట్రాన్ని తగులబెట్టిన వాళ్లతో చర్చలేంటని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి కలిసి వెళ్లాలనే భావిస్తున్నామన్నారు. సోము వీర్రాజు చంద్రబాబును విమర్శించే స్థాయి లేదన్నారు. తమ ఎంపిల రాజీనామాలు పెద్ద విషయం కాదని, కానీ ఎపి అభివృద్ధి తమకు ముఖ్యమని చెప్పారు. రాజీనామాల కోసం వైఎస్‌ఆర్‌సిపి అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి ముహూర్తాలెందుకు పెట్టుకున్నారని అడిగారు.

బయల్పడిన 120 ఏళ్ల భూగర్భ గని

భద్రాద్రి కొత్తగూడెం : ఇల్లందు మండలంలో ఆదివారం మిషన్ భగీరథ పనులు చేస్తుండగా బ్రిటీష్ కాలం నాటి భూగర్భ గని బయల్పడింది. సింగరేణి అధికారులు ఈ గనిని పరిశీలించారు. ఈ గని 120 ఏళ్ల నాటిదని వారు తెలిపారు. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో ఇంకా ఏమైనా పూరతన గనులు ఉన్నాయా అన్న దానిపై పరిశీలన చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

పసుపు రైతుకు దక్కని ధర !


- దళారులు.. వ్యాపారుల మాయాజాలం
- సాంగ్లీలో ఒక ధర... నిజామాబాద్ మార్కెట్‌లో మరొక ధర !
- సిండికేట్‌గా మారి ధరలు నిర్ణయిస్తున్న వైనం



మన తెలంగాణ/హైదరాబాద్ : ఆరుగాలం కష్టించి తొమ్మిది నెలలపాటు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పసుపు రైతులకు కన్నీరే మిగులుతోంది. దళారులు, వ్యాపారుల మాయ జాలంతో వాణిజ్య పంటల్లో 'పచ్చ బంగారం'గా చెప్పుకునే పసుపు ధరలు మన రాష్ట్రంలో ఒకరకంగా, మహారాష్ట్రలోని సాంగ్లీలో మరొకలా ఉండటం రైతులను కుంగదీస్తోంది. రాష్ట్రంలో పసుపునకు ప్రసిద్ధిగాంచిన నిజామాబాద్ మార్కెట్‌లో క్వింటాల్ పసుపు రూ. 5500 నుంచి రూ. 6500 మధ్య ఉండగా, సాంగ్లీ మార్కెట్‌లో క్వింటాకు రూ. 10 వేలు వస్తోంది. దేశంలో అన్ని మార్కెట్ల కంటే నిజామాబాద్ మార్కెట్‌కే అధి కంగా పసుపు పంట ఉత్పత్తి వస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. దీనినే సాకుగా చూపుతూ వ్యాపారులు 'ఈనామ్' ఆన్‌లైన్ సేవలను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. సిండికేట్‌గా మారి ఆన్‌లైన్‌లో తక్కువ ధరలు నమోదు చేసి, రైతులను నట్టేటా ముంచుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇదే వ్యాపారులు అన్నదాతల నుంచి కొనుగోలు చేసిన పంటను శీతల గిడ్డంగుల్లో దాచుకుని, ఆరు నెలల తరువాత ప్రస్తుతమున్న ధరకు రెట్టింపుగా అమ్ముకుంటున్నారు. ఏటా ఇదే తంతు జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడంలేదు. పసుపు ఉత్పత్తిలో ప్రపంచలోనే మన దేశం మొదటి స్థానంలో ఉంది. ఎగుమతులు కూడా ఎక్కువే. ఈసారి దేశవ్యాప్తంగా 3.86 లక్షల ఎకరాల్లో పసుపు సాగు చేయగా, 4.85 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నట్లు అంచనా. మన రాష్ట్రంలో 1.08 లక్షల ఎకరాల్లో పసుపు పంట సాగైంది. గత ఏడాదితో చూస్తే 2500 ఎకరాల్లో సాగు తగ్గింది. ఎకరాకు సుమారు లక్ష రూపాయల ఖర్చుతో పసుపు పంట సాగు చేయడం ఒక ఎత్తు అయితే... పండించిన పసుపు కొమ్ములను తీసి ఉడికించడం, ఆరబెట్టడం మరొక ఎత్తు.. ఇందుకోసం రైతు చాలా మొత్తంలోనే ఖర్చు చేయాల్సి వస్తోంది. కనీసం క్వింటాలుకు రూ. 10 వేలు ఉంటే పెట్టుబడికి గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. రైతు బంధు పథకం కింద పంటను దాచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించినప్పటికీ, అవగాహన లేకపోవడం, శీతల గిడ్డంగుల దగ్గర ఇబ్బందులు ఏర్పడుతుండటంతో రైతులు పంటను దాచుకోవడం లేదు. మరో వైపు జిల్లాలో పసుపుబోర్డు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రత్యేక పసుపు బోర్డు ఏర్పాటైతే మద్దతు ధర లభిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

భూంఫట్

(మొదటిపేజీ తరువాయి)



కొందరు గిరిజన నేతలు తీవ్రస్థాయిలో ప్రభుత్వంతో లాబీయింగ్ జరుపుతున్నట్లు తెలిసింది. మిర్యాలగూడలో ఉన్న కొందరు ఇక్కడ పట్టాదారులతో సంబంధం లేకుండానే వందలాది ఎకరాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని తెలిసింది. పట్టా తమ పేర ఉందని వస్తున్న వారిని తరిమికొడుతున్నారని కూడా తెలియవచ్చింది. దూన్నపోతుల గండిలోని 150 సర్వే నెంబర్‌లో గల భూమిని రెవెన్యూ అధికారులు పూర్తిగా రీ సర్వే జరిపించి పట్టాదారులైన తమకు న్యాయం జరిగేలా చూడాలని ఆ నిరుపేద రైతులు హెచ్చరిస్తున్నారు. ఆందోళనకు సైతం సిద్ధపడుతున్నారు.

నీరవ్ బినామీలు

(మొదటిపేజీ తరువాయి)

పద్ధతులలో నిధులను సేకరించుకుంటున్నట్లు వెల్లడైందని ఇడి వర్గాలు తెలిపాయి. నిందితులు కొందరు ఈ డొల్ల కంపెనీల ద్వారా డబ్బుల సేకరణకు పాల్పడుతున్నట్లు, బినామీ ఆస్తులు సమకూర్చుకుంటున్నట్లు తెలిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుని ఓ వైపు ఇడి, మరో వైపు ఆదాయపు పన్ను శాఖ వారు కేసులో దర్యాప్తును తీవ్రతరం చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే ఇడి విలువైన వజ్రాలు, బంగారు నగలు ఇతర విలువైన రాళ్లను స్వాధీనపర్చుకుంది. గీతాంజలి కంపెనీలకు చెందిన వీటి విలువ దాదాపు రూ 5,674 కోట్ల వరకూ ఉంటుందని వెల్లడైంది.
శనివారం నాడు ఐటి విభాగం వారు గీతాంజలి జెమ్స్‌కు చెందిన తొమ్మిది బ్యాంక్ ఖాతాలను జప్తు చేసింది. వాటి ప్రమోటర్ ఛోక్సీ ఇతరుల ఆస్తులను కూడా స్వాధీనం చేసుకున్నారు. పన్నుల ఎగవేత సంబంధించి కేసులు నమోదు చేశారు. నీరవ్ మోడీకి చెందిన 105 బ్యాంక్ ఖాతాలు ,ఆయన కుటుంబ సభ్యుల ఖాతాలతో పాటు స్తంభింపచేశారు. కుటుంబ సభ్యుల పేరిట ఉన్న సంస్థలపై కూడా దర్యాప్తు చేపట్టారు.

కొలువుల పిలుపులు

(మొదటిపేజీ తరువాయి)

హామీ కంటే వెయ్యి ఉద్యోగాలు ఎక్కువే ఇస్తాం' అని స్వయంగా సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు. పోలీసు శాఖలో 14 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఇటీవలే ప్రకటన వెలువడడం గమనార్హం. ఎన్నికల వాతావరణం నెలకొన్న పరిస్థితుల్లో రానున్న బడ్జెట్‌లోనే కొలువుల భర్తీపై స్పష్టమైన ప్రకటన చేసి దానికి అవసరమైన కేటాయింపులను కూడా పేర్కొనే అవకాశం ఉంది. 'ఇకపైన విద్యార్థులు, నిరుద్యోగులు పుస్తకాల్లో మునిగిపోతారు. క్షణం తీరిక లేకుండా ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు హాజరుకావడానికి చదువుపై దృష్టి పెడతారు. వ్యవసాయానికి పెట్టుబడి పథకం కింద ఆర్థిక సాయం చేస్తున్నాం. రైతులంతా సంతోషపడతారు. ఇక మిగిలింది నిరుద్యోగులే. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లను ఒక దాని తర్వాత ఒకటిగా విడుదల చేస్తూ ఉంటే విద్యార్థులు, నిరుద్యోగులు చదువులో లీనమవుతారు' అని అధికార పార్టీకి చెందిన సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. విపక్షాలకున్న రెండు ప్రధాన ప్రచారాస్త్రాలకు అవకాశమే లేకుండా అధికారపార్టీ వ్యూహం రచిస్తోంది. మరోవైపు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల కల్పన కోసం కూడా తీవ్ర కసరత్తు జరుగుతోంది. నూతన పారిశ్రామిక విధానం ద్వారా వస్తున్న పరిశ్రమల్లో నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు పొందడానికి వీలుగా స్కిల్ డెవలప్‌మెంట్‌పైనా ప్రభుత్వం ఆలోచనలు చేస్తూ ఉంది.



ఉద్యమకారులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం : గద్దర్

మన తెలంగాణ/నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు పనిచేసిన ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వకుండా తెలంగాణ సాధన సమయంలో పదవులు అనుభవించిన తెలంగాణ ద్రోహులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయడం అన్యాయమని గద్దర్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏఐఎఫ్‌డివై తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలను నిర్వహించారు. ఈసభకు ముఖ్య అతిధిగా గద్దర్ హాజరయ్యారు. మొదట పట్టణంలోని ద్వారక పేట రోడ్‌లోని ఓంకార్ భవన్ నుండి అతిథి గృహం వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అతిథి గృహం ఎదుట జరిగిన ప్రథమ మహాసభలో పాల్గొన్న గద్దర్ మాట్లాడుతూ 67శాతం ఉన్న యువకులు ముందుండి నిశ్శబ్ద విప్లవాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు. 40 సంవత్సరాల కాంగ్రెస్ పాలన, 17 సంవత్సరాల టిడిపి పాలన, 4 సంవత్సరాల టిఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ రాష్ట్రంలో దొరల పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించకుండా తెలంగాణ ద్రోహులను చేరదీసుకుని పదవులు కట్టబెట్టి ఉద్యమకారులకు అన్యాయం చేస్తున్నారన్నారు. సమావేశంలో ఏఐఎఫ్‌డివై రాష్ట్ర అధ్యక్షుడు వనం సుధాకర్, ఎంసిపిఐయు జాతీయ ప్రధాన కార్యదర్శి ఎండి. గౌస్, మద్దికాయల అశోక్, రాష్ట్ర ప్రదాన కార్యదర్శి గాదగోని రవి, తాండ్ర కుమార్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/ హుజూరాబాద్ టౌన్ : కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గుజ్జులపల్లి గ్రామానికి చెందిన జం పాల రమేష్ (40) కౌలు రైతు పురుగుల మందుల తాగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. రమేష్ ఐదు ఎకరాల భూమిని కౌలు తీసుకొని పత్తిపంటను సాగు చేయగా చేతికందే సమయంలో పంట దెబ్బతినడంతో మనస్థాపానికి గురయ్యాడు. పంటపై రూ.5లక్షల అప్పులు చేశాడు. దీంతో పురుగుల తాగి ఆ త్మహత్యకు పాల్పడగా చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజిఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండగా ఒక కుమార్తె వివాహం చేశాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌లు ఢీ కొని ఇద్దరి దుర్మరణం

మన తెలంగాణ/పెద్దవూర : ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన పెద్దవూర మండలం శిరసన గండ్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం మునుగోడు మండలం న్యూ కోరటికల్ గ్రామానికి చెందిన పాల్వంచ వెంకన్న (28), బోల శ్రవణ్ (14) యమహాపై పెద్దగూడెంలో పంక్షన్ కు హాజరై తిరిగి వెళ్తుండగా శిరసనగండ్ల గ్రామ సమీపంలో కొత్తలూరు (నులకవారి గూడెం) గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ హాలియ వైపు వెళ్తూ పల్సర్ ద్విచక్రవాహనం ఎదురుగా వస్తున్న యమహ ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో బోల శ్రవణ్ అక్కడిక్కడే మృతి చెందగా ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్న పాల్వంచ వెంకన్న మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి సాగర్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. పాల్వంచ వెంకన్నకు 3 సంవత్సరాల అబ్బాయి ఉన్నట్లు తెలిపారు. పల్సర్ ద్విచక్ర వాహనంపై ఉన్న వారికి తీవ్ర గాయాలయ్యాయి.

కరెంట్‌షాక్‌తో రైతు మృత్యువాత



మన తెలంగాణ/ఎల్లారెడ్డిపేట : వ్యవసాయాన్ని నమ్ముకున్న ఓ రైతు పొలం పనుల్లో భాగంగా పొలానికి నీరు పెట్టబోయి స్టార్టర్ డబ్బానుండి విద్యుత్ ప్రసరణ జరిగి అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన రాజన్న సిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మద్దుల రాంరెడ్డి (47) మూడెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్నాడు. పొలానికి నీరు పారించేందుకు స్థానిక గిద్దె చెరువు సమీపంలోని పొలానికి వెళ్లాడు.విద్యుత్ షాక్‌కు గురయ్యాడు.అతన్ని మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారు. మృతుని కుటుంబాన్ని సెస్ సంస్థ ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి నర్సయ్య, సద్ది లక్ష్మారెడ్డి, బండారి బాల్‌రెడ్డి, సద్దాం, రాజునాయక్ పాల్గొన్నారు.

మీడియాపై హిజ్రాల దాడి..

డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలో పట్టు బడ్డ హిజ్రా

మన తెలంగాణ/హైదరాబాద్ : మందు కొట్టి కారు నడుపుతూ ఓ హిజ్రా పోలీసులకు పట్టుబడింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దగ్గర కృష్ణా అనే హిజ్రా తాగిన మత్తులో కారు డ్రైవ్ చేస్తుండగా..ఆ కారును నిలిపి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా మద్యం 99 పాయింట్ల మోతాదుగా రికార్డైంది. దీంతో హిజ్రా కృష్ణపై కేసు నమోదు చేశారు. ఆమె కారు సీజ్ చేశారు. దాంతో పక్క సీట్లో ఉన్న మరో హిజ్రా రెచ్చిపోయి పోలీసుల్ని, మీడియా ప్రతినిధుల్ని దూషించింది. మీడియా ప్రతినిధులపై పిడిగుద్దుల వర్షం కురిపించింది. మీడియా ప్రతినిధులను హిజ్రాలు పరుగెత్తించి..పరుగెత్తించి కొట్టారు. వారి కెమెరాలను లాక్కుని నేలకేసి కొట్టారు. అంతటితో ఆగక హిజ్రాలు తిట్ల దండకం అందుకున్నారు. దాంతో బెంబేలెత్తిపోయిన పోలీసులు డ్రంకన్‌డ్రైవ్‌ను ముగించి అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు మీరు కూడా వెళ్లిపోండి వాళ్ల తిట్లు తగుల్తాయ్ అంటూ మీడియా ప్రతినిధుల్ని పంపించివేయడం గమనార్హం.

తల్లీ కూతురుతో మలం తినిపించారు

చేతబడి నెపంతో జార్ఖండ్‌లో దారుణం

రాంచీ: చేతబడి నెపంతో జార్ఖండ్‌లో దారుణం జరిగింది. చేతబడికి పాల్పడుతున్నారనే అనుమానంతో తల్లీకూతుళ్లతో అమానుషంగా మానవ మలాన్ని తినిపించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ దారుణ ఘటన గత బుధవారం జార్ఖండ్ రాజధాని రాంచీలోని సోనాహుత్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల దులామి గ్రామంలో చోటుచేసుకుంది. ఇదే ఊళ్లో నివసించే ఓ మహిళ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. అనంతరం మరికొన్ని రోజులకు అదే కుటుంబానికి చెందిన మరో ఇద్దరు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దాంతో స్థానికంగా ఉండే భూత వైద్యుడిని కలిశారు. సదరు వైద్యుడు అదే గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు చేతబడి చేయడంతో ఇలా జరుగుతుందని సెలవిచ్చాడు. దీంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు వెంటనే భూత వైద్యుడు చెప్పిన తల్లీకూతురు కరో, బసంతి దేవిలను ఇంట్లో నుంచి బయటకు లాక్కొచ్చి చావబాదారు. ఊరి చివరకు తీసుకెళ్లి వారికి గుండు కొట్టించారు. అనంతరం బలవంతంగా వారితో మలం తినిపించారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని భూత వైద్యుడితో పాటు దాడికి పాల్పడిన 11 మందిని అదుపులోకి తీసుకున్నారు.

పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నా

కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్



మన తెలంగాణ / కరీంనగర్ టౌన్ : శాసన సభ్యులు గంగుల కమలాకర్ వైఖరికి నిరసనగా కరీంనగర్ 12వ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ టిఆర్‌ఎస్ పార్టీకి, కార్పొరేటర్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రాజీనామా లేఖను సిఎం కెసిఆర్‌కు పంపిస్తున్నట్టు వెల్లడించారు. ఆదివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాలుగేళ్లుగా పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ ఎంఎల్ఎ గంగుల ప్రోత్సాహంతో టిఆర్‌ఎస్‌లో చేరారని అన్నారు. దళిత మహిళ కార్పొరేటర్ అని నా పట్ల వివక్ష చూపుతున్నారన్నారు. ఎంఎల్ఎ అభివృద్ధికి నిధులు కేటాయించకుండా వివక్ష చూపడం, ఆటంకం కలిగించడం బాధాకరమన్నారు. కక్ష కట్టి సంబంధం లేని భూమి విషయంలో తన భర్తను ఇరుక్కించి కేసు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల పట్ల ఎంఎల్ఎ వైఖరికి నిరసనగా టిఆర్‌ఎస్ పార్టీకి, పదవికి రాజీనామా చేస్తున్నానని అన్నారు.

రైతుబజార్ ఎట్లున్నది? సౌలతులు బాగున్నయా?

- సిద్దిపేట మోడల్ రైతు బజార్‌ను సందర్శించిన మంత్రి హరీశ్‌రావు
- రైతులు, వినియోగదారులతో మాట్లాడిన మంత్రి



మన తెలంగాణ/సిద్దిపేట ప్రతినిధి : సిఎం సహాయనిధి పేదలు, అభాగ్యులకు ఎంతో అండనిస్తోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని తన నివాస గృహంలో సిద్దిపేట నియోజకవర్గానికి మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఆర్థికంగా అంతంత మాత్రంగా వున్న పేదలకు సిఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా వుంటుందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని 16 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.4.57లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రభుత్వం సహకారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని హరీశ్‌రావు వారికి సూచించారు.

రైతు బజార్ సందర్శన : సిద్దిపేటలోని మోడల్ రైతు బజార్‌ను ఆదివారం మంత్రి హరీశ్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతోను, వినియోగదారులతో స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.రైతుబజార్ ఎట్లున్నది?, సౌలతులు బాగున్నాయా? కూరగాయలు బాగా అమ్ముడవుతున్నాయా? అని స్వయంగా ప్రశ్నలు అడుగుతూ సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా వినియోగదారులు ఇంత మంచి రైతు బజార్‌ను నిర్మించినందుకు సంతోషం వ్యక్తం చేయగా, మేము మాత్రం మస్తు ఖుషిగున్నం అంటూ రైతులు చెప్పడం విశేషం. ఈ సందర్భంగా రైతు బజార్ మొత్తం కలియతిరిగి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

మోడల్ టెస్ట్ పేపర్ల విడుదల : టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో టిఆర్‌టి మోడల్ టెస్ట్ పేపర్లను, పిఇటి పరీక్షలకు హాజరయ్యే వారికి కోసం పిఇటి ఉపాధ్యాయ సంఘం రూపొందించిన మోడల్ టెస్ట్ పేపర్లను మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుంచి ఉపాధ్యాయ ఉద్యోగ పరీక్షల తరుణంలో మోడల్ టెస్ట్ పేపర్లు తయారు చేయడం అభ్యర్థులకు ఉపయోగకరంగా వుంటుందన్నారు. అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న మంత్రి : సిద్దిపేట పట్టణంలో పలు షాపుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. కూరగాయల మార్కెట్‌లో మాంగళ్ల షాపింగ్ మాల్‌ను, బస్టాండు వద్ద ఫర్నీచర్ షాపులను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ అక్తర్ పటేల్, కౌన్సిలర్లు చిప్ప ప్రభాకర్, నాయకులు మోహన్‌లాల్ పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ధనలక్ష్మీ



మన తెలంగాణ/వనపర్తి ప్రతినిధి: వనపర్తి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన పెద్దమారు ధనలక్ష్మీ ని నియమించినట్లు వనపర్తి ఎంఎల్ఎ, ఏఐసిసి కార్యదర్శి డా.జి. చిన్నారెడ్డి ప్రకటించారు. ఆదివారం ఎంఎల్ఎ తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్యకర్తల అభిప్రాయం మేరకు జిల్లా మహిళా కాంగ్రెస్, పెబ్బేరు మండల కాంగ్రెస్ బాధ్యులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా పెబ్బేరు మాజీ ఎంపిపి లలితమ్మ, రాజనగరం గ్రామానికి చెందిన ముమ్మళ్ల పద్మమ్మ, మదనాపురం మండలం తిర్మలా యపల్లికి చెందిన రాధమ్మ. పాన్‌గల్‌కు చెందిన బండి సరోజను ఎంపిక చేశారు. ప్రధానకార్యదర్శులుగా పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామానికి చెందిన గిరిజా సురేష్‌గౌడ్, రేవల్లి మండలం బండరావిపాకుల సర్పంచ్ రమాదేవి సుబ్బారెడ్డి, కొత్తకోట మండలం పాలెం ఎంపిటిసి జయమ్మ, ఆత్మకూర్‌కు చెందిన మాజి ఎంపిటిసి శారదా శివకుమార్, చిన్నంబావి మండలం కొప్పునూర్‌కు చెందిన శ్రీలతలను ఎన్ను కున్నారు. కార్యదర్శులుగా సావిత్రమ్మ, జయంతి, శంకరమ్మ గౌడ్, రాధమ్మలను ఎన్నుకున్నారు.

ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన మోడీ సర్కార్





- ఖమ్మం జిల్లా సిపిఐ 21వ మహాసభల్లో చాడ వెంకటరెడ్డి ధ్వజం

మన తెలంగాణ/ ఖమ్మం ప్రతినిధి : కేంద్రంలో మోడీ సర్కార్ అన్ని రంగాల్లోనూ వైఫల్యం చెందిందని, దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిందని, నోట్ల రద్దుతో సామాన్య జన జీవితం అస్తవ్యస్థమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా సిపిఐ 21వ మహాసభలను ఎదులాపురం పంచాయతీ దండి భాస్కర్ నగర్ (మద్ది ఎల్లారెడ్డి ఫంక్షన్‌హాల్)లో ఆదివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకుల విలీనం ద్వారా కార్పొరేట్ శక్తులకు, బడా సంపన్న వర్గాలకే మేలు జరిగిందని, నీరవ్ మోడీ లాంటి వ్యక్తులు వందల, వేల కోట్లు దోచుకుని పరారయ్యేందుకు అవకాశం లభించిందని పేర్కొన్నారు. సామాన్యులు, కార్మికులు, రైతులు బ్యాంకులకు వెళ్తే అప్పు ఇచ్చేందుకు నానా కొర్రీలు పెట్టే అధికారులు వారికి మాత్రం వేల కోట్ల రూపాయలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని, సంపద కొంత మంది చేతుల్లోనే పోగుపడుతోందన్నారు. మైనార్టీలపైన, లౌకికవాదులపైన దాడులు పెరిగాయని, కర్నాటకలో గౌరీ లంకేశ్ హత్య, జెఎన్‌యు విద్యార్థి కన్నయ్యపై దాడి లాంటి ఫాసిస్టు పోకడలు పెరిగాయని అన్నారు. మతోన్మాద శక్తులను అడ్డుకునేందుకు లౌకిక ప్రజాతంత్ర శక్తులతో కూడిన వామపక్ష ప్రత్యామ్నాయమే సరైందిగా సిపిఐ భావిస్తోందని ఆ దిశగా వామపక్ష శక్తుల ఏకీకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సైద్ధాంతిక అవగాహన, బహుముఖ పోరాటాలతో పార్టీ విస్తరణే లక్ష్యంగాతగిన కార్యాచరణ రూపొందించాలని, అందుకు అనుగుణంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని చాడ వెంకటరెడ్డి తెలిపారు. గ్రామగ్రామాన సిపిఐ జెండా ఎగురేలా పని చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాట కార్యాచరణ రూపొందించాలన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబ పాలన సాగుతోందని, ఆయన నిర్ణయాలు నియంతను తలపిస్తున్నాయన్నారు.సభలో సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు, ఆహ్వాన సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ మౌలానా, దండి సురేష్, పోటు కళావతి, సిద్దనేని కర్ణకుమార్, రావి శివరామకృష్ణ పోటు ప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ కోసం ఐక్య పోరాటం



- రాజకీయ జెఎసి చైర్మన్ కోదండరాం

మన తెలంగాణ / బోడుప్పల్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయితే మనందరి బతుకుల్లో వెలుగులు వస్తాయని అశపడ్డాం కాని ప్రజలు కన్న కలలు కలలుగానే మిగిలి పోయాయని తెలంగాణ రాజకీయ జెఎసి చైర్మన్ కోదండరాం అన్నారు. ఆదివారం నాడు ఫిర్జాదిగూడ లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో తెలంగాణ సామాజిక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో అయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందని అందరికీ సమాన న్యాయం కావాలి అనే లక్ష్యంతో కుల, మతాలకు, వర్గాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా పోరాటాం చేసి తెలంగాణ రాష్ట్రం సాధించుకుంటే నేడు ప్రజా పోరాటాల ద్వారా వచ్చిన తెలంగాణలో కేవలం కొంతమంది మాత్రమే ఆ ఫలాలు అనుభవిస్తున్నారని అన్నారు. అయితే మన చేతిలో అత్యున్నతమై ఆయుధం పెట్టుకుని వారి దగ్గరకు వీళ్ల దగ్గరకు ఎందుకు వెల్లాలని మన ఓటు మనకే వేసుకునే దిశగా మన వర్గాలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. పాలకులు ప్రజా ఉద్యమాలను ఉంతగా నిర్భాందాలకు గురి చేస్తారో అప్పుడే ప్రజా ఉద్యమాలు ప్రజా ఉద్యమాలు రాటుదేతాయని తెలంగాణ ఇంటీ పార్టీ అధ్యక్షులు డా.చెరుకు సుధాకర్ అన్నారు. ప్రజా ఉద్యమాలను అణిచి వేయాడం ద్వారా ప్రజలు ఇంకా రాటుదేలి ఉద్యమాలు చేస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 90 శాతం పైగా ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వర్గాలు తమకు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలంగాణ సామాజిక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సంతోష్ అన్నారు. ఈ కార్యక్రమంలో టి మాస్ రాష్ట్ర నాయకులు చంద్రన్న, ప్రభంజన్ యాదవ్, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల ముత్తయ్య, దొడ్డి కొమురయ్య మనువడు భిక్షపతి, జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు బలరాం, తీన్మార్ మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

తాండూరు-బెంగళూరు బస్సు సర్వీసు

రవాణా శాఖ మంత్రి మహేందర్ రెడ్డి

మన తెలంగాణ/తాండూరు : రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థం పటిష్టం చేస్తామని రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం తాండూరు బస్ స్టేషన్‌లో తాండూరు-బెంగుళూర్ అంతర్ రాష్ట్ర ఎసి బస్సు సర్వీస్‌ను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని చెప్పారు. నష్టాల్లో ఆర్టీసికి ముఖ్యమంత్రి కేసిఆర్ బడ్జెట్‌లో రూ,వెయ్యి కోట్లు కేటాయించారని అన్నారు. దీంతో రూ.350 కోట్లతో 1407 కొత్త బస్సులను కొనుగోళు చేసినట్లు తెలిపారు. టిఎస్ఆర్‌టిసి ద్వారా మొత్తం 850 అంతర్ రాష్ట్ర సర్వీసులు నడుపుతున్నామని చెప్పారు. తాండూరు నుండి బెంగుళూర్‌కు కూడా అంతర్ రాష్ట్ర సర్వీసును ప్రారంభించామని చెప్పారు. అదే విధంగా రాష్ట్రంలో రోడ్లు బాగా లేని కారణంగా కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించ లేదని, కొత్తగా 350 బస్సులను నడుపుతున్నామని, దేశంలోని కర్ణాటక, ఏపి, మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, గోవా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు రవాణా సౌకర్యం మరింత పెంచుతామన్నారు. రాష్ట్రంలో రూ.66 కోట్లతో బస్టాండ్‌లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఆర్టీసిలో ఆదాయం పెంచేందుకు బస్టాండ్‌లలో సినిమా హాళ్లు, పెట్రోల్ బంక్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాండూరు బస్టాండ్‌ను రూ.కోటి 50లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. వ్యాపార పరంగా అభివృద్ధి చెందిన తాండూరు ప్రాంతానికి తాండూరు-బెంగుళూరు బస్సు అవసరమని గుర్తించి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సునీతాసంపత్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ కోట్రిక విజయలక్ష్మి, పట్టణ టిఆర్‌ఎస్ అధ్యక్షుడు అబ్దుల్ రావూఫ్, కౌన్సిలర్ అబ్దుల్ కవి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బిసి(ఎ)లో చేర్చేవరకు పోరాటం

- తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్



మన తెలంగాణ/చేగుంట : తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ కులస్తులను బిసి (డి) నుండి బిసి (ఎ)లో చేర్చేవరకు మా పోరాటం అగదని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. ఆదివారం మెదక్ జిల్లా, చేగుంట మండలం వడియారం గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మెదక్ జిల్లా ముదిరాజ్ సింహ గర్జనకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 1964లో చేపలు పట్టుకుని జీవనం గడుపుతున్న మమ్ములను 98 జీఓ ప్రకారం బిసి (ఎ) చేర్చారు. 1972 సంవత్సరం కుటిల రాజకీయాల మూలంగా మమ్ములను వేరుచేసి బిసి (డి)లో కలపడం జరిగింది. మనం అప్పటి నుండి పోరాటం ఫలితంగా మరలా 2003 తెలంగాణ ప్రాంతంలో 15 జీఓ ప్రకారం బిసి (ఎ) కలుపుతున్నట్లు జీఓ వచ్చినా అమలుకు నోచుకోవడంలేదని తెలిపారు. మనపై తప్పుడు సమాచారం ఇస్తుండడంతో మనం ఇలా వెనక బడిపోతున్నాం, స్వయంగా 7 మంది న్యాయవాదులను పెట్టి సుప్రీం కోర్టులో దాఖలు చేయడం జరిగిందని, నివేదిక ఇవ్వడానికి ప్రభుత్వానికి 9 నెలలు పట్టిందని తెలిపారు. మన సమస్యలు తీర్చుకునేందుకు మే నెలలో ఎర్రటి ఎండలో పెద్ద ఎత్తున బహిరంగసభ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే 1లక్ష మందితో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. 40 శాతంకు పైగా జనాభా కలిగిన మనకు బడ్జెట్‌లో డబ్బులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. 1 శాతం ఉన్న వారికి వెయ్యి కోట్లు కేటాయిస్తే మాకు ఎంత కేటాయించాలని ప్రశ్నించారు. మన బలగం, మన బలం అన్ని పార్టీలకు తెలిసే విధంగా ముందుకుపోదామన్నారు.

చేగుంట నుండి వడియారం వరకు భారీ ర్యాలీ

చేగుంటలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ మహాసభకు చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో ముదిరాజులు ముఖ్యంగా మహిళలు బతకమ్మలు, బోనాలతో హాజరై చేగుంట ఆర్ అండ్ బి గెస్టు హౌజ్ నుండి వడియారం వరకు 3 కిలో మీటర్ల మేర డప్పు చప్పుళ్ల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు పాడిన పాటలు, నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు కరణం వెంకటేశం, మెదక్ జిల్లా అధ్యక్షులు పుట్టిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చివంగి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, రాష్ట్ర ముదిరాజ్ యూత్ అధ్యక్షులు వీరేశం, నాయకులు అంబటి చెన్నయ్య, మత్స్యకారుల సంఘ సహకార అధ్యక్షులు గున్నాల నర్సింలు, డిసిసిబి డైరక్టర్ వెంకటేశం పాల్గొన్నారు.

తెలుగును పరిపాలన, బోధన భాషగా ప్రకటించాలి



మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్ : తెలుగును పరిపాలన భాష, భోధన భాషగా ప్రకటించాలని చాటింపు సంస్థ కన్వీనర్ వినాయక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చాటింపు ఆధ్వర్యంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తులుగు మహాసభల వల్ల తెలుగుకు ఎలాంటి న్యాయం జరగలేదని అన్నారు. ముగింపు ఉత్సవంలో ముఖ్యమంత్రి కెసిఆర్ రెండు నెలల్లో మహాసభల తీర్మానాలను పండితులతో చర్చించి వెల్లడిస్తామని చెప్పి రెండు నెలలు పూర్తవుతున్నా ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. ప్రొ. జయధీర్ తిరుమల్‌రావు మాట్లాడుతూ ప్రపంచ మహాసభలు జరిగాక దేశ విదేశాల నుండి తెలుగు భాషపై ఎలాంటి తీర్మానాలు చేశారని అడుగుతున్నారని అన్నారు. విశిష్ట తెలుగు భాష కేంద్రాన్ని రాష్ట్రానికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 21న యునెస్కో పిలుపుమేరకు ప్రభుత్వం నిర్వహించనున్న అంతర్జాతీయ మాతృదినోత్సవం బదులు 'తెలంగాణ తెలుగు మాతృభాష దినోత్సవం' ను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. 1నుండి 12వ తరగతి వరకు తెలుగులో బోధన ఉంటుందని చెప్పారు. కాని ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. త్వరగా తీర్మానాలు చేసి అమలు చేయాలని, అమలు చేయలేని తీర్మానాలు చేయవద్దని కోరారు. తెలుగు భాషను రక్షించుకోవడానికి దానికి ఒక నిఘంటువు అవసరమని, 2లక్షల పదాలతో నిఘంటువును ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పొట్లపల్లి వరప్రసాద్‌రావు, ఫౌండేషన్ అధ్యక్షులు వరప్రసాద్‌రావు, సాహితీవేత్త భూపతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

‘యు టర్న్’ తీసుకున్న సమంత




ప్రతి స్టార్ హీరోయిన్ కూడా ఒక వయసు దాటాక, పరిణతి సాధించాక నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేయాలని ఆశిస్తుంది. సినిమాను ఒంటి చేత్తో నడిపించాలని... లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేయాలని కోరుకుంటుంది. అదేవిధంగా సమంత ఇప్పుడు నటనకు ప్రాధాన్యమున్న ఓ చిత్రాన్ని ప్రారంభించింది. స్టార్ హీరోయిన్‌గా రాణించిన ఈ భామ కన్నడలో సూపర్‌హిట్‌గా నిలిచిన ‘యు టర్న్’ సినిమాను రీమేక్ చేయాలని ఎప్పటినుంచో అనుకుంటోంది. కానీ ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి చాలా సమయం పట్టేసింది. చివరికి తాజాగా రాజమండ్రిలో ఈ సినిమా షూటింగ్ మొదలుకావడం విశేషం. ఈ సినిమా షూటింగ్ కోసం రాజమండ్రికి వచ్చిన సమంతను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తన కోసం వచ్చిన అభిమానుల వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన సమంత ‘యు టర్న్’ చిత్రీకరణ మొదలైన సంగతిని వెల్లడించింది. కన్నడలో ‘యు టర్న్’ను తెరకెక్కించిన పవన్ కుమారే తెలుగులోనూ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రాన్ని తమిళంలో కూడా తీస్తున్నారు. ఇక ఈ చిత్రంతో సమంత నిర్మాతగా మారింది. నాగచైతన్యతో కలిసి ఆమె ఈ సినిమా నిర్మిస్తోంది. ఇది ఒక విభిన్నమైన థ్రిల్లర్ కథతో తెరకెక్కుతోంది.

షూటింగ్ అంతా న్యూయార్క్‌లోనే!



మహేశ్‌బాబు

ప్రస్తుతం ‘భరత్ అను నేను’ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు మహేష్‌బాబు. ఈ సినిమాలో అతను తొలిసారి ముఖ్యమంత్రిగా నటించబోతున్నాడు. మహేష్‌కు ‘శ్రీమంతుడు’ వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందించిన కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఇక రాజకీయ నాయకుడిగా ఈ సూపర్‌స్టార్‌ను చూసేందుకు అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా తర్వాత మహేష్ ఇదివరకే ఓ సినిమాకు కమిట్ అయ్యాడు. ఈ చిత్రం తర్వాత అతను వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాడు. అందులో హాట్ బ్యూటీ పూజా హెగ్డే నటించనుంది. ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన వార్త తెలిసింది. ఈ సినిమా షూటింగ్ మొత్తం న్యూయార్క్‌లో జరుగబోతోందట. అంటే ‘భరత్ అను నేను’ సినిమాతో పోలిస్తే ఇది పూర్తిగా డిఫరెంట్ ఎంటర్‌టైనర్ అన్నమాట. అన్నీ అనుకున్నట్టు కుదిరితే మే చివరి వారం నుంచే షూటింగ్ మొదలవుతుంది. ఈలోపే ‘భరత్ అను నేను’ సినిమా విడుదలై పోతుంది. ఇక మహేష్ కొత్త చిత్రానికి దేవిశ్రీ సంగీతాన్ని అందించాడు. ఇప్పటికే అతను అన్ని పాటలకు ట్యూన్లు కట్టేశాడట. ఎలాగైనా సినిమాను వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలన్నది చిత్ర యూనిట్ ప్లాన్. అశ్వనీదత్, దిల్ రాజ్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇక ఈ చిత్రం షూటింగ్ కోసం సినిమా టీమ్ అంతా ఒక్కసారిగా అమెరికా వెళ్లి షూటింగ్ అంతా పూర్తిచేసుకున్న తర్వాత ఇండియాలోకి అడుగుపెడుతుందట.



బెల్లంకొండ శ్రీనివాస్

అమెరికాకు సాక్ష్యం

శ్రీవాస్ దర్శకత్వంలో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా తెరకెక్కుతున్న ‘సాక్ష్యం’ చిత్రం తాజా షెడ్యూల్ ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ఈ డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను మే 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు దర్శకనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన బెల్లకొండ శ్రీనివాస్, పూజాహెగ్డేల ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన లభించింది. ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలోని భారీ సెట్స్‌లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా అభిషేక్ నామా తెరకెక్కిస్తున్నారు. శ్రీవాస్ డైరెక్షన్ స్కిల్స్, ఆయన స్క్రిప్ట్ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి. ఆయన ప్రతి సన్నివేశాన్ని అద్భుతంగా మలుస్తున్నారు. డూప్ లేకుండా శ్రీనివాస్ చేసిన యాక్షన్ సీన్స్, పూజా హెగ్డేతో రొమాంటిక్ సీన్స్ ఆసక్తికరంగా ఉంటాయి. తాజా షెడ్యూల్ పూర్తికాగానే చివరి షెడ్యూల్ కోసం అమెరికా వెళ్లనున్నారు. అమెరికాలో చిత్రీకరించబోయే కీలక సన్నివేశాలతో చిత్రీకరణ పూర్తవుతుంది. జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, వెన్నెల కిషోర్, జయప్రకాష్, పవిత్ర లోకేష్, బ్రహ్మాజీ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ఆర్థర్ ఎ.విల్సన్, సంగీతంః హర్షవర్ధన్, మాటలుః సాయిమాధవ్ బుర్రా, కూర్పుః కోటగిరి వెంకటేశ్వరరావు, యాక్షన్ః పీటర్ హెయిన్స్.

మనుషులు, దెయ్యాల మధ్య సరదా ఆటలు!

శ్రీకాంత్, నాజియా హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ‘రా..రా’. శ్రీమిత్ర చౌదరి సమర్పణలో విజి చెర్రీస్ విజన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 23న విడుదలకానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, నాని, తరుణ్, రఘుబాబు, అలీ, హేమ, సదానంద్, అశోక్, ప్రతాప్, ఖయ్యుమ్ భూపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ‘‘నాకు అష్టాచమ్మా చిత్రం నుండి శ్రీకాంత్‌తో మంచి పరిచయం ఉంది. నటుడిగా ఆయనేంటో అందరికీ తెలుసు. ఇప్పుడు ఈ హార్రర్ మూవీతో ఆయన ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ సినిమా ఆయనకు మరో పెద్ద హిట్ చిత్రంగా నిలవాలని కోరుకుంటున్నాను’’అని తెలిపారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ‘‘ఇది హాస్యంతో కూడిన హార్రర్ థ్రిల్లర్. మనుషులు, దెయ్యాలకు మధ్య సాగే సరదా ఆటలు ప్రేక్షకుడిని వినోదాల తీరంలో విహరింపచేస్తాయి. తొలిసారిగా ఈ హార్రర్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నాను. ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణకు నోచుకుంటుందని ఆశిస్తున్నాను. ఈనెల 23న విడుదలకానున్న ఈ చిత్రం నాకు మంచి సక్సెస్‌ను ఇస్తుందన్న నమ్మకముంది’’అని అన్నారు. శ్రీమిత్ర చౌదరి మాట్లాడుతూ ‘‘శ్రీకాంత్‌తో 24 సంవత్సరాల అనుబంధం ఉంది. నాకు అతను సోదరుడిలాంటి వ్యక్తి. ఈ సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది’’అని తెలిపారు. విజయ్ మాట్లాడుతూ ‘‘శ్రీకాంత్‌తో ఉన్న అనుబంధమే ఈ సినిమా చేయడానికి మమ్మ ల్ని ముందుకు నడిపించింది. సినిమా చాలా బాగా వచ్చింది’’అని చెప్పారు. సంగీత దర్శకుడు షకీల్ మాట్లాడుతూ ‘‘నాపై నమ్మకంతో నాకు ఈ సినిమాకు సంగీతాన్ని అందించే అవకాశమిచ్చిన దర్శకనిర్మాతలు, శ్రీకాంత్‌కు థాంక్స్. ఈ చిత్రంలోని పాటలు అందరికీ నచ్చుతాయి’’అని పేర్కొన్నారు.



‘రా..రా’ ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో శ్రీకాంత్, నాని, తరుణ్, శ్రీమిత్ర చౌదరి, విజయ్, షకీల్



గోపీచంద్ మలినేని, జె.భగవాన్, జె.పుల్లారావు, సాయిధరమ్‌తేజ్

మే నుంచి రెగ్యులర్ షూటింగ్

యంగ్ హీరో సాయిధరమ్‌తేజ్, కమర్షియల్ డైరెక్టర్ గోపీచంద్ మలినేనిల కాంబినేషన్‌లో శ్రీ బాలాజీ సినీ మీడియా పతాకంపై ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. జె.భగవాన్, జె.పుల్లారావు సంయుక్తంగా నిర్మించనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మే నుంచి మొదలవ్వనుంది. ఈ సందర్భంగా నిర్మాతలు జె.భగవాన్, జె.పుల్లారావు మాట్లాడుతూ ‘‘మాస్ హీరో ఇమేజ్‌ను సొంతం చేసుకున్న సాయిధరమ్‌తేజ్, కమర్షియల్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌లాంటి గోపీచంద్ మలినేనిల కాంబినేషన్‌లో ఈ సినిమా తీయనుండడం చాలా ఆనందంగా ఉంది. ఒక కొత్త జోనర్‌లో ఈ చిత్రం రానుంది. ఇదివరకు సాయిధరమ్‌తేజ్ చేయని కొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపొందనుంది. ఓ క్రేజీ మ్యూజిక్ డైరెక్టర్ ఈ చిత్రానికి బాణీలు సమకూర్చనున్నాడు. ఈ చిత్రంలోని మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది’’అని అన్నారు.



నాగశౌర్య



అమీజాక్సన్

23న వస్తున్న ‘స్కెచ్’

విక్రమ్, తమన్నా హీరోహీరోయిన్లుగా నటించిన తమిళ సినిమా ‘స్కెచ్’. అదే పేరుతో ఈ చిత్రాన్ని తెలుగులో ఈనెల 23న విడుదల చేస్తున్నారు. విజయ్‌చందర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా తమిళ్‌లో విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఇటీవల విక్రమ్ ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా హైదరాబాద్ వచ్చినప్పుడు సినిమా విజయం పట్ల ధీమా వ్యక్తంచేశారు. సురేష్‌బాబు సమర్పణలో రానున్న ఈ సినిమాను మొదట జనవరి 26న విడుదల చేయాలని అనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల ఈ సినిమా విడుదల వాయిదా పడింది. తమన్ సంగీతాన్ని అందించిన ఈ మూవీ పాటలు మ్యూజికల్ హిట్‌గా నిలిచాయి. మాస్ ఎలిమెంట్స్‌తో పాటు సోషల్ కంటెంట్ ఈ సినిమాలో ఉండనుందని తెలిసింది. తెలుగులో ఈ చిత్రం ఏమేరకు విజయం సాధిస్తుందో చూడాలి.




తమన్నా, విక్రమ్

బడా వ్యాపారవేత్తతో ప్రేమాయణం

టాప్ డైరెక్టర్ శంకర్‌సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో ‘2.0’ చిత్రం చేసిన హాట్ బ్యూటీ అమీజాక్సన్‌కు ఇప్పుడు మంచి క్రేజ్ ఉంది. ఈ భామ ప్రస్తుతం పలు సినిమాల షూటింగ్‌లతో బిజీగా ఉంది. అయితే షూటింగ్‌ల మధ్య దొరికిన కొద్దిపాటి విరామాన్ని ఆమె చక్కగా వినియోగించుకుంటోంది. ఆ సమయంలో ఈ అమ్మడు తన బాయ్‌ఫ్రెండ్‌తో షికార్లు చేస్తోందట. తన బాయ్‌ఫ్రెండ్‌తో దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన అమీ అందరు హీరోయిన్లలాగానే అతను తన ఫ్రెండ్ అని బుకాయించేస్తోంది. అయితే ఈ భామ జార్జ్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారితో పీకల్లోతు ప్రేమలో ఉందని సమాచారం. అంతేకాదు వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ జంట వారం రోజుల పాటు కెనడాలోని ఓ స్టార్ హోటల్‌లో హాయిగా ఎంజాయ్ చేసిందట. ఆ ప్రాంతంలోని మంచులో స్కీయింగ్ చేస్తున్న ఫొటోలను అమీ పోస్ట్ చేసింది. మొదట్లో అమీ, జార్జ్ ఫ్రెండ్స్ అనుకున్నారు. కానీ ఈ జంట పదే పదే చెట్టాపట్టాలేసుకొని షికార్లు కొడుతుండడంతో వారి మధ్య ప్రేమాయణం జోరుగా కొనసాగుతోందని తెలిసిపోయింది. వాలెంటైన్స్ డే సెలబ్రేషన్స్‌ను కూడా అమీ జార్జ్‌తోనే జరుపుకోవడంతో ఆ అనుమానాలు బలపడ్డాయి. ఇక బడా వ్యాపారవేత్త అయిన జార్జ్‌కు యూరప్‌లో చాలా హోటల్స్ కూడా ఉన్నాయట. మరి ఈ ప్రేమ జంట పెళ్లి ఎప్పుడు అన్నది తెలియాలంటే అమీ నోరు విప్పాల్సిందే.

తనకెంత స్పెషలో చెప్పింది

తన ప్రేమ గురించి వెల్లడించకపోయినప్పటికీ శృతిహాసన్ ప్రేమాయణం ఇప్పుడు అందరికీ తెలిసిపోయింది. బ్రిటన్‌కు చెందిన థియేటర్ ఆర్టిస్ట్ మైఖేల్ కోర్సల్‌తో ఆమె కొంతకాలంగా చెట్టాపట్టాలేసుకొని తిరుగుతోంది. గత నెలలో శృతిహాసన్ పుట్టిన రోజు సందర్భంగా అమెరికాలో ఆమె వెంటే మైఖేల్ ఉన్నాడు. అంతకుముందు అతను ఇండియాకు వచ్చి శృతితో కలిసి మీడియా కెమెరాలకు పలుమార్లు చిక్కాడు. ఒక కార్యక్రమంలో అతను తమిళ స్టయిల్లో పంచెకట్టులోనూ దర్శనమివ్వడం... పక్కన కమల్ కూడా హ్యాపీగా కనిపించడంతో శృతిమైఖేల్ పెళ్లి ఇక లాంఛనమే అన్న అభిప్రాయం వ్యక్తమైంది. తాజాగా మైఖేల్ తనకు ఎంత స్పెషలో చాటి చెప్పేలా ట్విట్టర్‌లో ఒక మెసేజ్ పెట్టింది శృతి. అతని పుట్టినరోజు సందర్భంగా శృతి పెట్టిన మెసేజ్ చూస్తే అతనిపై ఆమె ప్రేమ ఎంతటిదో అర్థమవుతుంది. ‘‘మై బెస్ట్‌ఫ్రెండ్... నాతో పాటు ప్రపంచాన్ని చుట్టివచ్చేందుకు ఇష్టపడే సహ ప్రయాణికుడు... ప్రతి విషయంలోనూ నాతోపాటు ఉంటూ ఉండే వ్యక్తికి హ్యాపీ బర్త్‌డే’’ అంటూ శృతిహాసన్ ట్వీట్ చేసింది. ఈ సంతోష సమయంలో నీ చెంత లేనందుకు క్షమించమంటూ కోర్సల్‌ను ఉద్దేశించి ఆమె వ్యాఖ్యానించింది. ఈ మెసేజ్ చూస్తే శృతిమైఖేల్ బంధం ఎలాంటిదో తెలిసిపోయింది.



బాయ్‌ఫ్రెండ్ మైఖేల్ కోర్సల్‌తో శృతిహాసన్

కొత్త దర్శకుడితో ‘నర్తనశాల’

ఐరా క్రియేషన్స్ సంస్థలో ఇటీవల వచ్చిన ‘ఛలో’ సినిమా ఘన విజయం సాధించింది. నాగశౌర్య హీరోగా నటించిన ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహించారు. సాగర్ మహతి సంగీతాన్ని అందించిన పాటలు మ్యూజికల్ హిట్‌గా నిలిచాయి. ప్రస్తుతం ఇదే బ్యానర్‌లో నాగశౌర్య రెండో సినిమా మొదలుపెట్టబోతున్నాడు. శ్రీనివాస్ అనే నూతన దర్శకుడు ఈ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాడు. శ్రీనివాస్ గతంలో కృష్ణవంశీ దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశాడు. ‘నర్తనశాల’ అనే టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుందని సమాచారం. త్వరలో ప్రారంభంకానున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇక నాగశౌర్య తాజాగా నటించిన ‘అమ్మమ్మగారిల్లు’ సినిమా త్వరలో విడుదలకానుంది. ఈ చిత్రం తర్వాత శ్రీనివాస్ సినిమా మొదలుకానుంది.

పిఎన్‌బి రేటింగ్ విషయంలో వేచిచూస్తున్న క్రిసిల్

న్యూఢిల్లీ: రేటింగ్ సంస్థ క్రిసిల్ కుంభకోణంలో చిక్కుకున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ రేటింగ్ విషయంలో వేచిచూస్తోంది. పిఎన్‌బి ముంబై బ్రాంచ్‌లో రూ.11,400 కోట్లు భారీ స్కామ్ వెలుగులోకి రావడం.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐలు రంగంలోకి దిగడం వంటి అంశాలను క్రిసిల్ పరిశీలిస్తోంది. నీరవ్ మోడీ మోసపూరితంగా లావాదేవీలు నిర్వహించడం, ఆయన కంపెనీలు అక్రమంగా ఎల్‌ఓయు(లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్)ను పొందడం అందరినీ నివ్వరపోయేలా చేసింది. ఎల్‌ఓయు ద్వారా వేలాది కోట్లు విదేశీ బ్యాంకుల నుంచి లాగేయడంతో భారీ కుంభకోణం బయటపడింది. వీటిలో మోస పోయిన బ్యాంకులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యుకో బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటివి ఉన్నాయి. రేటింగ్ సంస్థ క్రిసిల్ రేటింగ్ ట్రిపుల్ ఎ నుంచి తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తున్నామని, వీటిని చూసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని రేటింగ్ సంస్థ చెప్పినట్లు తెలుస్తోంది. కుంభకోణం విషయమై పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి కొన్ని వివరాలను కోరనున్నామని, వీటిని పరిశీలించాక నిర్ణయం తీసుకుంటామని క్రిసిల్ వెల్లడించినట్టు తెలుస్తోంది.

పేమెంట్స్ యుద్ధం మొదలైంది

పేటీఎం, వాట్సాప్, గూగుల్ తేజ్‌ల మధ్య హోరాహోరి



ముంబై: యుపిఐ(యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్)ను ప్రారంభించడంతో 2016 ఆగస్టు నుంచి దేశంలో డిజిటల్ పేమెంట్ల విప్లవం మొదలైంది. ఆ తర్వాత అదే వంత్సరంలో ప్రధాని నరేంద్ర మోడీ పెద్ద నోట్లను రద్దు చేస్తూ అనూహ్య నిర్ణయం తీసుకోవడం.. డిజిటల్ పేమెంట్లకు మరింత ఊతం ఇచ్చినట్టయింది. యుపిఐ ప్లాట్‌ఫామ్‌తో పేటిఎం వంటి ఇ–వ్యాలెట్‌ంపెనీలు వెల్లువెత్తాయి. అదే సమయంలో గూగుల్ కూడా తేజ్ పేరిట అప్లికేషన్‌ను ప్రారంభించింది. గత వారం ఫేస్‌బుక్‌కు చెందిన వాట్సాప్ కూడా యుపిఐ ఆధారిత పేమెంట్స్ సేవలను ప్రారంభించనున్నట్టు తెలిపింది. దేశంలోనే అతిపెద్ద పేమెంట్స్ వేదిక పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ ఈ పరిణామం సరైంది కాదంటూ.. వాట్సాప్ ఆగమనంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేటీఎం స్నేహపూర్వకంగా ఉంటోందని, వ్యాపారుల్లో ఇది ఎంతో ప్రజాదరణ పొందిందని అన్నారు. గూగుల్ తేజ్ కూడా అనేక ఆఫర్లతో వినియోగదారులకు ఆకర్షించేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇది ఆడియో కమాండ్‌లను వినియోగిస్తోంది. ఇతర బ్యాంక్ ఖాతాలకు డైరెక్ట్‌గా నగదును పంపుతోంది. అయితే ఈ స్టాండలోన్ పేమెంట్స్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక వాట్సాప్ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరి స్మార్ట్‌ఫోన్‌లో వాట్సాప్ తప్పని సరిగా ఉంటోంది. 20 కోట్ల మంది వినియోగదారులకు అత్యంత సులభతరమైన విధానాలను చేపట్టింది.

వాట్సాప్‌లో...

సెట్టింగ్ మెనులోకి వెళ్లి బ్యాంక్ ఖాతాను యాడ్ చేయాలి. ఆ తర్వాత ఫోన్ నంబర్‌ను ఎస్ఎంఎస్ ద్వారా వెరిఫై చేయాల్సి ఉంటుంది. దీనికి బ్యాంక్ ఖాతాకు ఉన్న ఫోన్ నంబర్‌ను మాత్రమే వినియోగించాలి. మీ బ్యాంక్ ఖాతాకు అనుసంధానమై ఉన్న డెబిట్ కార్డును వెరిఫై చేసుకోవాలి. ఆ తర్వాత యుపిఐ పిన్ నంబర్‌ను సృష్టించేందుకు ఒటిపిని ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎవరికి డబ్బులు పంపాలో వారికి నగదును పంపవచ్చు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29490	31540.11	0.31%
ముంబై	30060	32149.73	0%
ఢిల్లీ	29600	31657.75	0.17%
కోల్‌కతా	30270.99	32375.39	0.17%
కేరళ	28350	30320.86	0.35%
బెంగళూరు	28850	30855.61	0.52%
హైదరాబాద్	29490	31540.11	0.72%
గల్ఫ్	1430.78	1530.25	–0.03%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	40600.00	40900.00	–0.73
ముంబై	40600.00	40900.00	–0.73
ఢిల్లీ	40600.00	40900.00	–0.73
కోల్‌కతా	40600.00	40900.00	–0.73
హైదరాబాద్	40600.00	40900.00	–0.73



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	391	విశాఖపట్నం	400
వరంగల్	393	చిత్తూరు	408
విజయవాడ	395	చెన్నై	415
గోదావరి	395	బెంగళూరు	405


ఈ వారంలోనూ ఊగిసలాటే..

- డెరివేటివ్స్ గడువు, బ్యాంకుల మోసం కేసులు, అంతర్జాతీయ అంశాలు కీలకం
- ఆచితూచి వ్యవహరించాలంటున్న నిపుణులు




ముంబై: ఈ వారంలోనూ ఊగిసలాటే కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ పరిణామాలు, బ్యాంకు మోసాల కేసులు, డెరివేటివ్స్ గడువు ఈవారంలోనే ఉండడం వంటివి మార్కెట్‌ను శాసిస్తాయని నిపుణులు అంటున్నారు. గురువారం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ గడువు తేదీ ఉండడంతో ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించాలని వారు సలహా ఇస్తున్నారు. గత వారంలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఎక్కడివక్కడే ఉండిపోయాయి. మార్కెట్లు తీవ్ర ఒడిదుకులకు లోనవుతున్నాయి. వారమంతా ఒక రోజు లాభాలు.. మరో రోజు నష్టాల మధ్య ఆటుపోట్లకు లోనయ్యాయి. గత శుక్రవారం మార్కెట్ ముగింపునాటికి సెన్సెక్స్ 5 పాయింట్ల నామమాత్ర లాభంతో 34,011 వద్ద నిలిచింది. బిఎస్ఇలో మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.2 శాతం నీరసించగా, స్మాల్ క్యాప్ మాత్రం 0.75 శాతం బలహీనపడింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)లో రూ. 11,500 కోట్ల కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకు కౌంటర్లలో గత వారం అమ్మకాలు వెల్లువెత్తాయి. సెన్సెక్స్ దిగ్గజాలలో ఎస్‌బిఐ 8.3 శాతం, యస్‌బ్యాంక్ 4.2 శాతం చొప్పున పతనమయ్యాయి. నీరవ్ మోడీ మోసం ఉదంతం ప్రభావంతో గీతాంజలి జెమ్స్ 36 శాతం, పిఎన్‌బి 20 శాతం చొప్పున కుప్పకూలాయి. అయితే ఇన్ఫోసిస్ 1.2 శాతం లాభపడింది. డిసెంబర్‌లో ఐఐపి(పారిశ్రామికోత్పత్తి సూచీ) వరుసగా రెండో నెల 7.1 శాతంతో పటిష్ట వృద్ధిని నమోదు చేసింది. జనవరిలో వినిమయ ధరల సూచీ (సిపిఐ) ద్రవ్యోల్బణం 5.07 శాతానికి దిగివచ్చింది. డిసెంబర్లో ఇది 5.21 శాతంగా నమోదైంది. ఇక జనవరిలో టోకు ధరల ద్రవ్యోల్బణం(డబ్ల్యూపిఐ) డిసెంబర్‌లో నమోదైన 3.58 శాతం పెరుగుదలతో పోలిస్తే 2.84 శాతానికి తగ్గుముఖం పట్టింది. జనవరిలో ఎగుమతులు 9 శాతం పుంజుకుని 24.38 బిలియన్ డాలర్లను చేరాయి. దిగుమతులు మరింత అధికంగా 26 శాతం వృద్ధితో 40.7 బిలియన్ డాలర్లను తాకాయి.

26న హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ ఐపిఒ



జోధ్‌పూర్‌కు చెందిన హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ లిమిటెడ్ ఈనెల 26న ఐపిఒ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్)తో రానుంది. ఈ ఆఫర్ లక్ష్యం రూ.462 కోట్లు సమీకరణ అని కంపెనీ వెల్లడించింది. మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ కంపెనీ హెచ్‌జి ఇన్‌ఫ్రా షేరుకి రూ. 263 – 270 ధర శ్రేణిలో చేపట్టిన ఇష్యూ చేపట్టనుంది. ఈ ఆఫర్ 28న(బుధవారం) ముగియనుంది. నిధులను పరికరాల కొనుగోలు, రుణాల చెల్లింపు, సాధారణ పాలనా వ్యవహారాలకు వినియోగించనున్నట్లు కంపెనీ పేర్కొంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 55 షేర్లకు దరఖాస్తు చేయాలని, ఇంతకంటే అధికంగా అంటే రూ.2 లక్షల విలువకు మించకుండా ఒకేసారి దరఖాస్తు చేసుకోవచ్చని సంస్థ తెలిపింది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 300 కోట్ల విలువైన షేర్లను తాజాగా జారీ చేయనుండటంతోపాటు 60 లక్షల షేర్లను విక్రయం చేపట్టనుంది. వీటిలో ప్రమోటర్లు రూ. 162 కోట్ల విలువైన షేర్లను సేల్ చేయనున్నారు. 2003 సంవత్సరంలో ప్రారంభమైన హెచ్‌జి ఇన్‌ఫ్రా మౌలిక సదుపాయాల రంగంలో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్(ఇపిసి) విభాగంలో ప్రధానంగా సర్వీసులు అందిస్తోంది. రహదారులు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్ల నిర్మాణంలో కార్యకలాపాలు విస్తరించింది. వీటితోపాటు నీటిపారుదల ప్రాజెక్టుల లోకి ప్రవేశించింది. రాజస్తాన్‌లో టర్న్‌కీ పద్ధతిలో నీటి పారుదల ప్రాజెక్టులను చేపడుతోంది. 2017 మార్చితో ముగిసిన ఏడాదిలో 36 శాతం వృద్ధితో రూ. 974 కోట్ల ఆదాయం సాధించింది. నికర లాభం 63 శాతం వృద్ధితో రూ.49 కోట్లను చేరింది.

టాప్ 10లో ఐదింటికి నష్టాలు



గత వారం టాప్ 10 బ్లూచిప్ కంపెనీల్లో ఐదు సంస్థలు భారీగా రూ.38,724 కోట్ల మార్కెట్ విలువ(ఎం–క్యాప్)ను కోల్పోయాయి. వీటిలో ఎస్‌బిఐ అత్యధికంగా నష్టపోయాయి. ఇంకా టిసిఎస్, ఐటిసి, మారుతీ సుజుకీ, ఒఎన్‌జిసి వంటి కంపెనీలు కూడా ఎం–క్యాప్‌ను కోల్పోయాయి. మిగతా రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌యుఎల్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలు మాత్రమే గతవారం లాభాలను అందుకున్నాయి. ఎస్‌బిఐ మార్కెట్ విలువ రూ.21, 278 కోట్లు తగ్గి రూ.2,34,576 కోట్లకు చేరింది. ఐటి దిగ్గజం టిసిఎస్ విలువ రూ.6,719 కోట్లు పడిపోయి రూ.5,62, 265 కోట్లు అయింది. ఎఫ్ఎంసిజి దిగ్గజం ఐటిసి ఎం–క్యాప్ రూ.6,036 కోట్లు క్షీణించి రూ.3,24, 765 కోట్లకు చేరగా, మారుతీ సుజుకీ ఇండియా మార్కెట్ విలువ రూ.3,216 కోట్లు తగ్గుముఖం పట్టడంతో మొత్తం విలువ రూ.2,67,039 కోట్లకు చేరింది. ఆయిల్ దిగ్గ జం ఒఎన్‌జిసి ఎం–క్యాప్ చూస్తే రూ.1,476 కోట్లు పడిపోయి రూ.2,39,468 కోట్లకు తగ్గింది. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్ విలువ రూ.15,045 కోట్లు పెరిగి రూ.5,83,817 కోట్లకు చేరింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ విషయానికొస్తే మార్కెట్ విలువ రూ.7,037 కోట్లు పెరిగి రూ.4,87,243 కోట్లు కాగా.. హెచ్‌డిఎఫ్‌సి ఎం–క్యాప్ రూ.6,803 కోట్లు జంప్ చేసి రూ.2,90,140 కోట్లు అయింది. ఇక హెచ్‌యుఎల్ విలువ చూస్తే రూ.3,690 కోట్లు లాభపడి రూ.2,92,735 కోట్లు అయింది. ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.2,850 కో ట్లు పెరిగి రూ.2,45,678 కోట్లకు చేరింది. గత వారం సెన్సెక్స్ దాదాపు 286.71 పాయింట్లు (0.84 శాతం) పడిపోగా, నిఫ్టీ 93.20 పాయింట్లు (0.88 శాతం) క్షీణించింది. టాప్ 10 ర్యాంకింగ్ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి, హెచ్‌యుఎల్, హెచ్‌డిఎఫ్‌సి, మారుతీ సుజుకీ ఇండియా, ఇన్ఫోసిస్, ఒఎన్‌జిసి, ఎస్‌బిఐ ఉన్నాయి.



తెరపైకి మరో కుంభకోణం

రూ.800 కోట్లతో రొటొమాక్ పెన్నుల యజమాని అదృశ్యం

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.11,400 వేల కోట్ల భారీ కుంభకోణం నేపథ్యంలో అలాంటి స్కామ్‌లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా రొమాటిక్ పెన్స్ యజమానికి విక్రమ్ కొఠారీ రూ.800 కోట్ల రుణాలను తీసుకొని.. విదేశాలకు పారిపోయినట్టు సమాచారం. ఈయన కూడా ప్రభుత్వరంగ బ్యాంకులకు భారీగా కుచ్చుటోపీ పెట్టాడని తెలుస్తోంది. అలహాబాద్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు వంటి ఐదు బ్యాంకుల్లో రూ.800 కోట్లకుపైగా రుణాలు తీసుకున్నారు. నియమాలను ఉల్లంఘించి బ్యాంకులు కొఠారికి రుణాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే అత్యధికంగా యూనియన్ బ్యాంకు నుంచి రూ.485 కోట్లు, అలహాబాద్ నుంచి రూ.352 కోట్ల రుణం తీసుకున్నారు. దీనిలో అసలు, వడ్డీ రెండూ కూడా తిరిగి చెల్లించలేదని తెలుస్తోంది. కాన్పూరులో ఉన్న కొఠారి కార్యాలయం కూడా గత కొన్ని వారాలుగా మూతపడి ఉంది. ఆయన కూడా కనిపించకపోవడం మరిన్ని ఊహాగానాలకు తావిస్తుండగా.. అలహాబాద్ బ్యాంక్ మేనేజర్ దీనిపై స్పందించారు. కొఠారి ఆస్తులు అమ్మి సొమ్మును రాబడతామని చెప్పుకొచ్చారు. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ పిఎన్‌బిని మోసగించి వేల కోట్లు అప్పుగా తీసుకున్న ఘటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పుడు ఈ రొటొమాక్ వ్యవహారం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి. అయితే బ్యాంకులతో చర్చించి ఈ సమస్యను పరిష్కరిస్తామని రొటోమాక్ గ్రూప్ నుంచి ప్రకటన వెలువడింది.

మోసం ఎలా జరిగింది?

- డిపాజిట్ చేయకుండానే అక్రమంగా ఎల్‌ఓయు
- వీటితోనే పిఎన్‌బిలో రూ.11,400 కోట్ల లావాదేవీలు

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)లో వేల కోట్ల మోసం ఎలా జరిగింది? ఇన్ని కోట్లు లూటీ జరుగుతుంటే బ్యాంకు ఉద్యోగులు గుర్తించలేక పోయారా? అంటే.. ఇది మిలియన్ డాలర్ల ప్రశ్నే అని చెప్పాలి. రూ.11,400 కోట్ల రుణాలు తీసుకొని పిఎన్‌బికి కుచ్చుటోపీ పెట్టిన నీరవ్ మోడీ.. ఆ తర్వాత దేశం వదిలిపారిపోయాడు. అది కూడా తనపై కేసులు దాఖలు చేయకముందే విదేశాలకు చెక్కేయడంతో.. దర్యాప్తు సంస్థలకూ ఎటూ పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఈ మోసం ఒక్క పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కే పరిమితమా, ఇతర బ్యాంకుల్లోనూ జరిగిందా? అనే సందేహాలు మనలో మెదులుతాయి. ఇన్ని వేల కోట్లు బ్యాంకుకు తెలియకుండానే జరిగిందా? అంటే సరైన లెక్కా పత్రాలు లేకుండా అధికారులతో కుమ్మక్కై ప్రముఖ జువెలరీ డిజైనర్ నీరవ్ మోడీ చేసిన మోసమిది. నీరవ్, అతడి అనుచరులు ముంబైలోని పిఎన్‌బి బ్రాంచ్ ద్వారా రూ.11,346 కోట్ల అక్రమ లావాదేవీలు జరిపినట్టు బయట పడింది. విదేశాల్లోని సరఫరాదారులకు చెల్లించేందుకు బ్యాంకుల్లో పైసా కూడా నగదు డిపాజిట్ చేయకుండానే వీరు అక్రమంగా లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్‌ఓయు) పొందారు. దీని ద్వారా ఇన్ని వేల కోట్లు సులువుగా మోసం చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఎల్‌ఓయు అంటే..

నీరవ్ మోడీ ఎల్‌ఓయు ద్వారా వేలాది కోట్లు సులువుగా బ్యాంకు నుంచి కొట్టేశాడు. ఎల్‌ఓయు అంటే లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్.. ఒక బ్యాంక్ ఇతర బ్యాంకుల శాఖలకు ఇచ్చే ధృవీకరణ పత్రాన్నే ఎల్‌ఓయు అంటారు. దీనిపై ఆధారపడే విదేశాలలో కూడా బ్యాంకులు సదరు ఖాతాదారులకి రుణాలు ఇస్తాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో చోటు చేసుకున్న అవకతవకలు కూడా ఈ పత్రం ఆధారంగానే జరిగాయని అంటున్నారు. పిఎన్‌బి, యాక్సిస్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంకులకు ఇచ్చిన ఎల్‌ఓయు ఆధారంగా కొన్ని జ్యూయెలరీ సంస్థలకు రుణాలు మంజూరు అయ్యాయి. అయితే ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది.. ఈ ఎల్‌ఓయుని ఎలా పొందారంటే..అక్రమంగా పొందినట్లు తెలుస్తోంది. నిజానికి ఎల్‌ఓయుల ఆధారంగానే రుణాల మంజూరు జరగదని కొందరు అధికారులు చెప్తున్నారు. అందుకే సాధారణంగా జరిగే స్విఫ్ట్ టెక్నాలజీ ఆధారంగా కాకుండా..నీరవ్ మోడీ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ సాంకేతికతను అడ్డు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. స్విఫ్ట్ పద్ధతి ఓ రకంగా ఫ్యాక్స్ లాంటిది. ఇది సిబిఎస్‌తో అనుసంధానం ఉన్నది కాదు. ఈ లొసుగు ఆధారంగానే నీరవ్ మోడీ ఎల్‌ఓయుని కొంతమంది అధికారుల సాయంతో పొందగలిగాడు. 2018 జనవరి 16న డైమండ్ ఆర్ యుస్, సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్స్ అనే మూడు డైమండ్ కంపెనీలు బయ్యర్స్ క్రెడిట్ కావాలని ముంబైలోని ఒక పిఎన్‌బి బ్రాంచ్ అధికారులను కోరాయి. విదేశీ సరఫరాదారులకు చెల్లించేందుకు అవసరమైన ఈ రుణం కోసం ఎల్‌ఓయు కావాలని ఈ మూడు సంస్థలు విజ్ఞప్తి చేశాయి.. దీంతో పూర్తి నగదు సమర్పించాలని స్థానిక పిఎన్‌బి శాఖ కోరింది. అయితే ఈ సంస్థలు మాత్రం మార్జిన్లేమీ లేకుండానే గతంలోనూ ఇలానే ఎల్‌ఓయులు తీసుకున్నామని చెప్పడంతో అసలు మోసం బయటపడింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ గత రికార్డులు పరిశీలిస్తే నీరవ్ అండ్ కో నిర్వాకం బైటపడింది. మరిప్పుడు ఆ డబ్బంతా తిరిగి రాదనే చెప్తున్నారు. ఎందుకంటే విదేశాలలో ఉన్న బ్యాంక్ ఇచ్చిన రుణం నేరుగా నీరవ్ మోడీకి ఇచ్చినట్లుగా లేకపోవడం.. పిఎన్‌బికి ఇచ్చినట్లు రికార్డు ఉండడంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఇప్పుడు లబోదిబోమంటోంది. అలా దాదాపు రూ.11వేలకోట్ల రూపాయలకి పైగా దారి మళ్లినట్లు తెలుస్తోంది. దీంతో స్పందించిన బ్యాంకు యాజమాన్యం.. డిప్యూటీ మేనేజర్ సహా పదిమందిని సస్పెండ్ చేసింది. ఎల్‌ఓసి చూసి ఏ బ్యాంకులు అప్పులిచ్చాయో అవన్నీ తమ అప్పు తిరిగి ఇచ్చేయాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నాయి.



ఈక్విటీ మార్కెట్‌లో పెరిగిన ఎల్ఐసి వాటాలు



న్యూఢిల్లీ: గత సంవత్సరంలో ఈక్విటీ మార్కెట్‌లో ఎల్ఐసి వాటాలు పెరిగాయి. అన్ని ఎన్ఎస్ఇ లిస్టెడ్ కంపెనీల్లో ఎల్ఐసి(లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) పోర్ట్‌ఫోలియో మార్కెట్ విలువ ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి రూ.6.26 కోట్లకు చేరింది. 2017 డిసెంబర్ నాటికి ఈ మార్క్‌ను క్రాస్ చేసింది. కాగా ప్రస్తుతం స్టాక్‌మార్కెట్లో పరిస్థితులు ప్రతికూలంగా ఉండడంతో షేర్ల ఎంపికలో ఎల్ఐసిజాగ్రత్త వహిస్తోంది. గతంలో మార్కెట్‌లో బుల్లిష్ పరిస్థితులు ఉన్నప్పుడు ఎల్ఐసి వేగంగా కొనుగోళ్లు చేపట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిదినెలల్లో అత్యంత దూకుడుగా ఈక్విటీల్లో కొనుగోళ్లు జరిపింది. తొలి తొమ్మిదినెలల్లో ఎల్ఐసి ఈక్విటీల్లో రూ.70 వేల కోట్ల పెట్టుబడులు పెట్టింది. దీని ద్వారా రూ.20వేల కోట్లు లాభాలను ఆర్జించింది. గత మూడునెలలుగా ఎల్ఐసి ఆచి తూచి వ్యవహరిస్తూ.. దూకుడును తగ్గించింది. భారీ కుంభకోణం ఎదుర్కొంటున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్‌పై ఎల్ఐసి విశ్వాసంతోనే ఉంది. పిఎన్‌బిలో ప్రభుత్వం తర్వాత ఎల్ఐసికే అధిక వాటా ఉండడం గమనార్హం. గత డిసెంబర్లో పిఎన్‌బిఐలో వాటాను ఎల్ఐసి మరింత పెంచుకుంది. ఈ బ్యాంకుకు 100సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉందని, బ్యాంకుకు అనేక బలాలు ఉన్నాయని ఎల్ఐసి చెబుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పిఎన్‌బి వెనుకే ఉంటామని, వాటాలు తగ్గించుకోబోమని వెల్లడించింది. జనవరిలో తాము ఈక్విటీల్లో కొన్నదానికన్నా అమ్మిందే ఎక్కువని ఎల్ఐసి చైర్మన్ వీకే శర్మ అన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తాము చాలా షేర్ల ఎంపికలో జాగ్రత్తగా ఉన్నామని, గతంలో మాదిరిగా దూకుడుగా వ్యవహరించడం లేదని చెప్పారు. నిజానికి తమకు పిఎన్‌బిలో కన్నా ప్రైవేట్ బ్యాంకుల్లోనే ఎక్కువ ఈక్విటీ వాటాలున్నాయని శర్మ చెప్పారు.

మోడీ నోరు విప్పి మాట్లాడండి : రాహుల్

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ రూ.11,400 కోట్ల కుంభకోణంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నోరు విప్పి మాట్లాడాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దేశంలోనే అతిపెద్ద బ్యాంకింగ్ కుంభకోణమైన దీనిపై మోడీ ఎందుకు మాట్లాడడం లేదని ఆయన ప్రశ్నించారు. 'పిల్లలు పరీక్షల్లో ఎలా ఉత్తీర్ణులవ్వాలో రెండు గంటల పాటు మాట్లాడతారు. కాని, రూ.22,000 కోట్ల బ్యాంకింగ్ కుంభకోణంపై మాత్రం మాట్లాడరు. జైట్లీ కనిపించడం లేదు. మీరు అపరాధిలా ప్రవర్తించడం మాని, దీనిపై మాట్లాడాలి' అని ట్విటర్‌లో పేర్కొన్నారు. బ్యాంకులను మోసం చేస్తూ ఇంత పెద్ద కుంభకోణం జరిగినా, ఆ వ్యక్తిని దేశం విడిచి వెళ్లిపోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని విమర్శించారు. ప్రధాని మోడీ పెద్ద నోట్లను రద్దు చేసిన అనంతరం, ప్రజల వద్ద వున్న నగదును సేకరించి, బ్యాంకింగ్ వ్యవస్థలో పెట్టిన నాటి నుంచే ఈ పెద్ద కుంభకోణం ప్రారంభమైందని రాహుల్ గాంధీ శనివారం కూడా ట్విటర్‌లో పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఇదే విషయాన్ని చెప్పారు. మరో వైపు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో నీరవ్ మోడీ కుంభకోణంపై వాస్తవాలు బయటకు రావాల్సిందేనని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ డిమాండ్ చేశారు.



మామ అల్లుళ్ల మతలబు

❑ అక్రమ పద్ధతుల్లో అనుబంధ కంపెనీలు ❑ నీరవ్, చోక్సీపై ఇడి, సిబిఐ వేట ముమ్మరం

న్యూఢిల్లీ : నీరవ్ మోడీ స్కామ్‌కు సంబంధించి సిబిఐ వేట మొదలైంది. గీతాంజలి గ్రూప్‌కు సంబంధించిన 18 అనుబంధ భారతీయ కంపెనీల బ్యాలెన్స్ షీట్లను సిబిఐ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. నీరవ్ మామ అయిన మెహుల్ చోక్సీ అక్రమ పద్ధతుల ద్వారా ఈ కంపెనీలను ఏర్పాటు చేసినట్లు సిబిఐ అనుమానిస్తోంది. దేశ వ్యాప్తంగా సంచలనం కల్గించిన పిఎన్‌బి స్కామ్‌లో నీరవ్, చోక్సీలు కీలక నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారు రూ 11,384 కోట్ల విలువ మేర ఇచ్చిన బ్యాంక్ గ్యారంటీలతో వివిధ బ్యాంకులనుంచి నీరవ్ కంపెనీలు నిధులు సమీకరించుకుని , ఏ విధంగా పలు కంపెనీలను ఏర్పాటు చేసుకున్నాయనే విషయంపై సిబిఐ పరిశీలిస్తోంది. ఇందులో కీలకమైన ఘట్టంగా ఇప్పుడు 18 కంపెనీల బ్యాలెన్స్ షీట్ల తనిఖీల పర్వం భారీస్థాయిలో సాగుతోందని వెల్లడైంది. కేసుకు సంబంధించి ఇప్పటికే అరెస్టు అయిన పిఎన్‌బి మాజీ అధికారి గోకుల్ నాథ్ శెట్టి, మనోజ్ ఖారత్ ఇతరులను సిబిఐ పలు దఫాలుగా ప్రశ్నిస్తోంది. డబ్బుల లావాదేవీలు సాగిన తీరుతెన్నులపై సిబిఐ ఆరాతీస్తోంది.

నిబంధనలు గాలికి..స్విఫ్ట్‌తో ట్విస్ట్‌లు

ముంబైలోని బ్రాడీ రోడ్ బ్రాంచీలో ఈ అక్రమ వ్యవహారం సాగింది. ఈ ఏడాది జనవరిలో వెలుగులోకి వచ్చిన లెటర్ ఆఫ్ అండర్‌స్టాడింగ్ (ఎల్‌ఒయు)లతో కీలక గుట్టు వెలుగులోకి వచ్చింది. సాధారణంగా ఈ



లెటర్స్ జారీలో బ్యాంకులు వంద శాతం నగదు గ్యారంటీ చూపాలని ఆదేశిస్తారు. అయితే నీరవ్ కంపెనీలకు ఈ నిబంధనల జోలికి వెళ్లలేదు. గత ఏడు సంవత్సరాలుగా బ్యాంక్‌లో కీలక స్థానంలో ఉన్న గోఖుల్‌నాథ్ ఎల్‌ఒయులను యధేచ్ఛగా ఈ కంపెనీలకు కట్టబెట్టినట్లు , కీలకమైన బ్యాంకింగ్ వ్యవస్థ నిబంధనలను గాలికివదిలినట్లు వెల్లడైంది. పైగా స్విఫ్ట్ సిస్టం ద్వారా కూడా ఈ కంపెనీలకు ఇతర బ్యాంకుల నుంచి భారీ స్థాయిలో రుణాలు వచ్చేలా పిఎన్‌బిలోని అధికారులు తమ అధికారాలను దుర్వినియోగపర్చినట్లు తేలింది. స్విఫ్ట్ టెక్నాలజీని శెట్టి, ఖారత్‌లు ఎక్కువగా వాడినట్లు, నిధులను అంతర్జాతీయ స్థాయిల్లో బదిలీ చేసేందుకు ఈ విధానం దోహదం చేసినట్లు వెల్లడైంది. స్విఫ్ట్ టెక్నాలజీ ద్వారా లక్షలాది మెస్సెజ్‌లను ఇండియన్ బ్యాంకులు అయిన కెనరా బ్యాంక్, ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్‌లకు అదేపనిగా పంపించినట్లు తేల్చారు. విదేశాలలోని ఆయా బ్యాంకుల శాఖలకు కూడా ఈ మెస్సెజ్‌లు చేరాయి. ఎల్‌ఒయుల గురించి బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్‌లో ఏ విధమైన నమోదులు లేకుండానే మారిషస్, ఫ్రాంకుఫర్టు,హాంక్‌కాంగ్, బహరైన్ వంటి ప్రాంతాల్లోని బ్యాంకుల శాఖలకు ఈ మెస్సెజ్‌లు వెళ్లిన విషయం సిబిఐ దృష్టికి వచ్చినట్లు స్పష్టం అయింది. మొత్తం మీద రూ 11,384 కోట్ల విలువైన లేఖలు జారీ కావడంతో ఈ కంపెనీల పట్ల ఏ విధంగా సానుకూలత వ్యక్తం అయిందనేది స్పష్టం అయింది. గత ఆరేళ్లలో ఎప్పటికప్పుడు కీలక ఎల్‌ఒయులు జారీ కావడం, రెన్యూలు జరగడంతో విదేశాలలోని బ్యాంకులు తమకు పిఎన్‌బి నుంచి నిర్థిష్టమైన గ్యారంటీ ఉందనే దీమాతో ఎలాంటి అనుమానాలు లేకుండా నీరవ్ కంపెనీకి రుణాలు అందించినట్లు వెల్లడైంది. అంతేకాకుండా నికర వడ్డీలు దక్కుతాయని, డబ్బుకు గ్యారంటీ ఉందని భావించాయి. ఈ విధంగా నిక్షేపంగా సాగిన తంతుకు ఈ జనవరితో బ్రేక్ పడింది.

వేలాది డాక్యుమెంట్లు, డిజిటల్ రికార్డులు

వేలాది డాక్యుమెంట్లు, డిజిటల్ రికార్డుల పరిశీలన క్షుణ్ణంగా జరుగుతోందని అధికారులు తెలిపారు. దేశంలో ఈ స్కామ్‌కు సంబంధించి వివిధ ప్రాంతాలలో సిబిఐ, ఇడి వర్గాలు జరిపిన సోదాలలో భారీ స్థాయిలో స్వాధీనం చేసుకున్న రికార్డులను సిబిఐ ఇప్పుడు విశ్లేషిస్తోంది. ఇప్పటికే మెహుల్ చోక్సీపై సిబిఐ ఎఫ్ఐఆర్ దాఖలు అయింది. సంబంధిత కుంభకోణంలో నీకది నాకది లేదా క్విడ్ ప్రో క్వో తంతు ఏదైనా ఉందా? అనే ప్రశ్నపై సిబిఐ స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదు. అన్ని అంశాలను జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉందని వివరణ ఇస్తున్నారు. డైమండ్ మర్చంట్ నీరవ్, ఆయన మామ చోక్సీలు పంజాబ్ నేషనల్ బ్యాంక్ అధికారులతో సాగించిన అక్రమలావాదేవీలపై సిబిఐ పరిశీలన తీవ్రతరం అయింది. ప్రస్తుతానికి ఈ



స్కామ్ ఏ మేరకు సాగిందనే అంశంపై దృష్టి సారించినట్లు, నిధులు ఏ విధంగా చేతులు మారాయి? సీనియర్ అధికారుల పాత్ర ఏమిటనేదానిపై పరిశీలన సాగుతోందని సిబిఐ అధికారులు తెలిపారు. తరువాతి దశలో దీని వెనుక ఉన్న ఇతరత్రా ఉన్నత స్థాయి కోణాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు.



రజనీతో కమల్ భేటీ

పార్టీ ఏర్పాటు, యాత్రపై చర్చ

చెన్నై : తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. మొన్నటి వరకు సూపర్‌స్టార్ రజినీకాంత్‌ను ఎట్టి పరిస్థితుల్లో కలవబోనని ప్రకటించిన మరో నటుడు కమల్‌హాసన్ ఆదివారంనాడు హఠాత్తుగా రజినీ ఇంటికి వెళ్లారు. త్వరలో స్థాపించబోయే పార్టీ, రాజకీయ యాత్ర గురించి రజనీతో చర్చించారు. ఇరువురు పొత్తు కుదుర్చుకోబోతున్నారన్న ఊహాగానాలకు భేటీ తర్వాత కమల్ తెరదించారు. 'మాది రాజకీయపరమైన భేటీ కాదు. ఓ శ్రేయోభిలాషిగా మాత్రమే రజనీని కలిశాను. నా నిర్ణయం(యాత్ర) గురించి రజనీతో చెప్పాను. యాత్ర మొదలుపెట్టే ముందు నాకు నచ్చిన వ్యక్తులను కలుస్తున్నాను. స్నేహితుడిగానే రజనీని కలిశాను తప్ప అందులో రాజకీయ కోణం లేదు' అని కమల్ మీడియాతో వ్యాఖ్యానించారు. మరి భవిష్యత్తులోనైనా రజనీతో చేతులు కలుపుతారా అన్న ప్రశ్నకు కాలమే సమాధానం చెబుతుందని బదులిచ్చారు. ఇప్పటికే కేరళ సిఎం విజయన్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, సిపిఐ నేత నల్లకన్ను, ఎన్నికల సంఘం మాజీ అధికారి శేషన్ తదితరులను కూడా కలిశానని గుర్తు చేశారు. అనంతరం రజినీ కూడా మీడియా ముందుకు వచ్చారు. 'సమాజానికి సేవ చేయాలన్న సంకల్పంతోనే కమల్ రాజకీయాల్లోకి వస్తున్నారు. డబ్బు, పేరు కోసం రాజకీయాల్లోకి రావడం లేదు. సదుద్దేశంతో వస్తున్న కమల్ విజయవంతం కావాలని దేవున్ని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు. కమల్‌తో చేతులు కలపనున్నారా అన్నదానిపై స్పందిస్తూ... సినిమాల్లో మా స్టైల్ వేరు, దారులు వేరని రజనీ వ్యాఖ్యానించడం గమనార్హం.

జడ్జి పరీక్షలలో సిబ్బందికి అనుమతి

న్యూఢిల్లీ : జుడిషియల్ అధికారులను అదనపు జిల్లా జడ్జిల నియామకానికి జరిగే పరీక్షలకు అనుమతించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దిగువ స్థాయి జుడిషియల్ అధికారులు జడ్జిల పదవులు పొందేందుకు దీని వల్ల అవకాశం ఏర్పడింది. దిగువ స్థాయి జుడిషియల్ అధికారులు సంబంధిత పరీక్షలు రాసేందుకు వీలు కల్పించాలని , వారి దరఖాస్తులను నమోదు చేసుకకోవాలని ఢిల్లీ హైకోర్టును సుప్రీంకోర్టు తాజాగా ఆదేశించింది. కోర్టుల నిర్వాహక బాధ్యతలలో ఉండే కొందరు దిగువ స్థాయి జుడిషియల్ అధికారులు తమకు పరీక్షలు రాయడానికి అవకాశం ఇవ్వకపోవడాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఢిల్లీ జుడిషియల్ సర్వీసు రూల్స్‌ను వారు తప్పు పట్టారు. ఎప్రిల్ నెలలో అదనపు జిల్లా జడ్జిల పరీక్షలు జరుగుతున్నాయని, అయితే నిబంధనల మేరకు తమకు వీటికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేదని, ఈ అన్యాయాన్ని సరిదిద్దాలని అధికారులు సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై పరిశీలన జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం తగు ఆదేశాలను ఇప్పుడు ఢిల్లీ హైకోర్టుకు వెలువరించింది. వారి దరఖాస్తులను తీసుకోవాలని, ఏడు సంవత్సరాల న్యాయవాద ప్రాక్టిస్ నిబంధనలను పక్కకు పెట్టాలని, ఇతరత్రా అన్ని అంశాలు సవ్యంగా ఉంటే వారిని పరీక్షలకు అనుమతించాలని ధర్మాసనం ఆదేశించింది. అయితే ఇది ఈ కేసుకు సంబంధించిన తాత్కాలిక ఏర్పాటు అని ధర్మాసనం తెలిపింది.

పశువులు, పౌల్ట్రీలకు జియో ట్యాగ్

తిరువనంతపురం: కేరళలో భారీ డిజిటలైజేషన్‌లో భాగంగా 10 లక్షల మందికిపైగా పశు పెంపకందారులు, పౌల్ట్రీ రైతులకు జియోట్యాగ్‌లను కేటాయించేందుకు ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. జంతువుల పెంపకం, పాడి పరిశ్రమలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్నిభౌగోళిక సమాచార వ్యవస్థ (జిఐఎస్)తో అనుసంధానించాలనే ఉద్దేశ్యంతో పని చేస్తోంది. ఇందుకు సంబంధించి పశుసంవర్ధక శాఖ ఇప్పటికే 60 వేల మందికి పైగా రైతుల ఇళ్లు, పొలాలకు జియో ట్యాగ్‌లను కేటాయించింది. ఈ శాఖను డిజిటలైజేషన్‌లో భాగంగా వచ్చే 6–7 నెలల్లో కాగిత రహిత శాఖగా మార్చనున్నారు. ఇందుకు సంబంధించి 23 మొబైల్ అప్లికేషన్లను అభివృద్ధి చేయనున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ సమాచారాన్ని ఆర్థిక ప్రణాళికలు రూపొందించేందుకు వినియోగించుకోనున్నట్లు పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ ఎన్‌ఎన్ ససి మీడియాకు తెలిపారు. ఈ సమాచారాన్ని బహిర్గతం చేయకుండా, అంతర్గత ప్రణాళికలు, సమీక్షలకు వినియోగించుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

కావేరి తీర్పుపై న్యాయ సలహా

సాలేం: కావేరి జలాల పంపిణీకి సంబంధించి సుప్రీంకోర్టు తీర్పుపై అప్పీల్‌కు న్యాయ నిపుణుల సలహా తీసుకుంటున్నామని తమిళనాడు సిఎం కె పళనీస్వామి ఆదివారం విలేకరులకు తెలిపారు. తమిళనాడుకు కావేరి జలాలను తగ్గిస్తూ అత్యున్నత న్యాయ స్థానం తీర్పు ఇచ్చినప్పటికీ, నదీ జలాలపై ఏ ఒక్క రాష్ట్రం హక్కుదారు కాదని గతంలో కోర్టులు ఇచ్చిన తీర్పులు ఉన్నాయన్నారు. నదీ జలాలు జాతీయ ఆస్తి అని, ప్రకృతి ఇచ్చిన ప్రయోజనకరమైన ఆస్తిపై ఏ రాష్ట్రానికి ప్రత్యేక యాజమాన్య హక్కులు కాని, నీటిని దోపిడీ చేసే హక్కు లేదని సుప్రీం కోర్టు పేర్కొంది. నదీ జలాలు ఎవరి భూభాగం నుంచి ప్రవాహించినా అందరికీ హక్కులుంటాయని, వాటిని అడ్డుకోవడం, వేరే చోట్లకు మళ్లించొద్దని పేర్కొంది. తమిళనాడుకు అత్యున్నత న్యాయస్థానం 14.75 టిఎంసిల నీటి వాటా తగ్గించింది. ఈ మేరకు కర్నాటకకు పెం చి మొత్తం 270 టిఎంసిల నీటిని కేటాయిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. తమిళనాడుకు తాగునీటి కోసం నది బేసిన్ నుంచి భూగర్భ జ లాలను తరలించి,10 టిఎంసిల నీటిని కేటాయించింది. మిగతా జలాల్లో 30టిఎంసిలు కేరళకు, 7 టిఎంసిలు పుదుచ్చేరికి కేటాయించింది.

పోలీసుల అదుపులో జిగ్నేష్

అహ్మదాబాద్ : దళిత కార్యకర్త భానుభాయ్ వనాకర్ ఆత్మహత్యను అధికారులు అడ్డుకోవడంలో విఫలమయ్యారని నిరసిస్తూ గుజరాత్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం నాడు నిరసనకారులు ఆందోళనలు నిర్వహించారు. రాష్ట్ర రాజధాని గాంధీనగర్, అహ్మదాబాద్, పటాన్‌లలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు అహ్మదాబాద్‌లోని సరసాపూర్ ప్రాంతంలో దళిత నాయకుడు, స్వతంత్ర్య ఎంఎల్‌ఎ జిగ్నేష్ మేవానితో పాటు 70 మందికి పైగా కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకుంటున్న సమయంలో మేవాని వ్యవహరించిన తీరు సరిగా లేదని పోలీసు అధికారులు పేర్కొన్నారు. అయితే, పోలీసులు తనను కారు నుంచి బలవంతంగా లాగి పారేశారని మేవాకర్ ట్విటర్‌లో పేర్కొన్నారు. దళిత కుటుంబానికి భూమిని కేటాయించాలని డిమాండ్ చేస్తూ వనాకర్ (62) శుక్రవారం నాడు పటాన్ కలెక్టరేట్ బయట నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. అహ్మదాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు.

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో 76 శాతం పోలింగ్

అగర్తలా: త్రిపుర అసెంబ్లీకి ఆదివారం జరిగిన ఎన్ని కల్లో 76 శాతం పోలింగ్ నమోదయింది. ఈ ఎన్నికల్లో 25.73 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. త్రిపుర ఎన్నికల సందర్భంగా ఈశాన్య రాష్ట్రాలలో వేలాది మంది పారా మిలటరీ బలగాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పలు పోలింగ్ కేంద్రాలలో ఇవిఎంలు పని చేయకపోవడంతో వాటిని వెంటనే సరి చేశామని అదనపు సిఇఒ తపస్ రాయ్ తెలిపారు. భద్రతా సిబ్బంది రెండు నాటు బాంబులను నిర్వీర్యం చేశారు. పశ్చిమ త్రిపురలో కొన్ని పోలిం గ్ కేంద్రాలలో ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమయిందని అంతకు ముందు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ శ్రీరామ్ తరణికాంత్ తెలిపారు. ఖోవై, ఉనకోటి జిల్లాలో అధికారులు ఇవిఎంలను సరిగా అమర్చక పోవడంతో, సాంకేతిక నిపుణులు వెంటనే అక్కడికి చేరుకుని ఇవిఎంలను సరి చేశారు. చారిలమ్ నియోజకవర్గానికి చెందిన సిపిఎం అభ్యర్థి రామేంద్ర నారాయణ్ దేబ్ వర్మ వారం క్రితం మృతి చెందడంతో అక్కడ మార్చి12న ఎన్నికలు జరుపనున్నారు. త్రిపుర అసెంబ్లీలోని 60 స్థానాలకు గానూ 59 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. రాష్ట్రంలో 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా సిపిఎం అధికారంలో కొనసాగుతోంది. గత నాలుగు పర్యాయాలుగా మాణిక్ సర్కార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. కాగా, అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌లో అధికారంలో ఉన్న బిజెపి త్రిపురలో అధికారంలోకి వచ్చేందుకు ముమ్మర ప్రచారం నిర్వహించింది. మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలను వెల్లడించనున్నారు.



ప్రజాస్వామ్యమే బిజెపికి ప్రధాన విలువలు

● జాతీయ ప్రయోజనాల కోసమే ఉద్యమాలు : మోడీ ● బిజెపి నూతన కార్యాలయం ప్రారంభం





న్యూఢిల్లీ : జాతీయ ప్రయోజనాల కోసమే నేటి బిజెపి అయినా, నాటి జనసంఘ్ అయినా స్వాతంత్ర్యం నాటి నుంచి అన్ని రకాల ఉద్యమాలు నిర్వహించాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రజాస్వామ్యమే బిజెపికి ప్రధాన విలువలని, ఇదే అన్ని భాగస్వామ్య పక్షాలను ముందుకు తీసుకుపోతున్నదని చెప్పారు. ఢిల్లీలో బిజెపి నూతన ప్రధాన కార్యాలయాన్ని మోడీ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, పలువురు మంత్రులు అగ్ర నేతలు లాల్ కృష్ణ అద్వానీ, మురళీ మనోహర్ జోషి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోడీ మాట్లాడుతూ 'స్వాతంత్ర్యానంతరం భారతీయ జనసంఘ్, ఇప్పుడు బిజెపి నేతృత్వంలో అన్ని రకాల ఉద్యమాలు, పోరాటాలను జాతీయ ప్రయోజనాల కోసమే నిర్వహించాయి, ఇందుకు మేమెంతో గర్వపడుతున్నాం' అని పేర్కొన్నారు. బిజెపిలో దేశభక్తి జీర్ణించుకుపోయిందని, జాతి కోసం ఎంతో మంది నాయకులు పోరాటాలు, త్యాగాలు చేశారని అన్నారు. బిజెపి ప్రస్థానం మహనీయులతో ప్రారంభమైందని అన్నారు. ఎంతో మంది మహనీయుల తోపాటు, తరతరాల కార్యకర్తలు పార్టీ కోసం తమ జీవితాలను అంకితం చేస్తున్నారన్నారు.

ప్రపంచంలోనే పెద్ద పార్టీ కార్యాలయం..

బిజెపి నూతన కార్యాలయం అతిపెద్దదని, ప్రపంచంలో ఏ ఇతర పార్టీకి ఇంత పెద్ద కార్యాలయం లేదని పార్టీ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. 1.70 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కార్యాలయాన్ని నిర్మించామని తెలిపారు. దేశంలోని అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవాలని 2015 జాతీయ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించుకున్నామన్నారు. ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గంలో ఈ నూతన ప్రధాన కార్యాలయం ఉంది. దీనిలో అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయి. విశాలమైన సమావేశ మందిరం, పార్టీ కార్యవర్గ సభ్యులందరికీ వేర్వేరు గదులు ఉన్నాయి. ల్యూటెన్స్ బంగళా జోన్ నుంచి ప్రధాన కార్యాలయాన్ని తరలించిన మొదటి పార్టీగా బిజెపి నిలిచింది. ఇక్కడి నుంచి పార్టీల ఆఫీస్‌లను వేరొక చోటుకు తరలించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం విదితమే.

ముంబైలో అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన

నవీ ముంబై : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం నాడు నవీ ముంబయిలో నూతన అంతర్జాతీయ వియానాశ్రయ మొదటి దశ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాదాపు 16,700 కోట్ల వ్యయంతో చేపడుతోన్న నూతన వియానాశ్రయం నిర్మాణం పూర్తయితే ఇది దేశంలోనే అతిపెద్ద కంటైనర్ పోర్టుగా 50 శాతం సరకు రవాణా సామర్థ్యంతో పని చేయగలుగుతుంది. ఈ నాలుగవ టెర్మినల్ ప్రాజెక్టు 10 మిలియన్ల స్టాండర్ట్ కంటైనర్ యూనిట్లతో జెఎన్‌టి సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేయడంతో ప్రపంచంలోనే 33వ అతిపెద్దదిగా నిలువబోతుంది. ప్రస్తుతం జెన్‌పిటి పోర్టు 4.8 మిలియన్ స్టాండర్ట్ కంటైనర్ యూనిట్ల సామర్థ్యంతో పని చేస్తున్నది. ఈ నిర్మాణం పూర్తయితే ఈ సామర్థ్యానికి మరో 2.4 మిలియన్‌లు జోడవుతాయి. నాలుగు విడతలుగా చేపడుతోన్న ఈ ప్రాజెక్టును 2031 నాటికి ఆరు కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణించే విధంగా అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం ఒకే రన్‌వేతో కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఛత్రపతి శివాజీ విమానాశ్రయంలో రోజుకు 980 విమానాలు రాకపోకలు సాగిస్తోన్నాయి.



యాసల శ్వాస పోతోంది!



న్యూఢిల్లీ : భాషలు చచ్చిపోతున్నాయి. భారతదేశంలో 40కి పైగా భాషలు అంతరించిపొయ్యేదిశలో ఉన్నాయి. కొన్ని వేల మందే ఇప్పుడు ఈ భాషలలో మాట్లాడుతున్నారని సెన్సస్‌డైరెక్టరేట్ నివేదికలో వెల్లడైంది. 40 భాషలు లేదా మాండలికాలకు ముప్పు పొంచి ఉందని పరిశీలనలో వెల్లడైంది. మనిషి మనుగడలో భాష ఆయువుపట్టు. అయితే మనిషి మనుగడలో చోటుచేసుకుంటున్న మార్పులే చివరికి ఆయా భాషల నాశనానికి దారితీస్తున్నాయి. సెన్సస్ డైరెక్టరేట్ నివేదిక మేరకు దేశంలో 22 షెడ్యూల్ భాషలు, వంద వరకూ నాన్ షెడ్యూల్ భాషలు ఉన్నాయి. లక్ష అంతకు మించి జనాభా మాట్లాడే భాషలు ఈ వంద నాన్ షెడ్యూల్ జాబితాలో ఉన్నాయి. కానీ పది వేల మందికి తక్కువగా జనం మాట్లాడుకునే 40 భాషలు ఇప్పుడు అంతరించిపొయ్యే దశలో ఉన్నాయని వెల్లడైంది. ఈ భాషలకు ఏర్పడ్డ ముప్పు గురించి హోం మంత్రిత్వశాఖ అధికారులు నిర్ధారించారు. భారత దేశంలో 42 భాషలు అంతర్థానం అయ్యే పరిస్థితి ఉందని యునెస్కో కూడా తెలిపింది. ఈ మేరకు వాటి జాబితాను కూడా సిద్ధం చేసింది. భాషలు లేదా ప్రాంతాల వారిగా మాట్లాడే మాండలికాలకు ఎక్కువగా ముప్పు ఉందని ఇందులో పేర్కొన్నారు. అంతర్థానం కానున్న భాషలలో 11 వరకూ అండమాన్ నికోబార్ దీవులకు చెందినవి ఉన్నాయి. గ్రేట్ అండమానిస్, జరావా, లమాంగ్స్, లూరో, ఒంగే, పూ వంటి భాషలు అక్కడ కొన ఊపిరితో ఉన్నాయి. ఇక మణిపూర్‌కు చెందిన ఏడు భాషలు, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన నాలుగు భాషలకు ముప్పు ఉంది. ఈ కేటగిరిలోనే మాండా, పార్జీ, పెంగో (ఒడిషా) కొరాగా, కురుబా (కర్ణాటక), నాయకి (ఆంధ్రప్రదేశ్), కోట, తోడా (తమిళనాడు), మ్రా , నా (అరుణాచల్ ప్రదేశ్), బంగానీ (ఉత్తరాఖండ్), టోటో (పశ్చిమబెంగాల్) వంటి కొన్ని భాషలు ఉన్నాయి. ప్రమాదం పొంచి ఉన్న ఈ భాషల రక్షణకు మైసూరులోని భారతీయ భాషల కేంద్రీయ సంస్థ పరిశ్రమిస్తోంది. కేంద్ర ప్రభుత్వ పథకం పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడైంది. దీని మేరకు ఆయా భాషలకు సంబంధించి వ్యాకరణ వివరణ, బహుళ, ద్విభాషల నిఘంటువుల తయారీ, భాషా ప్రాథమికాలు, జానపద కథల పూర్వాపరాలు వంటి వాటిని తీర్చిదిద్దుతున్నారు. ఇక ఆయా భాషలు లేదా మాండలికాల ఎన్‌సైక్లోపోడియాలను రూపొందించడం జరుగుతోందని అధికారులు తెలిపారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు భాషల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాయి. అధికారిక భాషలుగా గుర్తింపు ఇవ్వడం వంటి చర్యలు చేపట్టారు. భాషా సదస్సులు, భాషా మాధ్యమికాల ప్రోత్సాహ చర్యలు తీసుకుంటున్నారు.

తాజ్‌మహల్‌ను సందర్శించిన కెనడా ప్రధాని ట్రూడో



ఆగ్రా : వారం రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, భార్య, పిల్లలతో కలిసి ఆదివారం నాడు తాజ్ మహల్‌ను సందర్శించారు. ఢిల్లీ నుంచి ఆగ్రా చేరుకున్న ఆయన తాజ్‌మహల్‌ను వీక్షించారు. ట్రూడో తన భార్య సోఫీ గ్రెగోరీ, ముగ్గురు పిల్లలతో కలిసి తాజ్‌మహల్ వద్ద ఫ్యామిలీ ఫొటో దిగారు. 2015లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం భారత్‌లో మొట్టమొదటి సారిగా పర్యటిస్తున్న ఆయన ప్రధాని మోడీతో సమావేశమవుతారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఇంధనం, వాణిజ్యం, మౌలిక వసతులు వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. 'ఈ పర్యటనలో మంచి ఉద్యోగాల కల్పన, ఇరు దేశాల ప్రజల మధ్య మంచి సంబంధాలను మరింత బలోపేతం చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తా' అని ట్రూడో ట్విటర్‌లో పేర్కొన్నారు. కెనడా, భారత్‌ల మధ్య వాణిజ్యం గత దశాబ్దంలో రెట్టింపు కాగా, 2016లో ఇది 8 బిలియన్ డాలర్లకు చేరింది.



షరీఫ్ ప్రకటిత ఆస్తులు ఆరు కోట్లు

ఇస్లామాబాద్ : పాకిస్థాన్ పదవీచ్యుత ప్రధాని నవాజ్ షరీఫ్ ప్రకటిత ఆస్తుల విలువ దాదాపు రూ. 6 కోట్ల వర కూ ఉంటుందని పాకిస్థాన్ అవినీతి నిరోధక సంస్థ తెలిపింది. అవినీతి ఆరోపణలు వెలువడంతో షరీఫ్ పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. షరీఫ్ ఆయన కుటుంబ సభ్యులు 18 సంవత్సరాల క్రితం ప్రకటించిన ఆస్తుల విలువ మొత్తం ఐదు కోట్ల ఎనభై లక్షల రూపాయల వరకూ ఉంటుందని జాతీయ జవాబుదారి సంస్థ (ఎన్ఎబి) సంబంధిత కోర్టుకు తెలిపింది. ఈ విషయాన్ని స్థానిక పత్రికలు ఆదివారం వెల్లడించాయి. 66 సంవత్సరాల షరీఫ్, ఆయన కుటుంబ సభ్యులపై మూడు అవినీతి కేసులు దాఖలు అయ్యాయి. ప్రధానిగా షరీఫ్‌ను సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించింది. ఆయన వ్యవహారాలపై దర్యాప్తు జరిపించాలని ఆదేశించింది. ఈ మేరకు ఇప్పుడు దర్యాప్తు జరుగుతోంది. విచారణ జరిపి షరీఫ్ ఇతరులపై తగు కేసులను నమోదు చేయాలని సూచించారు. దీనితో ఇప్పుడు ఎవెన్‌ఫీల్డ్ ప్రాపర్టీస్, అజీజియా అండ్ హిల్ మెటల్ ఎస్టాబ్లిష్‌మెంట్, ఫ్లాగ్‌షిప్ ఇన్వెస్ట్‌మెంట్లపై కేసులు నమోదు, నిందితులు 2000 సంవత్సరంలో దాఖలు చేసిన డిక్లరేషన్‌లో రూ 50, 940,870 కోట్ల విలువైన ఆస్తులను ప్రకటించారని పిఎన్‌బి తెలిపింది. అల్ అజీజియా స్టీల్ మిల్స్‌ను షరీఫ్ స్వాధీనం చేసుకున్న విషయం, హిల్ మెటల్స్ ఎస్టాబ్లిష్మెంట్ ఏర్పాటు అంశాలు వెలుగులోకి వచ్చాయంది.

భారత్‌లో స్మార్ట్ సిటీలకు సాయం


న్యూఢిల్లీ: భారత్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి నిధులిచ్చేందుకు ఫ్రాన్స్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎఎఫ్‌డి)ముందుకు వచ్చింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికమంత్రిత్వశాఖ అధికారి ఒకరు ఆదివారంనాడు తెలిపారు. ఆకర్షణీయ నగరాల అభివృద్ధి పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పలు నగరాలను ఎంచుకొని వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 99 నగరాలను ఎంపిక చేసింది. వాటిని అభివృద్ధి చేసేందుకు రూ.2.03లక్షల కోట్ల అవసరం ఉంది. అయితే ఫ్రాన్స్ ఏఎఫ్‌డి బ్యాంకు స్మార్ట్ సిటీ మిషన్‌కు 100 మిలియన్ల యూరోలు(సుమారు రూ.800కోట్లు) నిధులు ఇచ్చేందుకు ఆసక్తి కనబరుస్తోంది. ఈ నిధులకు సంబంధించిన తుది నిర్ణయం ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఎమ్మానుయేల్ మేక్రాన్ భారత్ పర్యటనకు వచ్చే లోపే తేలుతుంది అని ఆర్థికశాఖ అధికారి వెల్లడించారు.

సహనాన్ని పరీక్షించొద్దు : నెతన్యాహు



మ్యూనిచ్: ఇజ్రాయెల్ సహనాన్ని పరీక్షించవద్దని ఆ దేశ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ఇరాన్‌ను హెచ్చరించారు. ఒప్పందానికి విరుద్ధంగా దురాక్రమణలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యూనిచ్‌లో జరిగిన రక్షణ రంగ సదస్సులో ఆయన ప్రపంచ నేతలు, రక్షణ రంగ అధికారులతో మాట్లాడారు. ఇరాన్ వ్యవహరిస్తున్న తీరు ప్రమాదకరంగా ఉందని అన్నారు. ఉగ్రవాద చర్యలకు దిగితే ఏమాత్రం ఉపేక్షించేది లేదని అన్నారు. మాపై దాడులకు దిగితే అవసరమైన చర్యలకు దిగేందుకు ఎంత మాత్రం వెనుకాడేది లేదని తెలిపారు.

బ్రిటన్ యాంటీ టెర్రర్ చీఫ్‌గా భారత సంతతి వ్యక్తి?



లండన్ : భారతీయ సంతతికి చెందిన నెయిల్ బసు బ్రిటన్‌లో ఉగ్రవాద నిరోధక పోలీసు సంస్థ అధినేత కానున్నారు. స్కాట్‌లాండ్ యార్డ్ పరిధిలోని జాతీయ ఉగ్రవాద నిరోధక సంస్థ ప్రస్తుత చీఫ్ వచ్చే నెలలో రాజీనామా చేస్తున్నారు. దీనితో ఈ స్థానం భర్తీ ప్రక్రియలో బసు పేరు ప్రముఖంగా వినబడుతోంది. నెయిల్ బసు ప్రస్తుతం స్థానికంగా పోలీ సు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్నారు. అంతేకాకుండా బ్రిటన్ ఉగ్రవాద నిరోధక విధాన నిర్ణయాక మండలిలో సమన్వయకర్తగా కూడా వ్యవహరిస్తున్నారు. వచ్చే నెలలో రాజీనామా చేయనున్న మార్క్ రౌలే నుంచి బసు బాధ్యతలు తీసుకుంటారని, అత్యున్నత స్థాయి ఉగ్రవాద నిరోధక పోలీసు సంస్థ బాధ్యతలు తీసుకుంటారని స్పష్టం అవుతోందని ది సండే టైమ్స్ పత్రిక తెలిపింది. బసు తండ్రి భారతీయ సంతతివారు. ప్రస్తుతం రౌలేకు డిప్యూటీగా ఉన్న బసు ఉగ్రవాద నిరోధక విధానాల రూపకల్పనలో గత మూడు సంవత్సరాలుగా పేరొందారు. బ్రిటన్ నుంచి పారిపోయి ఐఎస్ఐఎస్‌లో చేరిన యువత పట్ల అనుసరించాల్సిన విధానాలు,బ్రిటిష్ జాతీయులు ఉగ్రవాదం పట్ల ఆకర్షితులు కాకుండా తీసుకోవల్సిన చర్యలపై నిర్థిష్ట అభిప్రాయాలను పలు సార్లు వ్యక్తపర్చిన బసు ఇంటర్నెట్ ద్వారా వ్యాప్తి చెందుతున్న ఉగ్రవాదం గురించి ఆందోళన వ్యక్తం చేశారు. యాంటీ టెర్రర్ చీఫ్ స్థానానికి బసు పేరుతో పాటు మరో పోలీసు అధికారి హెలెన్ బాల్, వెస్ట్ మిడ్‌లాండ్స్ పోలీసు అధికారి డావే థాంప్సన్‌ల పేర్లు కూడా విన్పిస్తున్నాయి.

ఉగ్రవాద నిందలు తగవు

అమెరికాకు పాక్ సైనిక చీఫ్ చురక

ఇస్లామాబాద్ : తమ దేశం ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నదనే వాదనను పాకిస్థాన్ సైన్యాధ్యక్షులు జనరల్ క్వామర్ బాజ్వా తోసిపుచ్చారు. తమ దేశంపై నిందలు వేసే పద్ధతి మానుకోవాలని ఆయన అమెరికాకు ఘాటు సూచనలు చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా వైఫల్యానికి తమ దేశంపై నిందలు వేస్తున్నారని, ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ప్రోత్సహిస్తోందని చెపుతున్నారని ఇది అనుచితం అని బాజ్వా తెలిపారు. మూడు రోజుల భద్రతా సమావేశాలలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో సైనిక అధికారులు ,ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.భద్రతా అంశాలపై సమీక్షిస్తారు. సైన్యాధిపతి తమ ప్రసంగంలో ప్రధానంగా అమెరికా వైఖరిని తప్పుపట్టారు.పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాలు ఉన్నాయనే వాదన వట్టిదే అని, సీమాంతర ఉగ్రవాదం ఆటకట్టుకు తమ దేశం అన్ని చర్యలూ తీసుకొంటోందని తెలిపారు. ఆఫ్ఘనిస్థాన్ భూభాగం నుంచి తరచూ తాము ఉగ్రవాద దాడులను ఎదుర్కొవల్సి వస్తోందని, ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న అసంఖ్యాక ఆఫ్ఘన్ శరణార్థులను తిప్పి పంపాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఉగ్రవాదం ఆటకట్టుకు అంతర్జాతీయ సహకారం అవసరం అని, ఉగ్రవాదంపై పాకిస్థాన్‌ను నిందించడం కేవలం అమెరికా చేతకానితనం, ఆఫ్ఘనిస్థాన్‌లో వైఫల్యం వల్ల తలెత్తిన సమస్యకు తమను బాధ్యులను చేయడం ఎంతవరకు సబబని బాజ్వా ప్రశ్నించారు.

రష్యా చర్చిలో కాల్పులు

నలుగురు మహిళల మృతి

మాస్కో : రష్యాలో డాగేస్థాన్ ప్రాంతంలోని కిజ్లయర్ చర్చిపై దాడి జరిగింది. ఇస్లామిక్ తీవ్రవాదులు దాడికి దిగి జరిపిన కాల్పుల్లో నలుగురు మహిళలు మృతి చెందారు. ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని సాయుధుడు ఒకరు చర్చిలోకి చొరబడి ఆ కాల్పులు జరిపినట్లు, ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మహిళలు తరువాత మృతి చెందినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ముస్లింలు ఎక్కువగా ఉండే నార్త్ కాకసస్ ప్రాంతంలోని ఈ ఆర్థోడాక్స్ చర్చిలో ఆదివారం ప్రార్థనలు జరుగుతున్న సమయంలో కాల్పులు జరిగాయి. కాల్పులలో పోలీసు అధికారి ఒకరు, స్థానికుడు ఒకరు గాయపడ్డట్లు , కాల్పులకు దిగిన దుండగుడిని తాము ఎదురుకాల్పులు జరిపి చంపివేసినట్లు పోలీసులు తెలిపారు. దుండగుడు స్థానికుడు అని, 20 ఏళ్ల వయస్సు ఉంటుందని వెల్లడించారు. ప్రార్థనలు ముగుస్తున్న దశలో ఒక వ్యక్తి పెద్దగా అల్లాహో అక్బర్ అని అరుస్తూ వచ్చి కాల్పులకు దిగాడని చర్చి ఫాదర్ తెలిపారు. ఆ వ్యక్తి వద్ద రైఫిల్, కత్తి ఉన్నట్లుగా గుర్తించామని వివరించారు. చెచెన్యాకు సమీపంలోని డాగెస్థాన్ ప్రాంతం చాలా వెనుకబడి ఉంది. తరచూ కల్లోలాలతో అస్థిరత నెలకొని ఉండే ఈ ప్రాంతంలో ఇస్లామిక్ తీవ్రవాదం తలెత్తూతూ వస్తోంది. ప్రస్తుత దాడి ఇస్లామిక్ జిహాద్ సంస్థల పని అని కొన్ని వర్గాలు తెలిపాయి.



పర్వతాల్లో కుప్పకూలిన విమానం

- **66మంది దుర్మరణం**
- **ఇరాన్‌లో దుర్ఘటన**

టెహ్రాన్ : ఇరాన్‌లో ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారంనాడు జాగ్రోస్ పర్వతాల్లో విమానం కుప్పకూలిన ఘటనలో 66మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ఆరుగురు విమాన సిబ్బంది ఉన్నారు. మిగతా వారంతా ప్రయాణికులే. ఏస్‌మాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ విమానాశ్రయం నుంచి ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లోని యాసుజ్‌కు ఉదయం 8గంటలకు బయలుదేరింది. యాసుజ్‌కు 23కిలో మీటర్ల దూరంలో రాడార్‌తో సంబంధాలు తెగిపోయాయి. హుటాహుటిన గాలింపు చర్యలు చేపట్టి, జాగ్రోస్ పర్వతాల్లో విమానం కూలిపోయినట్లు గుర్తించారు. ప్రమాద స్థలికి చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, వాతావరణం అనుకూలించడం లేదని ఇరాన్ అత్యవసర సేవల విభాగం వెల్లడించింది. దుర్ఘటనస్థలికి 12బృందాలను ఇప్పటికే పంపించామని, వారు అక్కడికి చేరుకునేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారని వివరించారు. దట్టమైన అడవులతో పాటు పర్వత ప్రాంతమైనందున అక్కడికి అంబులెన్స్‌లు చేరుకునే అవకాశం లేదు. విమానానికి రెండు ఇంజిన్లు ఉన్నాయని, ప్రమాదానికి కారణాలను తెలుసుకోవడానికి శాఖపరమైన విచారణకు ఆదేశించినట్లు ఏస్‌మాన్ విమానయాన సంస్థ వెల్లడించింది. కొంత కాలంగా ఇరాన్ విమానాలు తరచూ ప్రమాదాలకు గురవుతూ వస్తున్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఇరాన్ అంతర్జాతీయంగా ఆంక్షలను ఎదుర్కొంటోంది. దీంతో విమానాలకు సంబంధించిన స్పేర్ పార్ట్‌లను దిగుమతి చేసుకోవడం ఇరాన్‌కు కత్తిమీద సాములా మారింది. చేసేదేం లేక ఇక్కడి విమానయాన సంస్థలు దీర్ఘ కాలంగా కాలం చెల్లిన విమానాలనే నడుపుతున్నాయి. తరచూ జరుగుతున్న ప్రమాదాలకు ఇవి కూడా కారణాలని ఆ సంస్థలు ఆరోపిస్తున్నాయి. అయితే అణు ఒప్పందంలో భాగంగా ఇరాన్ సంస్థలు అమెరికా నుంచి విమాన విడిభాగాలను కొనుగోలు చేసుకునే సౌకర్యాన్ని కల్పించినప్పటికీ అక్కడి నుంచి దిగుమతి చేసుకోవడం వ్యయ ప్రయాసలతో కూడుకున్నది.



సౌదీలో మహిళలకు వ్యాపార స్వేచ్ఛ

రియాద్ : మహిళా స్వేచ్ఛ విషయంలో సౌదీ అరేబియా మరో అడుగు ముందుకు వేసింది. సౌదీ అరేబియాలో ఇకపై మహిళలు సొంతంగా తమ వ్యాపారాలను నిర్వహించుకోవచ్చు. భర్త అనుమతి కానీ మగ బంధువుల సమ్మతి కానీ లేకుండానే మహిళలు వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసుకోవచ్చు. దేశంలో ప్రైవేటు రంగం విస్తరణకు వీలుగా సౌదీలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సౌదీ ప్రభుత్వం ఇటీవలే దీనికి సంబంధించి కీలక విధాన నిర్ణయాన్ని ప్రకటించింది. దశాబ్దాలుగా దేశంలో అమలులో ఉన్న కుటుంబ రక్షక వ్యవస్థను కూడా మారుస్తున్నట్లు, ఇప్పటివరకూ ఉన్న గార్డియన్ షిప్ విధానంలో కీలక మార్పుగానే మహిళకు వ్యాపారాల స్వేచ్ఛను కల్పిస్తున్నట్లు సౌదీ అరేబియా అధికార వర్గాలు తెలిపాయి. సౌదీలో గార్డియన్‌షిప్ వ్యవస్థ మేరకు ఇప్పటివరకూ మహిళలు వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవాలంటే మగ సంరక్షకుడి నుంచి అనుమతి పత్రం పొందాల్సి ఉంది. అంటే భర్త నుంచి సరైన అనుమతి ఉంటేనే వారు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోవచ్చు, చివరికి ప్రయాణాలు చేయడం, ప్రభుత్వ పత్రాలు పొందడం, విద్యా సంస్థలలో చేరడం వంటి పలు ప్రక్రియలకు మగవారి నుంచి నిర్థిష్ట అనుమతి తీసుకోవాలి. ముడిచమురు ఉత్పత్తినే కీలక ఆదాయ వనరుగా మల్చుకున్న ఈ దేశంలో తాజాగా ప్రైవేటు రంగ విస్తరణ చర్యలు చేపట్టారు. మహిళలకు ఉద్యోగ ఉపాధి కల్పన, వారికి సరైన అవకాశాలు కల్పించడం వంటి నిర్ణయాలను సంస్కరణల పథంలో భాగంగా తీసుకున్నారు. అయితే ఇప్పటికీ దేశంలో మహిళలు పలు నియంత్రణలకు గురి అవుతున్నారు. ఈ నెలలోనే పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మహిళను నియమించిన ఈ దేశంలో తాజాగా దర్యాప్తు సంస్థలలో అధికారులుగా , ఉద్యోగులుగా మహిళలను తీసుకునేందుకు అనుమతిని ఇస్తున్నట్లు ప్రకటించారు. దేశ సరిహద్దులు, విమానాశ్రయాల పరిరక్షణకు ప్రకటించిన ఉద్యోగాలకు ఇప్పటికే వేలాదిగా మహిళలు దరఖాస్తులు చేసుకోవడం విశేష పరిణామంగా మారింది.



రష్యా కాదు ఫ్లోరిడా వైపు చూడండి

- **ఎఫ్‌బిఐకి ట్రంప్ చురకలు**

ఫోర్టు లౌడర్‌డాలే : ఫ్లోరిడాలో పార్క్‌లాండ్ స్కూల్ కాల్పుల ఘటనలో ఎఫ్‌బిఐ పూర్తిగా వైఫల్యం చెందిందని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. ఎన్నికలలో రష్యా పాత్రపై ఎఫ్‌బిఐ మక్కువ ప్రదర్శించిందని, అయితే పార్క్‌లాండ్ కాల్పుల నివారణలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని ట్రంప్ పేర్కొన్నారు. ముందుగా స్కూల్‌లో కాల్పులు జరిగే ప్రమాదం ఉందని సంకేతాలు అందినా ఎఫ్‌బిఐ పట్టించుకోలేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. దేశంలో గన్ సంస్కృతిని నివారించాలని కోరుతూ ఫ్లోరిడాలో వేలాది మంది ర్యాలీలు నిర్వహించారు. దేశంలోని నేషనల్ రైఫిల్ అసోసియేషన్‌తో ట్రంప్‌నకు సంబంధాలు ఉన్నాయని, దీని వల్లనే తుపాకుల వాడకం విచ్చలవిడిగా సాగుతోందని విమర్శలు వెలువడ్డాయి. ఈ తరుణంలో ట్రంప్ స్పందన వెలువడింది. ఫ్లోరిడా స్కూల్ షూటర్ దారుణానికి పాల్పడుతాడని ముందుగా తెలిసినా నివారణ చర్యలు తీసుకోవడంలో ఎఫ్‌బిఐ విఫలం కావడం బాధాకరం అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రచారంలో రష్యా నేతల ప్రమేయం, ఎన్నికలలో విదేశీ పాత్ర ఉందనే విషయం రుజువు చేయాలనే తపనతో ఎఫ్‌బిఐ వ్యవహరిస్తున్నట్లుగా ఉందని, దీనిపైనే వారు ఎక్కువగా సమయం తీసుకుంటున్నట్లుగా ఉందని ట్రంప్ వ్యంగ్యంగా స్పందించారు. అయితే రష్యా పాత్రపై ఏ విధమైన ఆధారాలు లేవు, రష్యాతో కుమ్మక్కు లేదని వెల్లడైంది. ఇక ఎఫ్‌బిఐ వారు వాస్తవికతల జోలికి వెళ్లి అంతా గర్వించేలా చేయాల్సి ఉందని ట్రంప్ తమ ట్విట్టర్‌లో స్పందించారు. ఫ్లోరిడా స్కూల్‌లో సాయుధుడు ఉన్మాద రీతిలో జరిపిన కాల్పులలో 17 మంది విద్యార్థులు దుర్మరణం చెందారు. దీనితో దేశంలో విచ్చలవిడిగా సాగుతోన్న తుపాకుల వాడకం తంతుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనవరిలోనే తమకు స్కూల్‌లో కాల్పులు జరగవచ్చునని సంకేతాలు అందాయని ఎఫ్‌బిఐ అంగీకరించింది. స్కూల్ పాత విద్యార్థి నికోలాస్ క్రూజ్ దారుణ రీతిలో కాల్పులకు దిగే వీలుందని తమకు సమాచారం అందిందని ఎఫ్‌బిఐ వర్గాలు తెలిపాయి. ఇది ఇది ఇలా ఉండగా జాతీయ రైఫిల్ అసోసియేషన్ (ఎన్ఆర్ఎ)తో రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులకు సంబంధాలు ఉండటం ఇప్పుడు విమర్శలకు దారితీసింది. ఫోర్టు లౌడర్‌డాలేలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల ప్రదర్శనలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. ఎన్ఆర్ఎ నుంచి చందాలు తీసుకుంటున్న నేతలు అంతా దేశంలో సాగుతున్న ఉన్మాద కాండతో సిగ్గుతో తలదించుకోవాలని ప్రదర్శనను ఉద్దేశించి 18 ఏండ్ల యువతి ఎమ్మా గొంజాలెజ్ మండిపడ్డారు. గన్ లాబీ నుంచి ట్రంప్ ప్రచారానికి భారీ స్థాయిలో నిధులు అందాయని ఆరోపించారు.



ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారు

- **కేంద్రంపై అవిశ్వాసానికి మద్దతిస్తాం : వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి**

ప్రకాశం : ఎపికి ప్రత్యేక హోదా సాధనకు టిడిపి ముందుకొస్తే తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని వైసిపి చీఫ్ జగన్ పేర్కొన్నారు. ఎపికి ప్రత్యేక హోదాలో ఎవరు సలహా ఇచ్చినా స్వీకరిస్తానని ఆయన తెలిపారు. ప్రకాశం జిల్లాలో జగన్ పాదయాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలన్న జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ ప్రతిపాదనను స్వాగతిస్తున్నట్టు ఆయన చెప్పారు. అవిశ్వాసానికి తమ బలం ఒక్కటే సరిపోదని ఆయన పేర్కొన్నారు. కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి వైసిపి సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం టిడిపి అవిశ్వాసం పెడితే వైసిపి పూర్తి మద్ధతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. హోదాను చంద్రబాబు కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని జగన్ ఆరోపించారు. ఇప్పటికైనా చంద్రబాబు తన తప్పును సరిదిద్దుకోవాలని ఆయన సూచించారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వకుంటే ఏప్రిల్ 6న వైసిపి ఎంపిలు రాజీనామా చేస్తారని ఆయన తెలిపారు. వైసిపి ఎంపిలతో పాటు టిడిపి ఎంపిలు కూడా రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 25 మంది ఎంపిలు రాజీనామా చేస్తే కేంద్రం దిగొస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక ప్యాకేజీ విషయాన్ని పక్కన బెట్టి ప్రత్యేక హోదా కోసం పార్టీలకతీతంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీతో ఎపికి ఒనగూరే ప్రయోజనం ఏదీ లేదని ఆయన అన్నారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ కోడి గుడ్డు మీద ఈకలు పీకినట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఎపికి ప్రత్యేక హోదా తమ హక్కు అంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ పోరాడాలని ఆయన చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే పేదవాడి వైద్య ఖర్చు వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తామని జగన్ వెల్లడించారు.

తిరుమలలో భక్తుల రద్దీ

తిరుమల : తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి దర్శనం కోసం 13కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శ్రీవారి సర్వ దర్శనానికి ఏడు గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గంటలు, కాలినడక భక్తులకు ఎనిమిది గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 72,197 మంది దర్శించుకున్నారు. 37,103 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. శనివారం శ్రీవారి హుండీకి రూ.2.39 కోట్ల ఆదాయం సమకూరింది.

యాదాద్రిలోనూ..

యాదాద్రిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ధర్మదర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. భక్తుల రద్దీతో కొండపైకి వాహనాలను అనుమతించడం లేదు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఒంటిమిట్ట చెరువులో ఏడు మృతదేహాలు

ఒంటిమిట్ట: కడప జిల్లా ఒంటిమిట్టలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. చెరువులో ఏడుగురు వ్యక్తుల మృతదేహాలను గ్రామస్థు లు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను చెరువులో నుంచి బయటకు తీశారు. ఒకే కుటుంబం ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





బ్యాగు బరువుపై అవగాహన కరువు

మనతెలంగాణ/ హైదరాబాద్ : కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు (కెజిబివి) రెసిడెన్షియల్ పాఠశాలలే అయినప్పటికీ విద్యార్థులు మాత్రం అవసరానికి మించి బరువు మోస్తున్నారు. వారి బ్యాగుల్లో అవసరంలేని సామాగ్రే ఎక్కువగా ఉంటున్నట్లు విద్యాశాఖ అధికారులు ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది. రాష్ట్ర స్థాయి విద్యాశాఖ బృందాలు గత నెలలో వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలలతో పాటు కెజిబివిలను కూడా పరిశీలించాయి. విద్యార్థుల బ్యాగు బరువుపై కెజిబివిల ఉపాధ్యాయులకు సరైన అవగాహన లేకపోవడంతో అవసరానికి మంచిన నోట్ బుక్కులు ఉన్నా పట్టించుకోవడం లేదని తనిఖీ బృందాలు అభిప్రాయపడ్డాయి. స్కూల్ బ్యాగు బరువుపై విద్యాశాఖ ఇచ్చిన సూచనలు అమలుకావడంలేదని నివేదించాయి. హాస్టళ్లలో ఉంటూ తరగతులకు హాజరవుతున్నందున విద్యార్థులు పుస్తకాలను బ్యాగుల్లో మోయాల్సిన అవసరం ఉండదని, అయితే టేబుల్ డెస్క్‌లలో పెట్టుకోడానికి తగిన స్థలం లేనందువల్లనే బ్యాగులలో పెట్టుకుంటున్న ట్లు వెల్లడైందని ఈ బృందాలు వ్యాఖ్యానించాయి. ఒక్కో విద్యార్థి బ్యాగు సగటు బరువు దాదాపు 10 కెజిల వరకు ఉందని, ఒక్కో సబ్జెక్ట్‌కు 4 నోట్‌బుక్‌లతో పాటు హోంవర్క్, క్లాస్‌వర్క్, ఎఫ్ఎ, 3 ఆర్స్ ఇలా చాలా ఉన్నట్లు పేర్కొన్నాయి. ఎఫ్ఎలకూ ఒక సబ్జెక్ట్‌కు 3 వరకు నోట్ బుక్‌లు ఉన్నాయి. ఫెయిర్ నోట్స్, రఫ్ నోట్స్ అనే వ్యత్యాసం లేకుండా నోట్‌బుక్స్ ఉన్నట్లు గుర్తించారు.

విద్యార్థుల కనీస సామర్థ్యాలపై దృష్టి

కెజిబివిల్లో విద్యార్థుల కనీస సామర్థ్యాలపై దృష్టి సారించాలని తనిఖీ బృందాలు సిఫార్సు చేశాయి. కెజిబివిల్లో 47 శాతం మంది విద్యార్థులు మాత్రమే కనీస సామర్థ్యం కలిగి ఉన్నారని, ప్రత్యేక కార్యాచరణతో ఈ విద్యాసంవత్సరం చివరికి అందరికీ కనీస సామర్థ్యం ఉండేలా చూడాలని సిఫారసు చేశాయి. ఇందుకోసం కెజిబివి టీచర్లకు నాలుగు రోజులపాటు శిక్షణ ఇవ్వాలని సూచించాయి. ఒక సబ్జెక్ట్‌కు ఒక నోట్‌బుక్ మాత్రమే ఉండేలా చూడాలని, పిల్లల జవాబు పత్రాలు, క్యుములేటివ్ రికార్డులు వారి తల్లిదండ్రులకు అందేలా చూడాలని సిఫార్సు చేశాయి. స్కూల్ బ్యాగు బరువుపై విద్యాశాఖ ఇచ్చిన సూచనలపై ఉపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లతో పాటు విద్యార్థులకు అవగాహన కల్పించాలని నివేదించాయి.

గాయంతో డివిలియర్స్ ఔట్..



జోహెన్నస్‌బర్గ్: ట్వంటీ–20 సిరీస్ ప్రారంభానికి ముందే సౌతాఫ్రికాకు మరో షాక్ తగిలింది. ఇప్పటికే గాయాలతో కెప్టెన్ డుప్లెసిస్, వికెట్ కీపర్ డికాక్‌లు దూరం కాగా, వారి బాటలో తాజాగా సీనియర్ ఆటగాడు డివిలియర్స్ చేరాడు. మోకాలి నొప్పితో బాధపడుతున్న డివిలియర్స్ మూడు మ్యాచ్‌ల టి–20 సిరీస్‌కు దూరమయ్యాడు. అతనికి బదులు మరోకరిని తీసుకునేది లేదని దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు తెలిపింది. ఇప్పటికే వన్డే సిరీస్‌లో ఘోర పరాజయం పాలైన దక్షిణాఫ్రికా కనీసం టి–20లోనైన గెలిచి పరువు కాపాడుకోవాలని భావించింది. అయితే సిరీస్ ప్రారంభానికి ముందే జట్టుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన డివిలియర్స్ కూడా సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో సౌతాఫ్రికా కష్టాలు మరింత పెరిగాయి. వన్డే సిరీస్‌లో గెలిచి దూకుడు మీదున్న భారత్‌కు టి–20 సిరీస్‌లో కూడా అవకాశాలు మెరుగయ్యాయి. ఇప్పటికే డుప్లెసిస్, డికాక్, ఆమ్లా తదితరులు జట్టుకు దూరమయ్యారు. ఈ పరిస్థితుల్లో డివిలియర్స్ తప్పు కోవడం జట్టుకు తీవ్ర పరిణామంగా మారింది. ఈ లోటును పూడ్చుకోవడం దక్షిణాఫ్రికాకు చాలా కష్టమని విశ్లేషకులు సైతం అంచన వేస్తున్నారు.

టి-20లోనూ అదే జోరు

చెలరేగిన భువనేశ్వర్, ధావన్ మెరుపులు, హెండ్రిక్స్ పోరాటం వృథా, సౌతాఫ్రికాపై భారత్ గెలుపు

జోహెన్నస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి ట్వంటీ–20 మ్యాచ్‌లో భారత్ 28 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యాన్ని అందుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షో అదరగొట్టిన టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. తర్వాత భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 175 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. భువనేశ్వర్ కుమార్ అసాధారణ బౌలింగ్‌తో ఐదు వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటికే వన్డే సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా టి–20 సిరీస్ తొలి మ్యాచ్‌లోనే ఓటమి పాలై ఇబ్బందుల్లో పడింది. సిరీస్‌ను గెలవాలంటే సౌతాఫ్రికా మిగిలిన రెండు మ్యాచుల్లోనూ గెలవక తప్పదు. కాగా, అద్భుత బౌలింగ్‌తో భారత్‌ను గెలిపించిన భువనేశ్వర్ కుమార్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

భువీ దెబ్బ...



భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన దక్షిణాఫ్రికాకు ఓపెనర్లు రీజా హెండ్రిక్స్, స్మట్స్ మెరుగైన ఆరంభాన్నే ఇచ్చారు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. స్మట్స్ 9 బంతుల్లోనే మూడు ఫోర్లతో 14 పరుగుల చేశాడు. అయితే కుదురుగా ఆడుతున్న స్మట్స్‌ను భువనేశ్వర్ వెనక్కి పంపి సౌతాఫ్రికాకు తొలి దెబ్బ తీశాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ డుమి (3) కూడా నిరాశ పరిచాడు. భువీ బౌలింగ్‌లోనే రైనాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ప్రమాదకర ఆటగాడు డేవిడ్ మిల్లర్ కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. ఒక సిక్స్‌తో 9 పరుగులు చేసిన మిల్లర్‌ను హార్దిక్ పాండ్య వెనక్కి పంపాడు. దీంతో 48 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది.

హెండ్రిక్స్ పోరాటం..

ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను హెండ్రిక్స్ తనపై వేసుకున్నాడు. అతనికి ఫర్హాన్ బెహార్డిన్ అండగా నిలిచాడు. ఇద్దరు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను బౌండరీలుగా మలుస్తూ స్కోరు వేగం తగ్గకుండా చూశారు. ఈ జోడీని విడగొట్టేందుకు భారత బౌలర్లు చేసిన ప్రయత్నాలు చాలా సేపటి వరకు ఫలించలేదు. ఇద్దరు కుదురైన బ్యాటింగ్‌తో దక్షిణాఫ్రికాను లక్ష్యం దిశగా నడిపించారు. అంతేగాక కళ్లు చెదిరే షాట్లతో భారత బౌలర్లను హడలెత్తించారు. ఇదే క్రమంలో సౌతాఫ్రికా స్కోరును వంద పరుగులు దాటించారు. అయితే ప్రమాదకరంగా మారిన ఈ జోడీని చాహల్ విడగొట్టాడు. 27 బంతుల్లోనే మూడు ఫోర్లు, మరో రెండు సిక్సర్లతో 39 పరుగులు చేసిన బెహార్డిన్‌ను చాహల్ వెనక్కి పంపాడు. దీంతో 81 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత భారత బౌలర్లు తిరిగి మ్యాచ్‌పై పట్టు సాధించారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన హెండ్రిక్స్ 50 బంతుల్లోనే 8 ఫోర్లు, సిక్స్‌తో 70 పరుగులు సాధించి భువనేశ్వర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. చివర్లో వచ్చిన బ్యాట్స్‌మెన్ జట్టును ఆదుకోవడంలో విఫలమయ్యారు. దీంతో సౌతాఫ్రికా స్కోరు 175 పరుగులకే పరిమితమైంది.



72

ధావన్ ధనాధన్..

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌ను ఓపెనర్ శిఖర్ ధావన్ అద్భుత బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. మరో ఓపెనర్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లోనూ నిరాశ పరిచాడు. ధాటిగా ఆడిన రోహిత్ రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 9 బంతుల్లోనే 21 పరుగులు చేసి జోరుమీద కనిపించాడు. అయితే డాలా వేసిన చక్కటి బంతికి వికెట్ల వెనకాల దొరికి పోయాడు. తర్వాత వచ్చిన సురేశ్ రైనా కూడా ధాటిగా ఆడినా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. చెలరేగి ఆడిన రైనా ఏడు బంతుల్లో రెండు ఫోర్లు, సిక్స్‌తో 15 పరుగులు చేసి డాలా బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ధావన్ తన జోరును కొనసాగించాడు. ధాటిగా ఆడుతూ స్కోరును పరిగెత్తించాడు. కెప్టెన్ కోహ్లి కూడా తన మార్క్ షాట్లతో అలరించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన కోహ్లి రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో 26 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. మరోవైపు మనీష్ పాండే సమన్వయంతో ఆడుతూ ధావన్‌కు అండగా నిలిచాడు. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన ధావన్ 39 బంతుల్లోనే పది ఫోర్లు, మరో రెండు సిక్సర్లతో 72 పరుగులు చేశాడు. కాగా, సెంచరీ దిశగా సాగుతున్న ధావన్ ఫెలుక్‌వాయో బంతికి వికెట్ల వెనుక దొరికి పోయాడు. ధోని రెండు ఫోర్లతో 16, హార్దిక్ రెండు ఫోర్లతో 13 పరుగులు చేశాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన మనీష్ పాండే ఓ సిక్స్‌తో 29 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో బారత్ స్కోరు 203కు చేరింది.



స్కోరు బోర్డు:

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) క్లాసెన్ (బి) జూనియర్ డాలా 21, శిఖర్ ధావన్ (సి) క్లాసెన్ (బి) ఫెలుక్‌వాయో 72, సురేశ్ రైనా (సి) అండ్ (బి) జూనియర్ డాలా 15, విరాట్ కోహ్లి ఎల్బీ (బి) తబ్రేజ్ షంసి 26, మనీష్ పాండే 29 (నాటౌట్), మహేంద్ర సింగ్ ధోని (బి) క్రిస్ మోరిస్ 16, హార్దిక్ పాండ్య (నాటౌట్) 13, ఎక్స్‌ట్రాలు 11, మొత్తం 20 ఓవర్లలో 203/5.
బౌలింగ్: డేన్ పాటర్సన్ 4–0–48–0, జూనియర్ డాలా 4–0–47–2, క్రిస్ మోరిస్ 4–0–39–1, తబ్రేజ్ షంసి 4–0–37–1, స్మట్స్ 2–0–14–0, ఫెలుక్‌వాయో 2–0–16–1.
దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: స్మట్స్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ కుమార్ 14, రీజా హెండ్రిక్స్ (సి) ధోని (బి) భువనేశ్వర్ 70, డుమిని (సి) రైనా (బి) భువనేశ్వర్ 3, డేవిడ్ మిల్లర్ (సి) ధావన్ (బి) హార్దిక్ పాండ్య 9, బెహార్డిన్ (సి) మనీష్ పాండే (బి) చాహల్ 39, హెన్రిచ్ క్లాసెన్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 16, ఫెలుక్‌వాయో (సి) చాహల్ (బి) ఉనద్కట్ 13, క్రిస్ మోరిస్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 0, డేన్ పాటర్సన్ రనౌట్ 1, జూనియర్ డాలా (నాటౌట్)2, తబ్రేజ్ షంసి (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు 8, మొత్తం 20 ఓవర్లలో 175/9.
బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 4–0–24–5, జైదేవ్ ఉనద్కట్ 4–0–33–1, జస్‌ప్రిత్ బుమ్రా 4–0–32–0, హార్దిక్ పాండ్య 4–0–45–1, యజువేంద్ర చాహల్ 4–0–39–1.

ఇంగ్లాండ్ ఇంటికి

ఓడినా కివీస్ ఫైనల్‌కు, ముక్కోణపు టోర్నీ



హామిల్టన్: ఆస్ట్రేలియాలో జరుగుతున్న ముక్కోణపు ట్వంటీ–20 సిరీస్‌లో న్యూజిలాండ్ ఫైనల్‌కు చేరింది. ఆదివారం ఆఖరి లీగ్ మ్యాచ్‌లో కివీస్ రెండు పరుగుల తేడాతో ఓటమి పాలైంది. అయితే ఈ మ్యాచ్‌లో ఓడినా మెరుగైన రన్‌రేట్ ఆధారంగా కివీస్ తుది పోరుకు దూసుకెళ్లింది. మరోవైపు చివరి మ్యాచ్‌లో గెలిచినప్పటికీ ఇంగ్లాండ్ టోర్నీ నుంచి నిష్క్రమించక తప్పలేదు. ఆస్ట్రేలియా ఇప్పటికే ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే. బుధవారం జరిగే ఫైనల్లో కివీస్‌తో తలపడుతుంది. ఆదివారం జరిగిన భారీ స్కోర్ల మ్యాచ్‌లో ఇంగ్లాండ్ రెండు పరుగుల తేడాతో కివీస్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కివీస్ నిర్ణీత ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసి ఓటమి పాలైంది. ఫైనల్‌కు చేరాలంటే భారీ తేడాతో గెలవాల్సిన ఇంగ్లాండ్ అందులో విఫలమైంది. కేవలం రెండు పరుగుల తేడాతో మాత్రమే గెలిచి ఫైనల్ అవకాశాన్ని కోల్పోయింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కివీస్ విజయం కోసం చివరి వరకు తీవ్రంగా పోరాడింది. అయితే ఆఖరి ఓవర్లో విజయానికి రెండు పరుగుల దూరంలో నిలిచి పోయింది. క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన కివీస్‌కు ఓపెనర్లు మార్టిన్ గుప్టిల్, కొలిన్ మున్రో శుభారంభం అందించారు. ఇద్దరు తమ మార్క్ షాట్లతో చెలరేగి పోయారు. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన మున్రో ఇంగ్లాండ్ బౌలర్లను హడలెత్తించాడు. భారీ షాట్లతో చెలరేగిన మున్రో 21 బంతుల్లోనే 57 పరుగులు చేశాడు. ఇందులో ఏడు భారీ సిక్స్‌లు, మరో మూడు ఫోర్లు ఉన్నాయి. ఈ క్రమంలో తొలి వికెట్‌కు 6.3 ఓవర్లోనే 78 పరుగులు జోడించాడు. మరోవైపు గుప్టిల్ కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లాండ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న గుప్టిల్ 47 బంతుల్లో 4 సిక్సర్లు, మరో 3ఫోర్లతో 62 పరుగులు సాధించాడు. చాప్‌మాన్ రెండు ఫోర్లు, మరో రెండు సిక్స్‌లతో అజేయంగా 37 పరుగులు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇంగ్లాండ్ బౌలర్లు చివర్లో పొదుపుగా బౌలింగ్ చేయడంతో కివీస్ విజయానికి రెండు పరుగుల దూరంలో నిలిచి పోయింది.



మోర్గాన్ జోరు...

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్‌ను డేవిడ్ మలాన్, కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ ఆదుకున్నారు. ఓపెనర్ అలెక్స్ హెల్ (1), జాసన్ రాయ్ (21) ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయారు. ఈ దశలో ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే బాధ్యతను మలాన్, మోర్గాన్ తమపై వేసుకున్నారు. ఇద్దరు కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును పరిగెత్తించారు. మలాన్ ఐదు భారీ సిక్స్‌లు, మరో రెండు ఫోర్లతో 36 బంతుల్లోనే 53 పరుగులు చేశాడు. ఈ క్రమంలో మూడో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యంలో పాలుపంచుకున్నాడు. కాగా, కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన మోర్గాన్ 46 బంతుల్లోనే ఆరు సిక్సర్లు, మరో 4ఫోర్లతో అజేయంగా 80 పరుగులు చేశాడు. దీంతో ఇంగ్లాండ్ స్కోరు 194 పరుగులకు చేరింది.


శ్రీలంకకు సిరీస్



సిల్హెట్:బంగ్లాదేశ్‌తో జరిగిన ట్వంటీ–20 సిరీస్‌ను శ్రీలంక 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన రెండో టి–20లో శ్రీలంక 75 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. ఈ గెలుపుతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను దక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య బంగ్లాదేశ్ ప్రత్యర్థి బౌలర్ల ధాటికి తట్టుకోలేక 18.4 ఓవర్లలోనే కేవలం 135 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవి చూసింది. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో బంగ్లా ఏ దశలోనూ లంకకు కనీస పోటీ కూడా ఇవ్వలేక పోయింది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన లంకకు ప్రారంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్ సౌమ్య సర్కార్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. వన్‌డౌన్‌లో వచ్చిన వికెట్ కీపర్, సీనియర్ ఆటగాడు ముష్ఫికుర్ రహీం (6) కూడా నిరాశ పరిచాడు. మ హ్మద్ మిథున్ కూడా (5) ఎక్కువ సేపు క్రీజులో నిలువడంలో విఫమయ్యా డు. ధాటిగా ఆడిన ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 29 పరుగులు చేసి వెనుదిరిగాడు. దీంతో బంగ్లా మళ్లీ కోలుకోలేక పో యింది. లంక బౌలర్లు వరుస క్రమంలో వికెట్లు తీస్తూ బంగ్లాను ఆత్మరక్షణలో పడేశారు. జట్టులో కెప్టెన్ మహ్మదుల్లా మాత్రమే ఒంటరి పోరాటం చేశాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన మహ్మదుల్లా 4ఫోర్లు, సిక్స్‌తో 41 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా వారిలో సైఫుద్దీన్ (20), మెహ ది హసన్ (11) మాత్రమే రెండంకెలా స్కోరును అందుకున్నారు. లంక బౌలర్లలో షెహాన్ మధుశంకా, గుణతిలక రెండేసి వికెట్లు పడగొట్టారు.

చెలరేగిన కుశాల్...

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంకను టాప్ ఆర్డర్ ఆదుకుంది. ఓపెనర్లు గుణతిలక, కుశాల్ మెండిస్‌లు దూకుడుగా ఆడుతూ జట్టుకు శుభారంభం అందించారు. ఇద్దరు పోటీ పడి ఆడుతూ స్కోరును పరిగెత్తించారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన గుణతిలక 37 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. మరోవైపు చెలరేగి ఆడిన కుశాల్ మెండిస్ ఆరు ఫోర్లు, మరో మూడు సిక్స్‌లతో 42 బంతుల్లోనే 70 పరుగులు సాధించాడు. తిసారా పెరీరా మూడు ఫోర్లు, సిక్స్‌తో 17 బంతుల్లో 31, ఉపుల్ తరంగ 4 ఫోర్లు, ఒక సిక్స్‌తో వేగంగా 25 పరుగులు చేశారు. చివరల్లో దాసున్ శనక ఐదు ఫోర్లు, సిక్స్‌తో 11 బంతుల్లోనే అజేయంగా 30 పరుగులు సాధించాడు. దీంతో లంక స్కోరు 210కి చేరింది.



భారత మహిళలకు తొలి ఓటమి

మూడో టి-20లో సౌతాఫ్రికా గెలుపు

జోహెన్నస్‌బర్గ్: భారత్‌తో ఆదివారం జరిగిన మూడో ట్వంటీ–20లో ఆతిథ్య దక్షిణాఫ్రికా మహిళా జట్టు ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఆధిక్యాన్ని 2–1కి తగ్గించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 17.5 ఓవర్లలో 133 పరుగులకే కుప్పకూలింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా ఉమెన్స్ జట్టు 19 ఓవర్లలోనే ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్ లిజెలి లి (5) ప్రారంభంలోనే ఔటైనా తర్వాత వచ్చిన బ్యాటర్లు నిలకడగా ఆడుతూ జట్టును గెలిపించారు. ఓపెనర్‌గా వచ్చిన కెప్టెన్ వాన్ నికార్క్ ఐదు ఫోర్లతో 26 పరుగులు చేసింది. స్టార్ క్రికెటర్ సూనె లూస్ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ జట్టును లక్ష్యం దిశగా నడిపించింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన లూస్ ఐదు ఫోర్లతో 41 పరుగులు సాధించింది. డు ప్రిజ్ కూడా భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. సమన్వయంతో ఆడిన ప్రిజ్ 20 పరుగులు చేసింది. మరోవైపు ట్రియాన్ దూకుడైన బ్యాటింగ్‌తో సౌతాఫ్రికాకు విజయం సాధించి పెట్టింది. చెలరేగి ఆడిన ట్రియాన్ 15 బంతుల్లోనే 4 ఫోర్లు, మరో రెండు సిక్సర్లతో 34 పరుగులు చేసింది. దీంతో దక్షిణాఫ్రికా మరో ఓవర్ మిగిలివుండగానే ఐదు వికెట్ల తేడాతో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 133 పరుగులకే పరిమితమైంది. తొలి రెండు మ్యాచుల్లో మెరుపులు మెరిపించిన సీనియర్ క్రికెటర్ మిథాలీ రాజ్ (0) ఈ మ్యాచ్‌లో ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరింది. అయితే మరో ఓపెనర్ స్మృతి మందన తన మార్క్ బ్యాటింగ్‌తో ఆకట్టుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో కలిసి రెండో వికెట్‌కు 55 పరుగులు జోడించింది. ధాటిగా ఆడిన మందన ఐదు ఫోర్లు, ఒక సిక్స్‌తో 37 పరుగులు సాధించింది. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన హర్మన్‌ప్రీత్ కౌర్ ఆరు ఫోర్లు, రెండు సిక్స్‌లతో వేగంగా 48 పరుగులు చేసింది. మిగతావారిలో వేద కృష్ణమూర్తి (23) తప్ప ఎవరూ కూడా రెండంకెలా స్కోరును అందుకోలేక పోయారు. దీంతో భారత్ ఇన్నింగ్స్ 133 పరుగుల వద్దే ముగిసింది. సౌతాఫ్రికా జట్టులో షబ్నమ్ ఇస్మాయిల్ ఐదు వికెట్లు తీసింది. మసబాతా క్లాస్‌కు రెండు వికెట్లు లభించాయి.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.